అనుదినం... జనస్వరం

Dwaraka

నవతెలంగాణ

ఆదివారం 14-1 -2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 17 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు + సోపతి వెల : 6.00

న్యాయ వ్యవస్థను కాపాడాలనే నోరువిప్పాం

- మా చర్యతో సుప్రీంలో పారదర్శకత : జస్టిస్ కురియన్ జోసెఫ్

2



చీఫ్ జస్టిస్ ఇంటి ముందు కారులో..

- ప్రధాని ముఖ్యకార్యదర్శి ఫోటో వైరల్..!!
- న్యూ ఇయర్ గ్రీటింగ్స్ ఇచ్చేందుకు వెళ్లానంటూ వివరణ
- ప్రత్యేక దూతను ఎందుకు పంపారో చెప్పాలి: కాంగ్రెస్

2



భయం వదిలి మాట్లాడండి..

- ప్రమాదం పొంచి ఉన్నది.. ఎమర్జెన్సీ రోజులు గుర్తొస్తున్నాయి : కేంద్ర మంత్రులకు బీజేపీ సీనియర్ నేత యశ్వంత్‌సిన్హా సూచన

2



సంక్షోభ నివారణకు యత్నం

- చీఫ్ జస్టిస్, సీనియర్ జడ్జీలతో భేటీకి..
- ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం ఏర్పాటు : బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా

2



కూలిన ఓఎన్‌జీసీ హెలికాప్టర్

- నలుగురి మృతి, మరో ముగ్గురు గల్లంతు
- ముంబయిలో ఘోర ప్రమాదం

ముంబయి: ఆయిల్ అండ్ నేచరల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) సిబ్బందితో వెళ్తున్న హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. హెలికాప్టర్ శకలాలను నేవి అధికారులు సముద్ర తీర ప్రాంతంలో గుర్తించారు. మహారాష్ట్రలోని జుహూ విమానాశ్రయం నుంచి శనివారం ఉదయం 10.30 గంటలకు ఐదుగురు ఓఎన్‌జీసీ సిబ్బందితో పవన్ హాన్స్ హెలికాప్టర్ బయలు దేరింది. హెలికాప్టర్‌లో ఇద్దరు పైలట్లు ఉన్నారు. కాగా.. చాపర్ 22 మైళ్ల దూరం వెళ్లిన తర్వాత దానికి కంట్రోల్ రూంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న నేవి సిబ్బంది సముద్ర తీర ...9లో



రిజిస్ట్రేషన్‌కు రెక్కలు



డిసెంబరుకే రూ. 3889. 28 కోట్లు

- మరింత ఆదాయం వచ్చే అవకాశం ?
- పుంజుకున్న రియాల్టీ
- హెచ్‌ఎండీఏ పరిధిలో అధికం
- నోట్ల రద్దుతో రూ. 1500 కోట్లు హుష్‌కాకీ ?



రాష్ట్రంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్లకు శాఖకు ఈ ఏడాది భారీగా ఆదాయం సమకూరింది. ఇప్పటికే గత ఏడాదితో పోలిస్తే అధికంగా రిజిస్ట్రేషన్లు చేసిన ఆ శాఖ, వచ్చే మార్చి నాటికి గతంలో ఎన్నడూలేని విధంగా సొమ్ము రాబట్టనుంది. మియాపూర్ భూముల కుంభకోణం తరువాత రిజిస్ట్రేషన్లశాఖలో సబ్‌రిజిస్ట్రార్ల దగ్గర నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులను ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అంతేగాక నోట్లరద్దు ప్రభావం కొనసాగింది. 9

తన భార్యకు ఆ కుటుంబం ఓటు వేయలేదని...

వివరాలు 2లో

బలవంతంగా మద్యం తాగించి.. సామూహిక లైంగికదాడి

హైదరాబాద్‌లో సచివాలయం ముందు ప్రధాన రహదారి



బోసిపోయిన భాగ్యనగరం

కొత్త పాసుపుస్తకాలిస్తాం

- మార్చి 11న రాష్ట్రపతి లేదా ప్రధాని చేతులమీదుగా ప్రారంభం
- ఆ రోజు నుంచే కొత్త రిజిస్ట్రేషన్ విధానం అమలు
- ల్యాండ్ వెబ్‌సైట్‌కు 'ధరణి' నామకరణం
- త్వరలో పార్ట్ బి సర్వే
- రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌గా వాకాటి కరుణకు అదనపు బాధ్యతలు : సీఎం సమీక్ష



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మార్చి 11న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఒకే రోజు కొత్త పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేయనున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. కొత్త పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి లేదా ప్రధానమంత్రిని ఆహ్వానించనున్నట్టు సీఎం వెల్లడించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా కేవలం తెలంగాణలో మాత్రమే సమగ్ర భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టామన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన ఈ కార్యక్రమం తర్వాత భూమి వివరాలు ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయని, ఈ వివరాలతో కూడిన పాస్ పుస్తకాలు కొత్తగా ప్రింట్ చేస్తున్నట్టు సీఎం తెలిపారు. ఇవే వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పెడతామన్నారు. కోర్ బ్యాంకింగ్ తరహాలో ...9లో



మోడీ మరో హిట్లర్

- హిందూ రాజ్యం ఏర్పాటే లక్ష్యంగా ముందుకు
- ప్రజాస్వామ్యవాదులు, మేధావులు అప్రమత్తంగా ఉండాలి : ఆనంద్‌తేల్ తుంబ్డే
- కేంద్రం విధానాలతో ఆర్‌బీఐ, విశ్వవిద్యాలయాలు ధ్వంసం : హరగోపాల్

3

శిరోముండనంతో టీచర్ల నిరసన



- బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో అధ్యాపకుల ఆగ్రహం
- సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్

2



ఎన్నికలెప్పుడొచ్చినా సిద్ధమే

- ముందస్తుకు వెళ్లే ధైర్యం కేంద్రానికి ఉందా?
- బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి : విలేకరుల ఇష్టాగోష్టిలో మంత్రి కేటీఆర్

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

ముందస్తు ఎన్నికలకు వెళ్లేంత ధైర్యం కేంద్రానికి ఉందా? అని తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. తమది పనిచేసే ప్రభుత్వం అని, ఎన్నికలెప్పుడు వచ్చినా తాము సిద్ధమని అన్నారు. విభజన చట్టం ప్రకారం నియోజకవర్గాల పున్విభజన ఉంటుందని భావిస్తున్నట్లు మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం సచివాలయంలో ఆయన విలేకరుల ఇష్టాగోష్టిలో పలు విషయాలు వెల్లడించారు. చిట్‌చాట్‌లో పాల్గొన్నారు. కేంద్రంపై ప్రజల్లో అసంతప్తి కనిపిస్తున్నదన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం ముందస్తు ఎన్నికలకు వెళ్లకపోవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. 24 గంటల కరెంట్‌పై ఎలాంటి ఆధారాలు లేకుండానే కాంగ్రెస్ నేతలు ఇష్టమొచ్చినట్టు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఏపీ విద్యుత్ ఇస్తామన్నా తెలంగాణ ప్రభుత్వం తీసుకోలేదంటూ కాంగ్రెస్ నేతలు పదే పదే చేస్తున్న ఆరోపణలను కూడా ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఇవ్వకుండా.. అన్ని ఏర్పాట్లు చేసుకున్నాక ఇస్తామంటే ఏం చేసుకోవాలని ప్రతిపక్షాలను ఎదురు ప్రశ్నించారు. జైలులో చిప్పకూడు తిన్నవారూ ...9లో

కొక్కొరోకో..



యువత కొత్తగానే ఆలోచిస్తుంది.. సార్.. మన నేతలే చెత్తగా ఆలోచిస్తున్నారు..!!

ఆన్‌లైన్ అంగట్లో నకిలీ!

పండుగ పూట ఆఫర్ల పేరిట ఈ-కామర్స్ సంస్థల మాయాజాలం

ఈ కామర్స్ దిగ్గజాలైన ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలు దేశీయంగా తమ మార్కెట్ వాటాను మరింత పెంచుకునేందుకు కొత్త వ్యూహాలతో ఎప్పటికప్పుడు ముందుకు వస్తుండగా.. స్నాప్‌డీల్, షాప్ క్లూస్, మింత్రా, జబాంగ్ వంటి మరికొన్ని ఆన్ లైన్ అంగడి సంస్థలు సైతం తమతమ పరిధిల్లో కస్టమర్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా, దీపావళి, దసరా, క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి వంటి ప్రత్యేక రోజుల్లో విభిన్న పేర్లతో భారీ ఎత్తున డిస్కౌంట్ ఆఫర్లను ప్రకటిస్తూ అమ్మకాల్లో దూసుకుపోవడమే లక్ష్యంగా ఉన్న ఆయా సంస్థల్లో అమ్మే వస్తువులను కొనుగోలు చేసుకునేముందు వినియోగదారులు పలు అంశాలు గమనించాలని విశ్లేషకులు పేర్కొంటున్నారు.


- నిజమైన ఎంఆర్‌పీ చూపకుండా భారీ డిస్కౌంట్లు
- ఆఫర్ల పేరుతో నకిలీ వస్తువుల అమ్మకం
- వినియోగదారుల మంత్రిత్వ శాఖ నిబంధనలు భేఖాతర్

9



పొలిటికల్ కమల్ ఎంట్రీపై క్లారిటీ

- 18న పార్టీ ప్రణాళిక వెల్లడి



చెన్నై : తమిళనాడు రాజకీయాలు వేడెక్కబోతున్నాయి. ఇప్పటికే సూపర్ స్టార్ రజనీకాంత్ పొలిటికల్ ఎంట్రీనిస్తామన్నారు. తమిళనాడులోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. .తాజాగా కమల్ హాసన్ రాజకీయ భవిష్యత్ ప్రణాళికను ఖరారు చేశారు. వికటన్ పత్రిక అవార్డుల ఫంక్షన్‌లో మాట్లాడుతూ..18న తాను రాజకీయాల్లోకి వచ్చే అంశంపై బహిరంగప్రకటన చేస్తానని తెలిపారు.ఈ విషయాలను వచ్చే వారం అమండ్ వికటన్ పత్రికలో ఆర్టికల్ రూపంలో ప్రకటిస్తానని చెప్పారు. 26న జరిగే గణతంత్ర వేడుకల్లో భాగగా తమిళనాడులో పర్యటనలు షురూ చేస్తానన్నారు.దీంతో రజనీకాంత్,కమల్‌హాసన్ ల మధ్య రాజకీయం మరింత ఆకర్షణీయంగా మారబోతుందని రాజకీయపరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అయితే కమల్ రాజకీయంగా ముందుకు వెళ్తారా..లేదా అన్నదానిపై సస్పెన్స్.

శిరోముండనంతో టీచర్ల నిరసన

భోపాల్ : మొన్నటివరకూ రైతుల ఆందోళనలతో అట్టుడికిన బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో ఇప్పుడు ఆధ్యాపకులు ఆందోళన బాట పట్టారు. రైతు ఆందోళనలతోపాటు.. సమాన పనికి సమానవేతనంతో పాటు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని 2017లో ఉపాధ్యాయులకు సంబంధించి వివిధ సంఘాలు, సంస్థలు.. ఐక్య ఉద్యమాల బాట పట్టాయి. అందులో భాగంగా 'అధ్యాపక్ అధికార్ యాత్ర' పేరుతో ఆందోళన చేపట్టిన ఉపాధ్యాయులు శనివారం భోపాల్‌లో గుండ్లు గీయించుకొని నిరసనకు దిగారు. మగవారితోపాటు, మహిళలు కూడా గుండ్లు గీయించుకుని ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. సమగ్ర బదిలీ విధానాలను రూపొందించాలని, సమానపనికి సమాన వేతనం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

గుజరాత్‌లో తీవ్రంగా నిరుద్యోగ సమస్య

- అసంతృప్తిలో యువత : గవర్నర్ ఒ.పి. కోహ్లి

గాంధీనగర్ : గుజరాత్‌లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, దీంతో యువత పూర్తి అసంతృప్తితో ఉన్నారని ఆ రాష్ట్ర గవర్నర్ ఒ.పి. కోహ్లి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది ఏ సమాజానికైనా ప్రమాద హెచ్చరిక వంటిందని అన్నారు. అలాగే బీజేపీ అభివృద్ధి నమూనా ప్రచారం పైనా గవర్నర్ విమర్శలు చేశారు. ఇక్కడ జరిగిన గుజరాత్ సాంకేతిక విశ్వవిద్యాలయం (జీటీయూ) ఏడవ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తూ గవర్నర్ ఈవ్యాఖ్యలు చేశారు. గవర్నర్ ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయం లో అదే వేదికపై ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. 'నిరుద్యోగం కారణంగా ప్రస్తుత రోజుల్లో యువత అసంతృప్తిగా ఉండడాన్ని మేము చూస్తున్నాం. ఉన్నత చదువులకు తగిన ఉద్యోగం రాకపోయినా అలాంటి భావన సహజంగా వుంటుంది. యువతలో ఇలాంటి అసంతృప్తి వుండటం ఏ సమాజానికైనా హెచ్చరిక వంటిది' అని కోహ్లి అన్నారు. గవర్నర్ వ్యాఖ్యలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న విజయ్ రూపానీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి చాలా ఇబ్బందికరంగా మారాయి. బీజేపీ అభివృద్ధి నమూనా ప్రచారంపైనా గవర్నర్ విమర్శలు చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ ప్రచార అస్త్రం అభివృద్ధి నమూనా ప్రజలను ఆకట్టుకోలేకపోయిందని, అందుకే కాంగ్రెస్‌పై స్వల్ప తేడాతో గట్టెక్కిందని వ్యాఖ్యానించారు. 'కొన్ని నగరాలు అభివృద్ధి చెందినంత మాత్రాన దేశం మొత్తం అభివృద్ధి చెందినట్టు కాదు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి. ముఖ్యంగా అట్టడుగున ఉన్న వారికి అవి చేరాలి' అని గవర్నర్ తెలిపారు. సమాజంలోనూ, యువతలోనూ సంతృప్తి ఉండాలని అన్నారు. సంతృప్తి కలిగించని విద్యతో ఎలాంటి ప్రయోజనం ఉండదని గవర్నర్ ఉద్ఘాటించారు. కాగా, గవర్నర్ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని గుజరాత్ విద్యాశాఖ మంత్రి భూపేంద్రసిన్హా అన్నారు. అయినా ఆయన వ్యాఖ్యలను సానుకూలంగా తీసుకుంటామని అన్నారు.

మా భూములు మాగ్గావాలే..

- నిజాం వారసుల డిమాండ్

ముంబయి: మహారాష్ట్రలో ఉన్న 277 ఎకరాల రాయల్ ప్రాపర్టీని తమకు అప్పగించాలని నిజాం చివరి రాజు(మీర్ ఉస్మాన్ అలీఖాన్) వారసులు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలోని ఔరంగాబాద్ జిల్లాలో ఉస్మాన్ అలీఖాన్ మనువడు నవాబ్ నజఫ్ అలీఖాన్ శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న నిజాం ప్రభువుల పేరిట ఉన్న 277 ఎకరాల భూమిని భౌతికంగా తమకు స్వాధీనం చేయాలని, లేదంటే తగిన పరిహారం ఇవ్వాలని తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. 1950 జనవరి 25న కేంద్రానికి, మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు మధ్య భూములకు సంబంధించిన ఒప్పందం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ క్రమంలోనే స్థిర ఆస్తుల వివరాలన్నింటినీ ఉస్మాన్.. కేంద్రం ముందు ఉంచినట్టు వివరించారు. ఔరంగాబాద్‌లో ఉన్న భూములపై తమకు చట్టపరమైన హక్కు ఉన్నదని తెలిపారు. జిల్లాలోని హిమాయత్ బాగ్‌లో 160, అహ్మద్‌బాగ్‌లో 94, నవ్‌కందాలో 23 ఎకరాల చొప్పున రాయల్ ప్రాపర్టీ ఉన్నదని చెప్పారు. ఈ భూములు చట్టబద్ధంగా తమకే చెందుతాయని రుజువు చేయడానికి అవసరమైన డాక్యుమెంట్లు ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో నజఫ్‌తో పాటు నిజాం వారసులు నవాబ్‌అలీఖాన్, నవాబ్ కరమ్ అలీఖాన్, ఇక్బాల్ పాషా, షాజహాన్ ఫెరోజ్‌లు పాల్గొన్నారు. నజఫ్ చెబుతున్న 277 ఎకరాల భూమిలో పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నట్టు తెలుస్తున్నది.

'చంద్రయాన్-2'కు ఇస్రో కసరత్తు

శ్రీహరికోట : పీఎస్ఎల్‌వీ-సీ40 ప్రయోగం సక్సెస్ నింపిన ఉత్సాహంతో మరో భారీ ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సిద్ధమవుతున్నది. తదుపరి ప్రయోగంలో భాగంగా చంద్రయాన్-2ను నింగిలోకి పంపించేందుకు కసరత్తు చేస్తున్నది. ప్రయోగ పరికరాలు పరీక్షల దశలో ఉన్నాయని ఇస్రో శనివారం తెలిపింది. చంద్రుని పైకి ఇదివరకే చంద్రయాన్-1ను పంపించారు. ఇది రెండో ప్రయోగం. చంద్రయాన్-2లో చంద్రుని ఉపరితలాన్ని అన్వేషించడానికి రోవర్‌ను ఇస్రో సిద్ధం చేస్తున్నది. కాగా దీనిని మార్చిలో ప్రవేశపెట్టడంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఇస్రో మాజీ చైర్మెన్ ఎఎస్ కిరణ్‌కుమార్ శుక్రవారం (ఈయన పదవీకాలం ఇదే రోజుతో ముగిసింది) తెలిపారు.

కార్తీ చిదంబరం నివాసాలపై ఈడీ దాడులు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శనివారం సోదాలు చేసింది. మనీలాండరింగ్ కేసుకు సంబంధించి ఢిల్లీ, చెన్నైలోని ఆయన నివాసాల్లో ఈ తనిఖీలు నిర్వహించింది. దీనిని కాంగ్రెస్ తీవ్రంగా తప్పుపట్టింది. ఇది మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రపూరిత చర్యగా అని కాంగ్రెస్ అభివర్ణించింది.

విద్యార్థుల విహారయాత్రలో విషాదం

- మహారాష్ట్రలో పడవ బోల్తాపడి ముగ్గురు మృతి

ముంబయి: మహారాష్ట్రలో విద్యార్థుల విహారయాత్ర విషాదంగా ముగిసింది. వారు వెళ్తున్న పడవ బోల్తా పడటంతో ముగ్గురు విద్యార్థినులు మృతి చెందగా.. ఐదుగురు గల్లంతయ్యారు. మరో 32మంది సురక్షితంగా బయటపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని పాల్‌గఢ్ జిల్లా దహను ప్రాంతంలో ఓ ప్రయివేటు స్కూలు, కళాశాల విద్యార్థులు 40మంది శనివారం ఉదయం బోటులో విహారయాత్రకు వెళ్లారు. కాగా.. సముద్ర తీరానికి రెండు నాటికల్ మైళ్ల దూరంలో బోటు బోల్తా పడింది. 32 మంది విద్యార్థులు, పాఠశాల సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు.గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టగాముగ్గురు బాలికల మృతదేహాలు లభ్యమయ్యాయి. మిగిలిన ఐదుగురు విద్యార్థుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక జాలర్లు రక్షణా చర్యలు చేపట్టినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బోటులో ఉన్న విద్యార్థులంతా సెల్ఫీలు దిగే క్రమంలో ఒకే వైపునకు వచ్చారని, ఈక్రమంలో పడవ పక్కకు ఒరిగి తిరగబడిందని వారు చెప్పారు. 'గాలింపు చర్యల్లో భాగంగా ఘటనాస్థలికి నౌకలను పంపించాం. డామన్ నుంచి వచ్చిన డార్నియర్ విమానం, హెలికాప్టర్‌లను కూడా రంగంలోకి దించాం' అని కోస్ట్‌గార్డ్ పీఆర్‌వో వెల్లడించారు.



సంక్షోభ నివారణకు..

చీఫ్ జస్టిస్, సీనియర్ జడ్జీలతో భేటీకి..

- ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం ఏర్పాటు : బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు నలుగురు సీనియర్ జడ్జీలు, ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) దీపక్‌మిశ్రా మధ్య ఏర్పడ్డ సమస్య పరిష్కారానికి ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) తెలిపింది. చీఫ్ జస్టిస్‌పై సీనియర్ జడ్జిల ఆరోపణల నేపథ్యంలో బీసీఐ శనివారం సమావేశమైంది. సుప్రీంకోర్టు జడ్జీలతో భేటీ అయి సమస్యను త్వరలో పరిష్కరించడం కోసం ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించినట్టు బీసీఐ చైర్మన్ మనన్‌కుమార్‌మిశ్రా తెలిపారు. మెమోరాండం ఆఫ్ ప్రొసీజర్(ఎంవోపీ)కి త్వరగా తుది రూపు ఇవ్వాలని, దీనిపై కేంద్ర ప్రభుత్వానికి కూడా లేఖ రాయనున్నట్టు మిశ్రా తెలిపారు. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామక విధానాన్ని ఎంవోపీలో పొందుపరచనున్నారు. దురదృష్టవశాత్తూ న్యాయ వ్యవస్థపై మాట్లాడేందుకు రాహుల్‌గాంధీసహా రాజకీయ పార్టీలకు మేం ఓ అవకాశమిచ్చాం. ఈ అంశాన్ని రాజకీయం చేయొద్దని రాహుల్‌తోపాటు రాజకీయ పార్టీలను బీసీఐ తరపున కోరుతున్నానని మిశ్రా అన్నారు.

ఇదే అంశంపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్(ఎస్‌సీబీఏ) కూడా సమావేశమై రెండు తీర్మానాలు చేసింది. జడ్జీలు, ప్రధాన న్యాయమూర్తి మధ్య రోస్టర్ లేదా ఎంవోపీపై త్వరగా ఓ పరిష్కారం కుదరడానికి సాధ్యమైతే సోమవారమే ఫుల్‌కోర్టుకు నివేదించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్‌సింగ్ సూచించారు. న్యాయ వ్యవస్థ విశ్వసనీయతను నిలబెట్టడం కోసం ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను సుప్రీంకోర్టు కొలీజియం లోని మొదటి ఐదుగురు న్యాయమూర్తుల పరిధిని దాటి పోకుండా ఓ విధానాన్ని రూపొందించు కోవాలని బార్‌కౌన్సిల్ తరపున రెండో సూచన చేశారు.

ప్రాధాన్యత గల కేసులను సీనియర్ జడ్జీల బెంచ్‌లను కాదని జూనియర్ జడ్జీలకు అప్పగించారని చీఫ్ జస్టిస్‌పై ఆ నలుగురు జడ్జీలు ఆరోపించిన విషయం గమనార్హం.

చీఫ్ జస్టిస్ ఇంటి ముందు కారులో ..

ప్రధాని ముఖ్యకార్యదర్శి ఫోటో వైరల్..!!

- న్యూ ఇయర్ గ్రీటింగ్స్ ఇచ్చేందుకు వెళ్లానంటూ వివరణ
- ప్రత్యేక దూతను ఎందుకు పంపారో చెప్పాలంటూ కాంగ్రెస్ డిమాండ్



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా పట్ల నలుగురు సీనియర్ జడ్జిలు బహిరంగ విమర్శలు చేసిన నేపథ్యంలో... ఈ వివాదంలో ప్రధాని కార్యాలయం జోక్యం చేసుకుంటున్నదా..? అనుమానాలకు తావిచ్చే సంఘటన శనివారం ఉదయం జరిగింది. ప్రధాని మోడీకి ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నృపేంద్రమిశ్రా ఢిల్లీలోని జస్టిస్ దీపక్‌మిశ్రా ఇంటి ముందు కారులో కూర్చుంటున్న ఫోటోను వార్తా సంస్థ ఏఎన్ఐ పోస్ట్ చేసింది. ఈ ఫోటో వైరల్ అయింది. దీనిపై ఓజాతీయ ఛానల్ నృపేంద్ర మిశ్రాను ప్రశ్నించగా..తన కార్యాలయానికి వెళుతూ చీఫ్ జస్టిస్ ఇంటిముందు ఆగానని, గేట్‌ముందు హ్యాపీ న్యూ ఇయర్ గ్రీటింగ్స్ ఇచ్చానే తప్ప లోనికి వెళ్లలేదని అన్నారు.

న్యాయ వ్యవస్థ సూత్రాలకు అనుగుణంగా వ్యవహరించడంలేదంటూ ఇప్పటికే నలుగురు సీనియర్ జడ్జిల నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రా ప్రధాని కార్యాలయ అధికారితో సమావేశానికి నిరాకరించినట్టుగా తెలుస్తోంది. భేటీకి అంగీకరించి ఉంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయని భావించినట్టుగా పరిశీలకులు చెబుతున్నారు. మరోవైపు న్యాయ వ్యవస్థ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోమని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే తెలిపింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్, ఆ శాఖ సహాయమంత్రి పిపి చౌదరితో శుక్రవారం ప్రధాని మోడీ అత్యవసర భేటీ నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రధానితో భేటీ అనంతరం పిపి చౌదరి మాట్లాడుతూ..మన న్యాయ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యుత్తమమైనది, స్వతంత్రమైనది, అంతర్గతంగానే పరిష్కరించుకుంటారని అన్నారు. అయితే,శనివారం ఉదయం చీఫ్ జస్టిస్ ఇంటి దగ్గరికి నృపేంద్రమిశ్రా ఎందుకు వెళ్లారో ప్రధాని స్పష్టం చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. చీఫ్ జస్టిస్ దగ్గరికి ప్రత్యేక దూతను ఎందుకు పంపారో ప్రధాని సమాధానం చెప్పాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్‌సూర్జేవాలా ట్వీట్ చేశారు.

కొన్నిసార్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం పాలనాతీరు సరిగ్గా లేదంటూ నలుగురు సీనియర్ జడ్జిలు ఆరోపించిన విషయం తెలిసిందే. శుక్రవారం నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా ముందుకు వచ్చి చీఫ్ జస్టిస్ దీపక్‌మిశ్రాను ఉద్దేశిస్తూ బహిరంగంగానే విమర్శలు చేయడంతో తదనంతర పరిణామాల పట్ల ఆసక్తి నెలకొన్నది. కొన్ని నెలలుగా అవాంఛనీయ పరిణామాలు జరిగాయని సీనియర్ జడ్జి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ మీడియా ముందే స్పష్టం చేయడం గమనార్హం. చీఫ్ జస్టిస్ తనకున్న అధికారంతో ధర్మాసనాలకు కేసుల విచారణ బాధ్యత అప్పగించడంలో హేతుబద్ధత లోపించిందని, రోస్టర్‌ను పాటించడం లేదని ఆయనతోసహా నలుగురు జడ్జిలు ఆరోపించారు.

న్యాయ వ్యవస్థను కాపాడాలనే నోరు విప్పాం

జస్టిస్ కురియన్

కోచి:తాము లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అన్నారు. విచారించాల్సిన కేసులను ధర్మాసనాలకు కేటాయించడంలో హేతుబద్ధత లోపించిందని ఆరోపించిన నలుగురు సీనియర్ జడ్జిల్లో కురియన్ జోసెఫ్ కూడా ఒకరు. న్యాయ వ్యవస్థ తరపుననే తాము గొంతు విప్పామని జస్టిస్ జోసెఫ్ అన్నారు. తాము క్రమశిక్షణను ఉల్లంఘించలేదని, తమ చర్యలవల్ల సుప్రీంకోర్టు పాలనా విభాగం మరింత పారదర్శకమవుతుందని ఆయన అన్నారు. న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించేదిగానే తమ చర్య ఉన్నదని ఆయన సమర్థించుకున్నారు.

రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలి

డీఎంకే అధ్యక్షులు స్టాలిన్

సుప్రీంకోర్టు పాలనా వ్యవస్థలో నెలకొన్న సమస్య న్యాయమూర్తులు పరిష్కరించుకోలేకపోతే ఆవిషయంలో రాష్ట్రపతి జోక్యం చేసుకోని వివాదం సద్దుమణిగేలా చూడాలని డీఎంకేపార్టీ అధ్యక్షులు ఎంకే స్టాలిన్ అన్నారు. శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి న్యాయమూర్తులు వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలని ఆయన అన్నారు. సుప్రీంకోర్టు పాలనా వ్యవస్థ తీరు సరిగా లేదంటూ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాను ఉద్దేశించి నలుగురు సీనియర్ న్యాయమూర్తులు శుక్రవారం మీడియా ముందుకొచ్చిన విషయం తెలిసిందే.

భయం వదిలి మాట్లాడండి..

- ప్రమాదం పొంచి ఉన్నది..

ఎమర్జెన్సీ రోజులు గుర్తొస్తున్నాయి : కేంద్ర మంత్రులకు బీజేపీ సీనియర్ నేత యశ్వంత్‌సిన్హా సూచన

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వలె భయం వదిలి ప్రజాస్వామ్యం కోసం నోరు విప్పాలని తన పార్టీ సహచరులు, కేంద్ర మంత్రులను బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి యశ్వంత్‌సిన్హా కోరారు. నలుగురు సీనియర్ జడ్జిలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పట్ల బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆ నలుగురు న్యాయమూర్తుల వ్యాఖ్యలను గుర్తు చేస్తూ..1975-77నాటి అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ) రోజులు గుర్తుకు వస్తున్నాయని సిన్హా అన్నారు. ఆ సమయంలో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీని విధించి ప్రజాస్వామిక ఉద్యమాలను అణచి వేసిన విషయం గమనార్హం.

పార్లమెంట్ సర్దుకుపోతే సుప్రీంకోర్టు క్రమం తప్పుతుందని ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని సిన్హా అన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదమని సీనియర్ జడ్జిలు చెప్పిన మాటలను సీరియస్‌గా తీసుకోవాలని ఆయన కోరారు. 'ప్రజాస్వామ్యాన్ని కోరుకునే ప్రతి పౌరుడూ మాట్లాడాలి. నేను బీజేపీ నేతలు, సీనియర్ మంత్రులనూ అడుగుతున్నాను. భయం విడిచి మాట్లాడమని విజ్ఞప్తి చేస్తున్నా' అని యశ్వంత్‌సిన్హా అన్నారు. న్యాయ వ్యవస్థలో ప్రధాన న్యాయమూర్తి సమానుల్లో ప్రథముడు అయినట్టే ప్రభుత్వంలోని క్యాబినెట్ మంత్రుల్లో ప్రధాని కూడా సమానుల్లో ప్రథముడే అని యశ్వంత్‌సిన్హా స్పష్టం చేశారు.

నోట్లరద్దు, జీఎస్టీని హడావుడిగా అమలులోకి తేవడంవంటి కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిర్ణయాలను యశ్వంత్‌సిన్హా గట్టిగా వ్యతిరేకించిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులు మాట్లాడేందుకు భయపడటం కూడా ప్రజాస్వామ్యానికి ప్రమాద సంకేతమని సిన్హా స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థ సంక్షోభంలో రాజకీయవేత్తలు జోక్యం చేసుకోవద్దన్న సూచనలను సిన్హా తిరస్కరించారు. నలుగురు సీనియర్ జడ్జిలు ప్రధాన న్యాయమూర్తి పట్ల సంధించిన ప్రశ్నలను సిన్హా గుర్తు చేస్తూ..అవి అంతర్గత సమస్యలు ఎంతమాత్రం కాజాలవని సిన్హా అన్నారు. ప్రతి పౌరుడూ గొంతు విప్పాలన్నారు. రాజకీయ పార్టీలు, పార్లమెంట్ వాటిపై మాట్లాడాలని సిన్హా అన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలను గుర్తు చేస్తూ త్వరలో ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలను తక్కువ రోజులకే కుదించడాన్ని సిన్హా ప్రశ్నించారు. ప్రజాస్వామ్యానికిది ప్రమాద సూచిక అని ఆయన అన్నారు. బడ్జెట్ సమావేశాలను ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 9 వరకూ నిర్వహించేందుకు షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. సున్నితమైన కేసుల విచారణ బాధ్యతను ఎంపిక చేసిన ధర్మాసనాలకే చీఫ్ జస్టిస్ కేటాయిస్తున్నారంటూ నలుగురు సీనియర్ జడ్జిలు ఆరోపించిన అంశంపై స్పష్టత కావాలని సిన్హా కోరారు. ఆ కేసులేమిటో బహిరంగ పరచాలని సిన్హా అన్నారు.

తన భార్యకు ఆ కుటుంబం ఓటు వేయలేదని...

మైనరుపై లైంగికదాడి, హత్య



రాంచీ : అమ్మాయిలపై అఘాయిత్యం జరగని రోజు లేదంటే ఆశ్చర్యపోనక్కరలేదు. రోజురోజుకూ దారుణాలు పెరుగుతూనే ఉన్నాయి. జార్ఖండ్‌లో జరిగిన ఈ దుర్మార్గ ఘటనకు గల కారణం మరీ విచిత్రంగా ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తన భార్యకు ఓటువేయలేదని.. ఆ కుటుంబంపై కక్షగట్టాడా దుర్మార్గుడు. అంతే.. ఆ కుటుంబంలోని 13 ఏండ్ల బాలికను కిడ్నాప్‌చేసి లైంగికదాడి చేయడమేకాక.. అతి కిరాతకంగా ఆమెను హత్య చేశారు. జార్ఖండ్‌లో వెలుగుచూసిన ఈ దాష్టీకానికి సంబంధించి నిందితులు నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8 నుంచి బాలిక కనిపించకుండా పోయింది. దీంతో ఆమె తల్లిదండ్రులు పోలీసులకు అదే ఫిర్యాదు చేశారు. కాగా, సమీపంలోని అటవీ ప్రాంతంలో మరుసటి రోజు బాలిక మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రేమ్‌లాల్‌ను ప్రశ్నించగా.. అసలు విషయం బయటకువచ్చింది. పాకూరు జిల్లా లిట్టిపారా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రేమ్‌లాల్ హంసద భార్య పోటీ చేశారు. అయితే బాధిత కుటుంబ సభ్యులు మాత్రం ఆమెకు ఓటు వేయలేదు. ఆ కుటుంబంవల్లే తన భార్య ఓడిపోయిందన్న కోపంతో ప్రేమ్‌లాల్ ఆ కుటుంబంపై కక్షకట్టాడు. జనవరి 8న బహిర్భూమికి వెళ్లిన బాలికను తన సోదరుల సహకారంతో అపహరించాడు. ఆపై వారంతా కలిసి లైంగికదాడికి పాల్పడి.. అనంతరం హత్య చేశారు.

తీవ్ర విమర్శలు...

నిందితులు రాజకీయంగా కాస్త పలుకుబడి ఉన్నవారు కావటంతో తొలుత కేసు నమోదు చేసుకునేందుకు పోలీసులు వెనక్కితగ్గారు. అయితే ప్రతిపక్షాల ఆందోళన, తల్లిదండ్రుల నిరసన ప్రదర్శనతో పోలీసులపై విమర్శలు గుప్పించారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి తక్షణమే వారిని అరెస్ట్ చేయాలని పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఎట్టకేలకు నిందితులను అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు.

బలవంతంగా మద్యం తాగించి..
సామూహిక లైంగికదాడి
దేశరాజధానిలో మానసిక వికలాంగురాలిపై
దుర్మార్గ ఘటన

దేశ రాజధానిలో మరో ఘోరం జరిగింది. తూర్పు ఢిల్లీలోని మదవాలి ప్రాంతంలో 15ఏండ్ల మానసిక వికలాంగురాలిపై పబ్లిక్ పార్క్‌లో ఆరుగురు దుర్మార్గులు ఘాతుకానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లైంగికదాడికి ముందు వారు ఆమెతో బలవంతంగా మద్యం తాగించినట్టు పోలీసులు తెలిపారు. మానసిక ఒత్తిడికి సంబంధించిన చికిత్స నిమిత్తం ఆమెను స్థానిక లేడీ హార్డింగే ఆస్పత్రికి తీసుకెళ్ళగా అక్కడి వైద్యులకు లైంగికదాడి ఘటనను వివరించింది. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు ఇచ్చిన వివరాల ఆధారంగా వారు నిందితులందరినీ అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఒకడికి బాధితురాలి మెంటల్ కండిషన్ తెలుసని పోలీసులు తెలిపారు. ఇంటి బయట ఆడుకుంటున్న తనను భోజనం పెడతానని ఒకడు సమీపంలోని పార్కుకు తీసుకెళ్ళాడని బాధితురాలు తెలిపింది. 'పార్కులోని గార్డు రూమ్‌కు ఆమెను తీసుకెళ్ళారు. అక్కడ ఆమెతో బలవంతంగా మద్యం తాగించారు. అప్పటికే ఆ గదిలో అతడి స్నేహితులు ఐదుగురు ఉన్నారు. అందురూ ఆమెపై దుర్మార్గానికి పాల్పడ్డారు' అని సీనియర్ పోలీసు అధికారి చెప్పారు.

నేను రాను బిడ్డో..



ప్రభుత్వాస్పత్రులకు వెళ్లటానికి.. సగానికి పైగా జనం నిరాకరణ

న్యూఢిల్లీ : 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు..' అంటూ అలనాటి ఓ సినీ కవి రాసిన పాట నేటికీ అక్షర సత్యంగానే మిగిలిపోతున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి మన ప్రభుత్వాస్పత్రులు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు.. సర్కారు దవాఖానాలను నిర్వీర్యం చేసుకుందుకు కంకణం కట్టుకుంటే.. రోగులు మాత్రం ఏంచేస్తారు. ప్రయివేటు ఆస్పత్రులకు మొగ్గుచూపుతున్నారు.

అటు ప్రయివేటు, ఇటు ప్రభుత్వ ఆస్పతుల్లో పేలవమైన ప్రమాణాలతోపాటు, షరా మామూలుగానే ఆరోగ్యం అధిక భారమన్న విషయాన్ని మరోసారి రుజువుచేసింది. ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ మెడికల్ కళాశాలలో ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయి పసికందులు ప్రాణాలు గాల్లో కలిసిపోయిన ఘటన ప్రభుత్వాస్పపత్రులపై బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణగా నిలిచింది. మరోకేసును పరిశీలిస్తే.. తన ఏడేండ్ల చిన్నారికి చికిత్స కోసం రూ.15లక్షల బిల్లును వేసిన ఫార్టిస్ ప్రయివేటు ఆస్పత్రి ఉదంతం వెలుగులోకి వచ్చింది. హర్యానాలో గర్భిణీ మహిళకు.. జ్వరం వస్తే ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె ఆరోగ్యం బాగుపడలేదు. చికిత్స చేస్తుండగానే చనిపోతే... బిల్లు మాత్రం రూ.18 లక్షలు వేసి నిర్వాహకులు దండుకున్నారు. ఇలా అడ్డదిడ్డంగా దోచేస్తున్న కార్పొరేట్ ఆస్పత్రుల్లో ధరలను నియంత్రించాల్సిన అవశ్యకతను ఈ ఉదంతాలు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రులను నిర్వీర్యం చేసి.. కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తుంటే.. ప్రజలు మాత్రం ఏం చేస్తారు. ఆ సర్కారు దవాఖానకు వెళ్ళాలంటే భయపడుతు న్నారు. నేషనల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ సర్వే (ఎన్‌హెచ్‌ఎఫ్ ఎస్) ఇటీవల జరిపిన సర్వే ఇది నిజమే అంటోంది. దేశంలో సగం మందికిపైగా జనం ప్రభుత్వాస్పత్రులను నిరాకరిస్తు న్నారని ఆ సర్వే తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో 42శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 46శాతం మంది ప్రభుత్వ ఆరోగ్య సే వలకు మొగ్గుచూపుతున్నారు. పట్టణ భారతంలో 56 శాతం మంది ప్రయివేటు వైద్య సేవలను ఎంచుకుంటుండగా, గ్రామీణ భారతంలో 49శాతం మంది అదే బాట పడుతున్నారు.

పట్టణ ప్రజలతో పోలిస్తే.. గ్రామీణ ప్రజలు ఎక్కువగా కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలపైనే ఆధారపడుతున్నారు. గత బడ్జెట్లో, సబ్ సెంటర్లను "వెల్నెస్ సెంటర్స్" గా మారుస్తామని ప్రభుత్వం ప్రకటించింది, అయితే ఆ దిశగా తీసుకున్న చర్యలేమీ లేవు. ఆయుర్వేద, యోగా, న్యాచురోపతి, యునానీ, సిద్ధా, హోమియోపతి (ఆయుష్) వంటి సాంప్రదాయ వైద్యంపై కేవలం ఒక్క శాతం మంది మాత్రమే మొగ్గుచూపుతున్నట్టు ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్ తెలిపింది. పట్టణ ప్రజల్లో 0.5 శాతం ఈసంప్రదాయ వైద్యాన్ని ఎంపిక చేసుకుంటుండగా.. గ్రామీణ ప్రజల్లో ఈ సంఖ్య 1.2 శాతంగా ఉంది.

ప్రభుత్వ వైద్య తిరస్కరణ ఎందుకు?

ప్రభుత్వ వైద్యాన్ని ఎందుకు తిరస్కరిస్తున్నారో తెలుసుకునేందుకు ప్రభుత్వ ఆరోగ్య సౌకర్యాలను ఉపయోగించని కుటుంబాల్లో ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్ ప్రత్యేకంగా సర్వే నిర్వహించింది. ఆస్పత్రి సమీపంలో ఉండకపోవడం, ఆస్పత్రివేళలు అసౌకర్యంగా ఉండటం, ఆరోగ్య సిబ్బంది గైర్హాజరు, సుదీర్ఘ కాలం క్యూలైన్లో వేచివుండాల్సి రావడం, ఇకచివరిగా మెరుగైన సంరక్షణ లేకపోవడం కారణాలుగా తెలుస్తోంది. మొత్తం మీద 55.1శాతం కుటుంబాలు ప్రభుత్వఆరోగ్య సౌకర్యాల ను ఉపయోగించుకోవడంలేదు. ఈకారణాలను విశ్లేషించగా - నాణ్యమైన సౌకర్యాలులేవన్నది 48.1శాతం మంది చెప్పగా, ఆస్పత్రి తమ సమీపంలో లేదని అందుకే వెళ్ళలేకపోతున్నామని 44.6శాతం మంది తెలిపారు. అన్ని ఇబ్బందులను అధిగమించి ప్రభుత్వాస్పత్రికి వెళితే.. పెద్దక్యూ ఉంటుంది దీర్ఘ కాలం వేచిఉండాల్సి వస్తోందని 40.9శాతం మంది చెప్పారు.

ప్రభుత్వ దవాఖానా మాకొద్దంటున్న రాష్ట్రాల్లో యూపీ ఫస్ట్

దేశంలో అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాస్పత్రులను తిరస్కరణ రాష్ట్రాల్లో అగ్రస్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో 80శాతం కుటుంబాలు సర్కారు దవాఖానకు వెళ్ళాలంటే భయపడుతున్నాయి. 77.6శాతంతో బీహార్ రెండో స్థానాన్ని ఆక్రమించింది. పంజాబ్, జార్ఖండ్, తెలంగాణా రాష్ట్రాల్లో వరుసగా 72.9, 71.7, 70.7శాతం మంది ప్రభుత్వాస్పత్రులను తిరస్కరిస్తున్నారు. మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే... తాము ప్రభుత్వాస్పత్రులకే వెళతామంటున్నారు.

విద్యా కాషాయీకరణ కోసమే దాడులు

- హిందూత్వ ముసుగులో మేధావులపై దాడి
- అభ్యుదయవాదులంతా ఐక్యం కావాలి : రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ చిత్రంలో నారాయణ, తిరుమలి, పిఎల్ విశ్వేశ్వరరావు, వినయకుమార్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

విద్యా కాషాయీకరణ చేయడంలో భాగంగానే మేధావులు, విద్యావేత్తలపై ఆర్ఎస్ఎస్ దాడులు చేస్తుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మతోన్మాద శక్తులు ఇటీవల శాతవాహన యూనివర్సిటీలో ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై దాడి చేశారనీ, తాజాగా హెచ్‌సీయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణపై సోషల్‌మీడియా వేదికగా దాడులు చేశారని గుర్తుచేశారు. ఈ దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయనీ, వీటిని ప్రజాస్వామిక వాదులంతా ఎదుర్కొనేందుకు సమాయత్తం కావాలని కోరారు. దానికోసం అభ్యుదయవాదులంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం 'మేధావులపై కాషాయమూకల దాడి' అనే అంశంపై ప్రొఫెసర్ తిరుమలి అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మేధావుల ఫోరం కన్వీనర్ ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ...దేశంలో నిర్బంధం పెరిగిపోతుందని అన్నారు. స్వేచ్ఛగా సినిమా తీయడానికీ, పుస్తకం రాయడానికీ, డాక్యుమెంటరీ చేయడానికీ వీలులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సైద్ధాంతిక పరమైన కేంద్రాలుగా ఉన్న వర్సిటీలను, రాజకీయ సంస్థలుగా మార్చేందుకు సంఘ్ పరివార్ కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. విద్యావ్యవస్థతో పాటు విద్యారంగం కూడా ప్రమాదంలో ఉందనీ, వీటిని రక్షించుకోవాల్సిన మనందరిపై ఉందని చెప్పారు. ప్రొఫెసర్ తిరుమలి మాట్లాడుతూ...పేపర్లు తయారు చేయడం ప్రొఫెసర్ల హక్కునీ, దాన్ని తప్పుపట్టడం విద్యావిధానానికి వ్యతిరేకమని అన్నారు. విద్యార్థి, టీచర్ మధ్య మంచి సంబంధం కొనసాగాలనీ, సమస్యల పరిష్కారానికి అవసరమైతే కలిసి పోరాడాలని కోరారు. ఎస్‌టీఎఫ్ఐ ఉపాధ్యక్షులు ఎన్ నారాయణ మాట్లాడుతూ... ఇటీవల కాలంలో దళిత, లెఫ్టిస్టులపై దాడులు పెరిగాయనీ అన్నారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణపై దాడిచేసిన విద్యార్థిని కాపాడే ప్రయత్నం చేస్తున్న వీసీ అప్పారావును వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. టీపీఎస్‌కే కన్వీనర్ జి రాములు మాట్లాడుతూ...పథకం ప్రకారమే అభ్యుదయ వాదులపై ఆర్ఎస్ఎస్ దాడులు చేస్తుందని అన్నారు. ఈ దాడులను తిప్పికొట్టేందుకు లెఫ్ట్, అంబేద్కరిస్టులు మరింత ఐక్యం కావాల్సిన అవసరముందని చెప్పారు. టీమాస్ కన్వీనర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ...కులవ్యవస్థను, అగ్రవర్ణ ఆగడాలను కొనసాగించేందుకు హిందూత్వ శక్తులు దాడులకు దిగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్, నియోకర్సన్ డైరెక్టర్ బిక్షమయ్య, ఉన్నత విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ అందె సత్యం, వివిధ సంఘాల ప్రతినిధులు హిమబిందు, నాగయ్య, అబ్బాస్, నాగరాజు, నరేశ్, భాస్కర్, శ్రీరాంనాయక్ పాల్గొన్నారు.


'నవతెలంగాణ' కథనంతోనే కదలిక: ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

నవతెలంగాణలో వచ్చిన 'లెఫ్ట్, అంబేద్కరిస్ట్ ప్రొఫెసర్లే టార్గెట్' కథనంతోనే వర్సిటీ అధికారుల్లో కదలిక వచ్చిందని హెచ్‌సీయూ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. కథనం వచ్చిన రోజే తనపై వ్యాఖ్యలు చేసిన విద్యార్థికి వర్సిటీ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారనీ చెప్పారు. నిబంధనల ప్రకారం పోతున్నామనీ ప్రకటించిన వర్సిటీ అధికారులపై ఆయన మండిపడ్డారు. పది మంది విద్యార్థులను సస్పెండ్ చేసినప్పుడు వర్సిటీ అధికారులకు నిబంధనలు గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. నవంబర్‌లో ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకూ ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలనీ డిమాండ్ చేశారు. శని, ఆదివారాలూ విచారణ చేసి కేవలం మూడు రోజుల్లో పది మంది విద్యార్థులపై ఎందుకు చర్యలు తీసుకున్నారో చెప్పాలనీ, అప్పుడేందుకు ప్రొక్టోరల్ కమిటీ, రూల్స్ ఎటుపోయాయనీ ప్రశ్నించారు. కొంతమంది ప్రొఫెసర్లు వీసీకి తొత్తులుగా మారిపోయారని ఆరోపించారు. విద్యారంగంలో కాషాయీకరణను తీసుకొచ్చేందుకు కుట్రలు జరుగుతున్నాయనీ, దీన్ని ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



భాగ్యనగరంలో సీఎం కేసీఆర్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోటోలతో షాపుల్లో దర్శనమిస్తున్న పతంగులు

'వెండి' గాలిపటం



హైదరాబాద్ : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పతంగుల పండుగ అంబరాన్నంటుతోంది. ఎటు చూసినా పతంగులే కనిపిస్తున్నాయి. పిల్లలైతే హుషారు గా గాలి పటాలను ఎగురవేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఇంటర్నేషన్ కైట్ ఫెస్టివల్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఇక నగరానికి చెందిన ఆనంద్ రెడ్డి.. వెండితో గాలి పటాన్ని తయారు చేశాడు. 0.5 గ్రాముల వెండితో గాలిపటాన్ని తయారు చేసి ఔరా అనిపించాడు. ఆనంద్‌రెడ్డి గాలి పటాల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అక్కడికి వచ్చిన వారంతా వెండి గాలి పటాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రంగు రంగుల గాలి పటాలను గాల్లోకి ఎగురవేస్తూ పిల్లలు ఎంజాయ్ చేస్తున్నారు. భారీ సంఖ్యలో సందర్శకులు తరలిరావటంతో..ట్రాఫిక్ కు తీవ్ర ఇబ్బందిగా మారింది.

ప్రేమ జంటను వెంబడించిన బంధువులు

- ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొన్న కారు
- డ్రైవర్ మృతి...మరొకరికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-ఖమ్మం



వారు కుల, మతాలకు అతీతంగా ప్రేమించుకున్నారు. తల్లిదండ్రులు ఒప్పు కోకపోవటంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. స్నేహితుల అండతో పెండ్లి చేసుకున్నారు. ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌లో రక్షణ కోరగా ఇరువురి తల్లిదండ్రులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. వధువరులిద్దరూ స్నేహితులతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా అమ్మాయి బంధువులు వెంబడించారు. ఈ క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో కారు డ్రైవర్ అక్కడికక్కడే చనిపోగా...వారికి సహకరించిన మిత్రుడొకరు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లాలో శనివారం జరిగింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణానికి చెందిన శ్రీపతి సుమన్ గాంధీ, అదే ప్రాంతానికి చెందిన ఎండీ షాహీన్‌లు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో పెద్దలకు విషయం చెప్పారు. ఇరువురి తల్లిదండ్రులు ఒప్పుకోకపోవటంతో ఇంట్లో నుంచి పారిపోయారు. మహబూబాబాద్‌లోని ఓ దేవాలయంలో శుక్రవారం పెండ్లి చేసుకున్నారు. అనంతరం ఇల్లెందుకు చేరుకుని పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరువురి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. తామిక్కడే ఉంటే ప్రాణాపాయం ఉంటుందని ఇల్లెందు నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఓ కారులో పయనమయ్యారు. ఈ క్రమంలో ఖమ్మం శివారు గోపాలపురం వద్దకు రాగానే వారి బంధువులు వెంటాడుతున్నట్టు గమనించారు. వారిని తప్పించుకునే క్రమంలో వాహనం అదుపుతప్పి బోల్తాకొట్టి అక్కడున్న ఓ చెట్టును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ మద్దెల రాజు(23) అక్కడక్కడే మృతి చెందగా, పెండ్లికి సహకరించిన తరుణ్‌కి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఖమ్మం మమత ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. జిల్లా ఆస్పత్రిలో రవి, ప్రేమ జంట సుమన్ గాంధీ, షాహీన్‌లు చికిత్స పొందుతున్నారు. తమ బంధువులు వెంటాడటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని షాహీన్ మీడియాకు తెలిపింది. ఈ మేరకు ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈఎస్ఐని ప్రయివేటీకరించొద్దు : ఏఐటీయూసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈఎస్ఐని ప్రయివేటీకరించే ప్రతిపాదనను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరసింహన్, రత్నాకర్‌రావు అన్నారు. ఈఎస్ఐ డయాగ్నస్టిక్స్ పేరుతో వైద్యపరీక్షలను ప్రయివేటు వరం చేయడాన్ని తీవ్రంగా ఖండించి సమ్మెకు దిగేందుకు సిద్ధమని హెచ్చరించారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ఎస్.విఠల్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగింది. కార్యక్రమనికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంట్రాక్టు అనే పదం ఉండదని ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినా ఆచరణలో మాత్రం అది జరగలేదన్నారు. ఎన్.నారాయణ రెడ్డి మాట్లాడుతూ టీవీవీపీ పరిధిలోని వైద్యశాలల ఉన్న ఉద్యోగులకు ట్రేజరి ద్వారా జీతాలు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, ఐపీఎంలోని ఖాళీలను పదోన్నతుల ద్వారా వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్.విఠల్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న ఖాళీలను తక్షణం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో భర్తీ చేయాలని, వైద్యశాఖలో ఉన్న ప్రమోషన్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి 11వ పీఆర్‌సీని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంసీఎస్ రాజు, యాదయ్య, వి.వేణుకుమార్, గంగాధార్, శ్రీనివాస చారి, వెంకటేశ్వర్లు, భీంరావు పాటెల్, హేమలత, నిమ్మ శ్రీనివాస్, కరుణకర్, సురేష్ ఆనంద్ తదితరుల భారీగా పాల్గొన్నారు.

దొంగలున్నారు జాగ్రత్త

- పండుగకు జనం ఊళ్లకు..
- దూరంగా విసిరేసినట్టున్న కాలనీలు, ఇండ్లు
- బస్తీలలో గస్తీని విస్తృతం చేయాలని కమిషనరేట్లు, జిల్లాల ఎస్పీలకు అంతర్గత ఆదేశాలు

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి



సంక్రాంతి పండుగకు సెలవులు రావడంతో రాష్ట్ర రాజధాని నుంచి అనేక మంది తమ కుటుంబాలతో ఇండ్లకు తాళాలు వేసి గ్రామాలకు వెళ్తున్నారు, అదను చూసుకుని దొంగలు రెచ్చిపోయే ప్రమాదం ఉంది , జాగ్రత్తగా ఉండాలని కింది స్థాయి పోలీసులకు ఉన్నతాధికారుల నుంచి అంతర్గత ఆదేశాలు జారీ అయ్యాయి. సంక్రాంతి పండుగకు వరుసబెట్టి సెలవులు రావడంతో ఇటు ప్రభుత్వ ఉద్యోగులు, అటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు తమ సొంత ఊళ్లకు తరలుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా హైదరాబాద్ , సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌లతో పాటు మిగతా కమిషరేట్లు, జిల్లాల హెడ్‌క్వార్టర్స్ నుంచి వందల సంఖ్యలో ప్రజలు ఇండ్లకు తాళాలు వసి తరలుతున్నారు. ముఖ్యంగా కాలనీలు, అపార్ట్‌మెంట్లు, బస్తీలు మొదలుకుని దూరంగా విసిరేసినట్టుగా ఉన్న కాలనీలు, ఇండ్ల సముదాయాలలో అనేక ఇండ్లకు తాళాలు కనిపిస్తున్నాయి. ఈ వాతావరణాన్ని అదనుగా చేసుకుని దోపిడీ దొంగలు, ఇతర రాష్ట్రాలకు చెందిన అంతర్రాష్ట్ర దొంగలు కన్నాలు వేసే ప్రమాదం ఉందని పోలీసు ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో చెడ్డిగ్యాంగ్ ముఠా దోపిడీలకు పాల్పడుతుండటాన్ని గుర్తించిన పోలీసు అధికారులు వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు కూడా పలు మార్లు చేశారు. పండుగ లేనప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే జనం ఊళ్లకు తరలి వెళ్లడం దొంగలకు మరింతగా రెచ్చిపోయే అవకాశాలు ఉన్నాయని నేర పరిశోధక విభాగానికి చెందిన అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిలో కాలనీలు, దూర దూరంగా ఉండే బస్తీలు, గ్రామాలలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని పండుగకు తరలి వెళ్లేలా చూడాలని ఆయా సబ్ డివిజన్ల పోలీసు స్టేషన్‌లకు అంతర్గతంగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. అంతేగాక పండుగకు తరలి వెళ్లిన వారు తిరిగి వచ్చేంత వరకు బస్తీలు, కాలనీలలో రాత్రి వేళే గాక పగటి పూట కూడా పోలీసు గస్తీని పెంచాలని ఆదేశించారు. అలాగే ఇండ్లకు తాళాలు వేసి వెళ్ల వారు ఆ విషయాన్ని తమ పక్కింటి వారికి తెలియ చెప్పడంతో పాటు వీలైతే స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇచ్చి వెళ్లేలా అలర్ట్ చేయాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. అలాగే రాత్రి వేళ అనుమానంగా ఎవ్వరు సంచరిస్తున్నా వెంటనే పోలీసు కంట్రోల్ రూంకు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చేలా ఆయా కాలనీలు, బస్తీలలో పోలీసులు సమాచారం ఇవ్వాలని సూచించినట్టు తెలిసింది. ఇలాంటి ముందు జాగ్రత్త చర్యలు దొంగలు చర్యకు పాల్పడక ముందే అడ్డుకోవడానికి వీలవుతుందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. నేరం జరిగాక విచారణ జరిపి నిందితులను పట్టుకోవడం క ంటే నేరం జరగకుండా చూడాలని రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి నుంచి ఇప్పటికే అన్ని జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లకు ఆదేశాలు ఉన్నాయని వారు గుర్తు చేశారు.

విద్యుత్ ఒప్పందాలపై నోరుమెదపరేం

మంత్రులపై రేవంత్‌రెడ్డి మండిపాటు

- ఏ విచారణకైనా సిద్ధమేనని వెల్లడి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

విద్యుత్‌పై చర్చలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు, సవాళ్ళు, ప్రతిసవాళ్లు కొనసాగుతుంటే...విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ ఎక్కడ ఉన్నారని కాంగ్రెస్‌పార్టీ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రతి చిన్న దానికి స్పందించే మంత్రులు విద్యుత్ ఒప్పందాలపై నోరెందుకు మెదపడం లేదన్నారు. విద్యుత్ ఒప్పందాల్లో దోపిడి కొనసాగుతున్నట్టు ఒప్పుకున్నట్టేనన్నారు. శనివారం గాంధీభవన్‌లో మాజీ ఎంపీ రవీంద్రనాయక్, ఎమ్మెల్యే సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దొరపాలనను రక్షించడానికి తనపై బాల్కసుమన్ విమర్శలు చేసి కేసీఆర్ వద్ద మార్కులు కొట్టేయాలని చూస్తున్నారని, అయితే కేసీఆర్ అంత నమ్మదగిన వ్యక్తి కాదని గుర్తుంచుకోవాలన్నారు. కేసీఆర్ కనికరం లేకుండా గొంతు కోసే కసాయి లాంటి వాడు అన్నారు. విద్యుత్ అవినీతిని నిరూపిస్తా అని సవాల్ చేసినా ముఖ్యమంత్రి కూడా స్పందించలేదన్నారు. విద్యుత్‌పై తాను చేసిన ఆరోపణలు తప్పుగా ఉంటే, తనపై కేసులు పెట్టి జైలుకు పంపించాలన్నారు. లేకపోతే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ లేదా సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు.

పంచాయతీ రాజ్ చట్టంపై అఖిలపక్షం వేయాలి : షబ్బీర్ పొంగులేటి

రాజ్యాంగంలో సర్పంచులకు 29 అధికాకారులు ఉంటే టీఆర్ఎస్ ప్రభుత్వం అందులో ఒక్క అధికారాన్ని కూడా బదిలీ చేయలేదని మండలిలోని ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ, ఉపనేత పొంగులేటి సుధాకరరెడ్డి విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతుండటంతో పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ ప్రయత్నిస్తోందన్నారు. దీనిపై వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించి, రాజకీయ పార్టీ అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో వారు విలేకరలుతో మాట్లాడారు. విద్యుత్‌పై ముఖ్యమంత్రి చర్చకు వస్తేనే తాను సిద్ధమని షబ్బీర్ అన్నారు. స్కూల్ ఫీజులపై నియమించిన తిరుపతిరావు కమిటీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

'మోడీ మరో హిట్లర్'

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రతినిధి

"ప్రధాని మోడీ మరో హిట్లర్. దేశాన్ని కాషాయమూకల చేతుల్లో పెడుతున్నాడు. హిందూ రాజ్యం ఏర్పాటే లక్ష్యంగా మతద్వేషాలను రెచ్చగొడుతూ 2019 ఎన్నికల్లో లబ్దిపొందటానికే బీజేపీ యత్నిస్తున్నది. ప్రజాస్వామ్యవాదులు, మేధావులు అప్రమత్తమై బీజేపీ విధానాలను తిప్పికొట్టాలి" అని ముంబయి ఐఐటీ ప్రొఫెసర్ ఆనంద్‌తేల్ తుంబ్డే పిలుపునిచ్చారు. విప్లవ రచయితల సంఘం(విరసం) రాష్ట్ర 26వ మహాసభలు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రౌన్‌గార్డెన్ ఫంక్షన్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆనంద్‌తేల్ తుంబ్డే మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాత్ర లేని హిందూ సంస్థలు నేడు దేశాన్ని హిందూ దేశంగా మార్చే శక్తిగా ఎదగడం లౌకికవాదానికి ప్రమాదకరమన్నారు. హిందూత్వ శక్తులు విశ్వవిద్యాలయాలు, కళాశాలలే కేంద్రాలుగా కార్యాచరణ మొదలెట్టాయని, దీనిని ఎండగడుతూ సమాజానికి నిజాలు చెబుతున్న గౌరీలంకేశ్, రోహిత్ వేముల మరణాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. దేశంలో విరసం అత్యున్నత పాత్ర పోషించాల్సిన అవసరముందన్నారు. బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని రచనలు, చైతన్య సదస్సుల ద్వారా ఓడించి నిజమైన ప్రజాస్వామ్యానికి ప్రాణం పోసే విధంగా చర్చలు, రచనలు కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ...బ్రాహ్మణీయ భావజాలాన్ని ఎండగట్టి దేశానికి లౌకిక దిశ చూపడంలో విరసం ముందువరుసలో ఉందన్నారు. మతం, గోవు, లవ్ జిహాద్ పేర్లతో హిందూత్వ శక్తులు దళితులను, ముస్లింలను ఊచకోత కోస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రధాని అయ్యాక ఒక శాతంగా ఉన్న పెట్టుబడిదారుల చేతిలోకి మెజార్టీ ఆర్థిక వనరులు క్రోడీకరించబడ్డాయన్నారు. దేశంలో కరువు, ఆత్మహత్యలకు కేంద్రంగా పాలమూరు మారిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆర్‌బీఐతో పాటు విశ్వ విద్యాలయాలూ విధ్వంసం అవుతున్నాయని వాపోయారు. మార్కెట్‌లోకి 100 శాతం విదేశీ పెట్టుబడులు రావటం వల్ల లక్షలాది మంది ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూత్వ శక్తుల ఆగడాలను అడ్డుకునేందుకు ప్రజాతంత్ర విప్లవ శక్తులు ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం గొంతెత్తి పాట పాడి, రచనలు చేసిన విరసం సభలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులివ్వకుండా నియంతపాలన సాగించడం దుర్మార్గమన్నారు. దేశంలో జరుగుతున్న హత్యల వెనుక ఆర్థిక కోణాలు ఉన్నాయని, వాటిని విరసం నిశితంగా పరిశీలించి రచనలు చేయాలని సూచించారు. మహాసభల్లో విరసం రాష్ట్ర కార్యదర్శి వరలక్ష్మి, ఎక్బాల్, సతీష్, రాఘవాచారి, విమలక్క, బుచ్చిరెడ్డి, ప్రొఫెసర్ కాశీం, కోనోట్‌పాణి, బాసిత్, అరసవెల్లి కృష్ణ పాల్గొన్నారు.



ఆన్‌లైన్ పరీక్షలపై దృష్టి సారించండి

- డిజిటలీకరణతోనే ఉద్యోగాల భర్తీ వేగవంతం
- పీఎస్సీలకు యూపీఎస్సీ చైర్మెన్ డేవిడ్ సీయంలీ సూచన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆన్‌లైన్ పరీక్షలపై దృష్టి సారించాలని దేశంలోని అన్ని రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు (పీఎస్సీ)లను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) చైర్మెన్ డేవిడ్ సీయంలీ సూచించారు. డిజిటలీకరణ ద్వారానే ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయొచ్చని తెలిపారు. రెండు రోజులపాటు గోవాలో జరుగుతున్న పీఎస్సీల స్టాండింగ్ కమిటీ జాతీయ సదస్సు ముగింపు సమావేశానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డేవిడ్ సీయంలీ మాట్లాడుతూ ఆన్‌లైన్ పరీక్షల విధానాన్ని అన్ని పీఎస్సీలు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారానే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతం కావడంతోపాటు నిరుద్యోగులకు మేలు కలుగుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించడం వల్ల ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా జరగడమే కాకుండా మూల్యాంకనం కంప్యూటర్ ద్వారా త్వరగా చేపట్టేందుకు వీలవుతుందని తెలిపారు. పీఎస్సీల స్టాండింగ్ కమిటీ చైర్మెన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ మరో రెండేండ్లపాటు పీఎస్సీ స్టాండింగ్ కమిటీ చైర్మెన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం లక్షకు పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే ఆన్‌లైన్ పరీక్షల విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కొన్ని శాఖల్లోని పోస్టుల భర్తీకి కంప్యూటర్ బేస్డ్ రాతపరీక్ష (సీబీఆర్‌టీ) నిర్వహించామని, ఇది పారదర్శకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. www.lokseva.online వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అన్ని పీఎస్సీల్లో ఆదర్శవంతమైన అంశాలను అందులో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోవా పీఎస్సీ చైర్మెన్ జోస్ మాన్యుయేల్ నోరొన్హా, ఇతర రాష్ట్రాల పీఎస్సీ చైర్మెన్లు పాల్గొన్నారు.

17న టీఎస్సార్ 'కాకతీయ కళా వైభవ మహోత్సవం'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాకతీయుల వైభవాన్ని చాటి చెప్పే విధంగా 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' కార్యక్రమాన్ని టి.సుబ్బరామిరెడ్డి నిర్వహించడం హర్షణీయమని సినీ నటుడు మోహన్‌బాబు తెలిపారు. టీఎస్సార్ కాకతీయ లలిత కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 17న హైదరాబాద్ లో జరగనున్న సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కళాకారులను, కళలను గౌరవించే వ్యక్తుల్లో టి. సుబ్బరామిరెడ్డి గారు ముందుంటారని తెలిపారు. కాకతీయుల కళా వైభోగాన్ని ప్రజలకు చాటి చెప్పాలనుకోవడం అభినందనీయమన్నారు. తనకు 'విశ్వ నట సార్వభౌమ' బిరుదు ప్రదానం చేయనుం డటంపై హర్షం వ్యక్తం చేశారు. సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ కాకతీయుల పరిపాలన స్వర్ణయుగమని, 600 ఏండ్ల క్రితమే తెలుగు సంస్కృతి, నాగరికతలు ఘనంగా చాటారని కొనియా డారు. కళల్ని ప్రోత్సహించి ఎన్నో గొప్ప దేవాలయాలను శిల్పకళా నైపుణ్యం, చాతుర్యంతో నిర్మించారని గుర్తుచేశారు. వరంగల్ రాజధానిగా 300 ఏండ్లు తెలుగువారిని పరిపాలించారన్నారు. అలాంటి వారిపై పేరుతో 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించే వేడుకలో మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు హాజరవుతారని చెప్పారు. పలువురు ఆధ్యాత్మిక, రాజకీయ, సినీ, సాంస్కృతిక ప్రముఖులు కార్యక్రమానికి హాజరవుతారన్నారు. అనంతరం వరంగల్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల్లో రెండు మూడు నెలలకు ఒకసారి కాకతీయ సాంస్కృతిక మహోత్సవాలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో రచయిత-నటుడు పరుచూరి గోపాలకృష్ణ, లయన్ క్లబ్ సభ్యులు, 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, కూచిపూడి న త్య కళాకారిణిలు పద్మజ, సుజాతలు పాల్గొన్నారు.

నా మతమే మనుగడ సాగిస్తుందని ఇతర మతాలు నాశనమవుతాయని ఎవరైనా అనుకుంటే అది పొరపాటు. -స్వామి వివేకానంద

సంపాదకీయం

విరబూసిన హేమంతం...

అటు రవికిరణాల మనోహరం.. యిటు కొత్తనీటితో సెలయేరు పరవళ్లు.. పచ్చని చెట్టు కొత్త చిగుళ్లు తొడుగుతుంది. ఆకు పచ్చని నిగారింపు.. సుతిమెత్తని సవ్వడి.. తెరలు తెరలుగా తెమ్మెర మీటినట్టే ఉంటుంది. ఎటు చూసినా అరవిచ్చిన గులాబీలూ.. చేలగట్ల మీద పసుపు పచ్చని తంగేడు పూలూ... మురిపించే ఎర్రని మందారాలూ.. చామంతుల నిగనిగలూ.. ఘుమఘుమలూ.. ఈ హేమంతంలో సుమంతం చూడ చక్కని సొబగులు.. హేమంతం విశేషమే అంత. వేకువజాము నుంచే పక్షుల కిలకిలా రావాలు.. 'కాలమిలా ఆగిపోనీ... కల నిజమై కరిగిపోనీ... అన్నీ మరిచి...' హాయిగా ఉండిపోతే ఎంత బావుండు అన్నంత ఆహ్లాదంగా తెలిమబ్బు కన్నులపండువులా ఉంటుంది.

అన్ని రంగాల్లో సుపరిపాలన నెలకొల్పడానికి మనమంతా అంకితమయితే మన దేశం బాగుంటుంది. మనం బాగుంటాం. మన యిల్లు ప్రశాంతంగా ఉంటుంది. సుశాంతి వల్ల అందరం బాగుంటాం. అప్పుడే ప్రజల జీవితాల్లో విరబూసిన హేమంతం.

కొత్త సంవత్సరానికి హేమంతం మంచి అలంకారం తెస్తుంది. ఎండా వానా చలీ ఒకదాని తరువాత ఒకటి వచ్చేసి తమ పని పూర్తి చేసుకుని వెళ్తుండగా, హేమంతం వస్తుంది. మంచు కురిసే వేళ.. ప్రకృతి పరవశిస్తూ ఉంటుంది. పంటచేలు.. జిల్లుమనే నీళ్లు.. వేడి వేడి నెగళ్ల దగ్గర కూర్చుంటే వెచ్చగా ఉంటుంది. సూర్యుడు ఒక కక్ష్యలో నుంచి మరో కక్ష్యలో అడుగు పెడుతుంటాడు. ఇలా అడుగు పెట్టడమే సంక్రమణ. సంక్రమణ అంటే గమనం.. ఈ గమనం వల్లనే పడమటి గాలికి చలి ఎక్కువవుతుంది. ఆవిరితో కప్పేసిన అద్దంలా చంద్రుడు కనిపిస్తాడు. పున్నమి వెన్నెల్లో కూడా చందమామ సంపూర్ణంగా అగుపించదు. అందుకనే ఈ హేమంతంలో ప్రకృతి కూడా పరవశిస్తూ ఉంటుంది. తనలో తాను అక్షరాలూ రాసుకుంటుంది. గాలికి తలలూపే చెట్ల కొమ్మలు రాసుకున్న అక్షరాలే ఈ పచ్చని ఆకులూ.. హిమబిందువులు అద్దుకున్న నునులేత రోజా బాలలూ... సూక్ష్మంగా చదవగలిగితే, ఆ విరితోటలో ఎంతటి సాఫల్య దృక్పథం యిమిడి ఉందో..కదా.. అని మనకు ఆశ్చర్యం కలుగుతుంది.



ఆ పచ్చని ఆకులు కూడా గుసగుస లాడతాయట.. అవీ ఎప్పుడో ఒకప్పుడు రాలిపోయి ధూళిలో కలిసి పోతాయనీ... అయినా అవి ఆ చెట్టుమీద ఉన్నంత కాలం తమను చూసేవారి కన్నులకు తన్మయత్వం నింపి తీరాలనే పట్టుదలతో, రెట్టింపు ఉల్లాసంతో మెరుస్తూ ఉంటాయి. గాలినే ఊయలగా చేసుకుని 'ఏమి హాయిలే..హలా..!' అని ఊగుతూ ఉంటాయి. ఇంతలో ఓ ఆకు నేల రాలగానే భూమి ఆప్యాయంగా అక్కున చేర్చుకుని హత్తుకుంటుంది. ప్రకృతికీ కాలచక్రానికీ ఉన్నటువంటి అవినాభావ బాంధవ్యమే అది. ప్రకృతితో మమేకమైనది యేదైనా అంతేమరి. మనసు పరిపూర్ణంగా నిండిపోతుంది. గట్టున నిల్చొని 'ఏటిలోని కెరటాలు ఎక్కడికీ పోవూ.. యెదలోపలి మమకారం ఎక్కడికీ పోదూ...' అని విరబూసిన హేమంతాన్ని మనసుతీరా ఆస్వాదించడమే మనవంతు.

ఇలా హేమంతం చల్లగా అడుగుపెడుతూనే ముంగిట్లో ముత్యాల ముగ్గులు తీర్చి దిద్దుతుంది. ఫలసాయాలు చేతికందే వేళ... అన్నదాతల లోగిళ్లు కళకళలాడుతూ.. గంగిరెద్దుల నృత్యాలూ, హరిదాసుల కీర్తనలతో పల్లెల్లో నిండైన సందడి. విశిష్టమైన భౌగోళిక, వ్యవసాయక, ఉన్నంతలో ఆర్థిక వెసలుబాటు సంతరించుకుంటుంది. సరిగ్గా యిదే సమయం..గత సంవత్సరం మరుగవుతుంది. నవీన సంవత్సరం అడుగిడుతుంది. ఎన్నెన్నో ఆశల పందిళ్లు.. కొత్త భావనలూ... కొంగ్రొత్త ఆశలూ.. పచ్చ పచ్చని చివుళ్ల వంటి కొత్త కోరికలూ మొగ్గలు తొడుగుతాయి. ఇలా కాలం తాజాగా పరిమళిస్తూ ఉంటుంది. మనుషులు ఆశాజీవులు. జీవితం అందమైన కలగా భావిస్తారు. తమ బతుకంతా హాయిగా గడిచిపోవాలని కోరుకుంటారు. మంచి జరిగితే, ఆనందంగా స్వీకరిస్తారు. చెడు జరిగితే బాధపడతారు. కుంగిపోతారు. మనం సంఘజీవులం. చుట్టూ జరిగే తప్పిదాల్ని అర్థం చేసుకోవాలి. కనుక నలుగురితో కలిసి నడవడం అవసరం. కలిసి ఉంటే కలదు సుఖం అన్నారు అనుభవజ్ఞులు. ఒంటరిగా మనజాలం. బతికినన్నినాళ్లూ 'అందమే ఆనందం.. ఆనందమె జీవిత మకరందం.. !' అనుకుని అందరితో కలిసిమెలిసి బతికితే జీవితానికి ఓ అర్థం.. ఓ సార్థకత.. ప్రగతి భావుకులు కోరుకునేది జగతికి సముత్తేజం కలిగించే పరివర్తనా ప్రవృత్తినే..

కొన్నిసార్లు నేలమీద నడిచిపోతున్నా నిండు సరోవరంలో తేలిపోతున్నట్టనిపిస్తుంది. మనసును బట్టి ఆ అనుభూతి ఉంటుంది. నడకలో కుదుపులుంటాయి. జీవితంలో కూడా అంతే. ఆ కుదుపులకు వెనుదీయక అడుగులను కొనసాగిస్తాం. సరోవరం తరగలు కూడా అంతే. ఒక్కొక్కసారి పొంగుతూ, మరోసారి కుంగుతూ పోతుంటాయి. వాటిమీద తేలిపోయే మనం మన మనసును సర్దుబాటు చేసుకుంటాం. మళ్లీ ఎప్పటిలాగే తేలిపోతుంటాం. కానీ, నేలమీదైనా, నీటిమీదైనా సమ మనస్కతతో సాగిపోవాలి. యావత్ దేశం కూడా అంతే. విభిన్న జాతులు, భాషలు, మతాలు, సంస్కృతులూ ఉండటం సహజం. వీటన్నిటి మధ్య సరియైన అవగాహన ఉంటేనే దేశం భవిష్యత్ సుస్థిరం. అదుపు తప్పుతున్న పరిస్థితుల్ని అధిగమించడానికి పల్లె నుంచి ఢిల్లీ దాకా అన్ని రంగాల్లో సుపరిపాలన నెలకొల్పడానికి మనమంతా అంకితమయితే మన దేశం బాగుంటుంది. మనం బాగుంటాం. మన యిల్లు ప్రశాంతంగా ఉంటుంది. సుశాంతి వల్ల అందరం బాగుంటాం. అప్పుడే ప్రజల జీవితాల్లో విరబూసిన హేమంతం.

'తలాక్'తో ఒక చుక్క తగ్గొచ్చు.. వరద తగ్గదు..



సిహెచ్. మధు

'త్రిపుల్ తలాక్' చట్టం తేవటం పెద్ద సాహసమేమీ కాదు. రాజకీయంగా ఎదురులేని ప్రధాని మోడీ దశాబ్దాలుగా అందరూ చెడ్డదని ఏకీభవిస్తున్న ఒక సాంప్రదాయానికి వ్యతిరేకంగా ఒక చట్టం తేవటం గొప్ప విషయమేమీ కాదు. ఆయన ఈ చట్టాన్ని ఎందుకు తెచ్చారు? ఇందులో ఉన్న రాజకీయాలేమిటీ? ఏ రాజకీయ ప్రయోజనం ఆయన చేసారు? తరతరాలుగా ముస్లిం మహిళల కన్నీళ్లు తుడవటానికే ప్రధాని నరేంద్రమోడీ చట్టం తెచ్చారని భావిద్దాం! అయితే ఒకే ఒక ప్రశ్న. ఈ వ్యవస్థలో ఒక్క ముస్లిం మహిళలే కన్నీళ్లు పెడుతున్నారా? ఇంచుమించు ఈ వ్యవస్థలోని మహిళందరూ కన్నీళ్లు పెడుతున్నారు. అవి రకరకాల కన్నీళ్లు... ప్రతి మహిళ ఏదో రకమైన దుఃఖాన్ని అనుభవిస్తూ ఉంది. ప్రతి మహిళ భయంకర చీకట్లోనే ఉంది. ఈ వ్యవస్థలో ధనవంతుల మహిళలు, విద్యావంతులైన మహిళలు, రాజకీయంగా, శక్తివంతంగా కనిపిస్తున్న మహిళలు, సాహిత్య సాంస్కృతికి ఉద్యోగ

పురుషాధిక్య భావజాలం అన్ని మతాలలో ఉంది. 'పురుషాధిక్య సమాజం' వలన స్త్రీ కార్చని కన్నీరు లేదు. నిజంగా ముస్లిం మహిళల కన్నీళ్లు ప్రధాని మోడీ ట్రిపుల్ తలాక్ బిల్లుకు కారణమైతే.. ఒకపని చేస్తే స్త్రీల కన్నీళ్లు సగం తగ్గిపోతాయి. భారతదేశంలో మద్యపాన నిషేధం అమలు చేయండి! ఏ విధమైన మద్యపానం అమలులో ఉండకూడదు. 'మద్యపానం' ఒక్క స్త్రీ కన్నీళ్లకే కారణం కాదు. శాంతిభద్రతలకు సవాల్‌గా మారింది.

రంగాలలో ఉన్న మహిళలు కూడా రకరకాల దుఃఖాన్ని అనుభవిస్తున్నారు. పల్లె మహిళలు, శ్రామిక కార్మిక మహిళలు, సామాన్య మహిళల దుఃఖానికి అంతం కనిపించటం లేదు. అన్ని మతాల, అన్ని కులాల అన్ని వర్గాల మహిళలు పురుషాధిక్య దోపిడీ వ్యవస్థలో రకరకాల సమస్యలు అనుభవిస్తున్నారు. కొన్ని కన్నీళ్లు కనిపిస్తాయి. కొన్ని కన్నీళ్లు కనిపించవు. అంతే తేడా! ప్రధాని నరేంద్రమోడీకి ట్రిపుల్ తలాక్ తగ్గవచ్చు. లేదా 'నిర్భయ చట్టం' లాగా రోగాన్ని నయం చేయని మందులా కావచ్చు. అయితే ఒకటి నిజం. వ్యవస్థలోని ఇతర మహిళలలాగా ముస్లిం మహిళలు కూడా ఎన్నో కన్నీళ్లతో ఉన్నారు. ఈ చట్టంలో ఒక కన్నీటి చుక్క తగ్గవచ్చు, కానీ వరద తగ్గదు.

ఈ వ్యాసం ప్రారంభంలోనే మూడు ప్రశ్నలు వేయాలని ఉంది. ఒకటి విడాకుల విషయంలో కానీ, మళ్ళీ పెండ్లి విషయంలో కానీ, అక్రమ సంబంధాల విషయంలో సమాజంలో స్వేచ్ఛగా ఎటు వీలయితే అటు ప్రయాణించే విషయంలో కానీ, మగవారికున్న స్వేచ్ఛ స్త్రీకి ఉందా? రెండు, పురుషులతో అన్ని రంగాలలో స్త్రీ సమానమని చెప్పుకుంటున్నాం కానీ, ఎవరి చేతుల్లో ఎవరు చిత్రహింసలు అనుభవిస్తున్నారు? మగడు ఎన్ని కొట్టినా తప్పులేదు, స్త్రీ ఒక దెబ్బ కొట్టినా తప్పే అనే సామాజిక నీతి ఎందుకుంది? మూడు, ఆధునిక ప్రపంచంలో తనను ప్రేమించటం లేదని, ప్రేమించమని, పెండ్లి చేసుకొమ్మని, అంగీకరించకపోతే ఇన్ని చట్టాలుండగా మగవాడు బహిరంగంగా ఎలా చంపగలుగుతున్నాడు? వీటికి జవాబులు దొరుకుతాయా?

రాజకీయాలు ఒక్కొక్కసారి మంచి పనిచేస్తాయి. రాజకీయాల కోసం, ఓట్ల వేటలో భాగంగా రాజకీయ నేతలు ప్రజలకు మేలు చేసే పని కూడా చేస్తుంటారు. రాజకీయాలు దుర్మార్గమైనవి, నీతిలేనివి అని ఒక్కొక్కసారి అంటుంటాను. నా మిత్రులు అంతగట్టిగా ఒకమాట అంటారు. 'అధికారం ఉంటే ఏదైనా చేయవచ్చని' 'కొన్ని ఆశయాలు సాధించవచ్చని' 'ప్రజల కోసం ఏమైనా చేయాలనే తపన కొంతయినా తీర్చుకోవచ్చని' నాకు ఈ మాటల మీద పెద్ద విశ్వాసం లేదు. ఇప్పటి రాజకీయాలు చాలా నీచంగా కనిపిస్తున్నాయి. "రాజకీయాలను బాగు చేస్తాం.. దేశాన్ని బాగుచేస్తాం" అని రాజకీయాలలోకి దిగిన కొంతమంది పూర్తిగా చెడిపోయిన దాఖలాలే చరిత్రలో ఉన్నాయి. అధికారం ఒక మత్తు లాంటిది. మత్తు ఏదైనా చేయిస్తుంది. కొన్ని మంచి పనులు కూడా చేయిస్తుంది. అందులో భాగమే ప్రధాని నరేంద్రమోడీ 'ట్రిపుల్ తలాక్ చట్టం'... మంచి పని జరిగింది. కానీ ఆలస్యంగా జరిగింది. అయితే ఒక మాట.. మతాలలోని అభివృద్ధి నిరోధక సంస్కృతిని మార్చటం చట్టాలతో అయ్యే పని కాదు. ఇంకో విషయం ఇక్కడ చెప్పుకోవాలి. ముస్లిం సమాజం కూడా చాలా మారింది. ప్రపంచ పోకడల కనుగుణంగా మారుతూ ఉంది. "ట్రిపుల్ తలాక్" అంటున్నది చాలా తక్కువ. పురుషాధిక్య అహంకార శాడిస్టులే "ట్రిపుల్ తలాక్" అంటున్నారు. ఇటువంటి పురుషాహంకార శాడిస్టులు అన్ని మతాలలో ఉన్నారు. 'ట్రిపుల్ తలాక్' ఆచారం దుర్మార్గమే! ముస్లిం మహిళల పాలిట శాపమే...



విడాకులు చట్టబద్ధమే అయినా, ఇరువురి అంగీకారంలో జరిగినా నష్టం ఎవరికీ! బాధపడేది ఎవరూ? భవిష్యత్తు అంధకారం అయ్యేది ఎవరికీ? స్త్రీ మాత్రమే... శిక్ష అనుభవించేది పిల్లలు మాత్రమే.. విడాకులు అయిన తర్వాత ఏమాత్రం నష్టపోనిది మగవాడు మాత్రమే. హిందూ సమాజంలో ఎన్నికష్టాలయినా, ఎన్నిబాధలయినా, ఎన్ని చిత్రహింసలయినా స్త్రీ అనుభవిస్తూ తప్పనిసరి అయి భర్తతో కాపురం చేస్తుంది. ఇది స్త్రీలోపం కాదు. తరతరాల పురుషాధిక్య సమాజంలోపం... ఒక రకంగా మనుధర్మం పురుషుడికిచ్చిన సామాజిక పెద్దరికం. ఇంచుమించు అన్ని మతాలు స్త్రీని వంటింటికి పరిమితం చేసాయి. ప్రధాని నరేంద్రమోడీ మతాలకు అతీతుడు కాదు. దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలని అడుగులు వేస్తున్న.. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం వున్న వ్యక్తి. ఆర్‌ఎస్‌ఎస్ ఆయన బలం.. మనదేశ ప్రజల బలహీనత. అన్ని మతాలలో ఉన్న దుర్మార్గాలను అశాస్త్రీయ సంస్కృతులను, అభివృద్ధి నిరోధక అడుగులను, సంకుచితత్వాన్ని మార్చటానికి ప్రయత్నిస్తే మంచిదే. ఆశయాలు వల్లిస్తే అయ్యేపని కాదు.

పురుషాధిక్య భావజాలం అన్ని మతాలలో ఉంది. 'పురుషాధిక్య సమాజం' వలన స్త్రీ కార్చని కన్నీరు లేదు. నిజంగా ముస్లిం మహిళల కన్నీళ్లు ప్రధాని మోడీ ట్రిపుల్ తలాక్ బిల్లుకు కారణమైతే.. ఒకపని చేస్తే స్త్రీల కన్నీళ్లు సగం తగ్గిపోతాయి. భారతదేశంలో మద్యపాన నిషేధం అమలు చేయండి! ఏ విధమైన మద్యపానం అమలులో ఉండకూడదు. 'మద్యపానం' ఒక్క స్త్రీ కన్నీళ్లకే కారణం కాదు. శాంతిభద్రతలకు సవాల్‌గా మారింది. విడాకులకు, స్త్రీ చిత్రహింసలకు స్త్రీల హత్యలకు, ప్రేమోన్మాదానికి, వరకట్న డిమాండ్‌కు కొట్లాటలకు, మామూలు మాటలు, తగవులు, హత్యల వరకు దారితీయటానికి, యాక్సిడెంట్‌లకు మద్యపానం కారణం. యువకులు చెడిపోవటానికి, మానవశక్తి నశించటానికి మద్యపానమే కారణం. మద్యపానాన్ని నిషేధించగలరా? మద్యపానాన్ని నిషేధించి ఇప్పటి షోకుల, విలాసాల ఆడంబరాల ప్రభుత్వాలు నడువగలవా? మద్యపానాన్ని నిషేధించి చూడండి! ఎన్నికల వ్యవస్థ బాగుపడుతుంది. సమాజమే బాగుపడుతుంది. హిందూ సమాజం కొంతమేరకు నిర్మలమవుతుంది. ఎన్నో సాహసమైన సంస్కరణలు నరేంద్రమోడీ తెస్తున్నారని చెపుతున్న బీజేపీ నేతలు ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు మద్యపాన నిషేదాన్ని తెమ్మని మోడీపై ఒత్తిడి తేగలరా? మోడీ చేయగలరా? మన దురదృష్టం ఏమిటంటే... ప్రభుత్వాలు కూడా స్వార్థం చుట్టూ తిరుగుతుంటాయి. ప్రజల చుట్టూ కాదు. ఓట్లు రాల్చే సంస్కరణలు తేగలరు. పదిమందిని మార్చే సంస్కరణలు తేరు. ఆచరణలో సాధ్యం కాకున్నా పది మంది మెచ్చే సంస్కరణలు తెస్తారు. రెంటికీ తేడా ఉంది.

'తలాక్' ముస్లిం మహిళల ప్రత్యేక బాధ... చట్టం ద్వారా బాధతగ్గితే మంచిదే. మరోపెళ్లి చేసుకోవాలని ఇప్పుడున్న భార్యను వదిలించుకోవాలని ఇప్పటిదాకా తలాక్‌ను ఆశ్రయిస్తే... ఇప్పుడు మరో దారి వెదుకుతాడు అంతే తేడా! మహిళల కన్నీళ్లు తగ్గాలంటే పురుష ప్రపంచంలో మార్పు రావాలి... అది సాధ్యమా! వరకట్న నిషేధ చట్టం ఏమయ్యింది? 'నిర్భయ' చట్టం వచ్చింది. ప్రేమోన్మాదాన్ని, హత్యలను ఆపగలిగిందా? రాజకీయరంగంలో కొన్ని వ్యవస్థలలో మహిళలకు రిజర్వేషన్లు వచ్చాయి. పేరుకే మహిళా ప్రజాప్రతినిధి.. పెత్తనమంతా మగవాళ్లదే! తొంబది శాతం ఇదే పరిస్థితి... మహిళల రిజర్వేషన్లను కూడా మగవాడు తన పెత్తనానికి అనుగుణంగా మార్చుకుంటున్నాడు. అందరూ సుష్మాస్వరాజ్‌లు కాదు. అందరూ 'కవిత'లు కాదు. వీటిని మార్చటం లేదు. మహిళల రిజర్వేషన్లు ఇలా దుర్వినియోగం కావటానికి అధికారులు కూడా కారణమే... సహకరిస్తున్నారు. ప్రజా ప్రతినిధి కాకున్నా భర్తనే ప్రజాప్రతినిధిగా పరిగణిస్తున్నారు. మహిళల విషయంలో ఇటువంటి అన్యాయాలెన్నో ఉన్నాయి.

ఈ మధ్యన ప్రేమపేరుతో హత్యలు అధికమయ్యాయి? ఏ చట్టం... ఏ శిక్ష పేరుతో వీటిని ఆపగలరు? ఆగాల్సిన అవసరముంది. ప్రతిదినం ఎన్నో సంఘటనలు జరుగుతున్నా... ఈ కన్నీళ్లు ప్రధాని నరేంద్రమోడీకి కనిపించనట్టున్నాయి. ఒక మహిళ అభిప్రాయం తనకనుకూలంగా లేదని, ప్రేమించటం లేదని పెళ్లి చేసుకోవటం లేదని... యాసిడ్ పోసి, పెట్రోల్ పోసి కత్తులతో పొడిచి చంపేహక్కు మగవాడికుందా..? ట్రిపుల్‌తలాక్ ఒక్కటే కాదు.. స్త్రీల పట్ల ఎన్నో అమానుషాలు ఈ సంఘంలో గూడుకట్టుకొని ఉన్నాయి. స్త్రీలకు భద్రతలేని వ్యవస్థ ఇది. స్త్రీలు స్వేచ్ఛగా ఎదగటానికి అవకాశం లేని వ్యవస్థ ఇది. స్త్రీని విలాస వస్తువుగానే ఇప్పటికీ భావిస్తున్న వ్యవస్థ ఇది.

ఈ సమాజంలో ఎందరో మహిళలు పురుషుల చిత్రహింసలకు బలి అవుతున్నారు. స్త్రీలను ఇప్పటికే చిన్నచూపు చూస్తున్న వ్యవస్థ ఇది. కొట్టటం, తిట్టటం, బెదిరించటం, రకరకాల చిత్రహింసలు చేయటం ఎన్నో విధాలుగా పురుషాధిక్య వ్యవస్థకు బలి అవుతున్న స్త్రీలను చూస్తున్నాం. మగవాడికి ఇష్టం లేకుంటే విడాకులు... వాడు మరో పెళ్లి హాయిగా చేసుకోగలడు. అమ్మాయి నివ్వటానికి క్యూకడుతారు. విడాకులు పొందిన స్త్రీ ఏం కావాలి? ఒంటరిగా బతకాలి... ఎవరూ పెళ్లి చేసుకోరు. చేసుకోవటానికి ఎన్నో అడ్డంకులు, విడాకులిచ్చిన భర్తకు పుట్టిన పిల్లలు... ఈ పెళ్లి.. ఈ సాంప్రదాయాలు అన్నింటా పురుష నీతి. స్త్రీల పాలిట శాపాలుగా మారాయి. వీటిని చట్టాలతో మార్చటం సాధ్యమా? మనముందే ఎందరో కనిపిస్తున్నారు. భార్యలను ఒకరిని ఇద్దరిని విడిచిన పెద్దలు. భార్యను దూరంగా వుంచిన మహనీయులు.

అన్ని మతాలలో మంచీ.. చెడూ ఉంది. చెడును సంస్కరించటం తప్పుకాదు. హిందూ మతంలో ఈ కులాలేమిటీ? కులాల మధ్య అంతరాలేమిటీ? ఈ అంటరాని తనమేమిటీ? వీటి దిక్కు దృష్టిసారించటం మోడీకి సాధ్యం కాదు. హిందూమతాన్ని సంస్కరించటం ఆర్‌ఎస్‌ఎస్‌కే ఇష్టముండదు.

తాను అన్ని రంగాలలో మగవాడితో సమానమని స్త్రీ పోరాడి సాధించుకున్న హక్కు. ఏ ప్రభుత్వం ఏ చట్టం యిచ్చిన హక్కు కాదు. హిందూ భావజాలానికి ప్రతీకగా ఉన్న ప్రత్యేక అయిన మనుధర్మ శాస్త్రం....పురుషునికి యిచ్చిన విలువ స్త్రీకి యివ్వలేదు. మతాల సంగతి అలా ఉంచినా... ఇది పురుషాధిక్య సమాజం... స్త్రీల కన్నీళ్లకు పురుషాధిక్యత బలమైన కారణం... ఈ ఆధిక్యతను ఏ చట్టం మార్చగలరు? ఈ కన్నీళ్లను ఏ చట్టం తుడువగలదు?

సెల్: 9949486122

అక్షర పరిమళం మహాశ్వేతాదేవి




గుమ్మడి లక్ష్మీ నారాయణ

అణగారిన వర్గాల గుండె చప్పుడు, అడవి బిడ్డల హక్కుల కోసం గొంతెత్తిన సామాజిక ఉద్యమకారిణి, నవలా రచయిత్రి మహాశ్వేతాదేవి అడవిపై పరిమళించిన అక్షరకుసుమం. ఆదివాసీ, అణగారిన ప్రజల కోసం ఆమె తన కలాన్ని ఆయుధంగా మలచుకొని, వారి జీవితాలకు తన రచనలతో నిలువుటద్దం పట్టారు. 1926, జనవరి 14న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో మధ్యతరగతి కుటుంబమైన మనీష్ ఘటక్, ధరిత్రీదేవీలకు మహాశ్వేతాదేవి జన్మించారు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన శాంతినికేతన్‌లో చదివారు. మహాశ్వేతా కుటుంబమంతా సామాజిక, ఉద్యమ నేపథ్యం కలిగి ఉండటమే ఆమె సాహిత్య వారసత్వానికి కారణమైంది. మహాశ్వేతా తన రచనలతో కేంద్ర సాహిత్య అకాడమీ (1979), జ్ఞానపీఠ్ (1996), రామన్ మెగసేసె (1997), పద్మవిభూషణ్ (2006) అవార్డులు అందుకున్నారు.

దేశ విభజన తర్వాత మహాశ్వేత కలకత్తాలో స్థిరపడ్డారు. అణగారిన ప్రజల హక్కుల కోసం గొంతెత్తడం అంటే ఆమె తన కథలు, నవలలను ముడిసరుకుగా వాడుకున్నారు. పశ్చిమబెంగాల్‌తో పాటు బీహార్, ఒడిసాలలో మారుమూల ప్రాంతాలకు వెళ్ళి ఆదివాసుల జీవితాలను అధ్యయనం చేశారు. గిరిజనుల కథాగానాలపై లోతైన పరిశోధన చేసిన మహాశ్వేతాదేవి ఆదివాసీల పక్షాన తొలి అక్షర అభినేత్రి.

"అడవి చూడండి. జలజల పారే సెలయేళ్లు, మెరిసే ఎండ, అడవిలో సంతోషంతో ఎగిరే కృష్ణజింకలను చూడండి. సెలయేళ్ళ దగ్గర, వాగుల వంకల, చెలిమల దగ్గర పల్లెతల్లులు, పిల్లల్ని చంకనేసుకుని కుండలలో నీరు నింపుకు పోవడం, సూర్యుడు వంగి భూమిని చూస్తూ ఉండటం... రైతులు పొలాలు దున్నుతున్నప్పుడు అడవులే కాదు, కొండలు, గుట్టలు కూడా పచ్చదనంతో నవనవలాడుతూ ఉన్నప్పుడు, అక్కడ.. ఏమీ జరగదు! ఏమీ కాదు!! నువ్వు కలగననంతవరకు, కలగనడం ఎలాగో నీకు తెలియనంత వరకు అక్కడ ఏమీ జరగదు... అయితే రాజకీయ, పరిపాలనా వ్యవస్థలు రిమోట్ కంట్రోల్‌తో నీతో కలలు కనిపించే నీ మెదడు జీవకణాన్ని నాశనం చేస్తూనే ఉంటాయి. అయితే కొన్ని కలలు తప్పించుకుని బయటపడతాయి. అట్లా తప్పించుకుని బయటపడ్డ కలల వెంట నేనెప్పుడూ పరుగెత్తుతుంటాను. ఈ మానవాళీ సజీవంగా కొనసాగాలంటే కలలుగనే హక్కు తప్పకుండా ఉండాలి. కానీ.. పరిపాలనా వ్యవస్థ.. కలలుగనే నీ హక్కును కూలగొడుతుంటే ఏమవుతుంది? వ్యక్తులు కూలిపోతారు. దేశాలు, మొత్తానికి ప్రపంచమే కూలిపోతుంది. కలలు కనడమన్నది మనందరి ప్రాథమిక హక్కు.. దీన్ని మనం కాపాడుకోవాలి!



బహుశా 1980 నుండి నా పోరాటాన్ని ఉధృతం చేశాను. గొంతు విప్పాను. ఆదివాసులు, గిరిజనులు, భూమిలేని గ్రామీణ పేదలు, కూలీలు, నగరాల్లో ఫుట్‌పాత్ జీవులు ఇట్లా వారి పక్షాన సమస్యలపై నా దినచర్యగా ప్రతిస్పందించాను. భారతదేశంలో స్వాతంత్ర్యం ఎన్ని తప్పిదాలతో, ఎన్ని తప్పు నడకలతో ముందుకు వస్తుందో విప్పి చెప్పగలను. దేశంలో ప్రతి భాషలో ఇంకా పుస్తకాలు రాయబడాలి. ముద్రించబడాలి. అణగారిన ప్రజల జీవిత కథలు ప్రవహించాలి. ప్రతి ఒక్కరి చేతివేళ్ళు అక్షరాల కోసం అంగలార్చాలి. మూగబోయిన గొంతు విప్పాలి. గతంలోనైనా, ఇప్పుడూనా, భవిష్యత్తులోనైనా మనమంతా కలలుగనేది మానవీయ విలువల కోసమే.." అని అక్టోబర్ 21, 2006న మహాశ్వేతాదేవి క్ఫ్లీ జర్మనీ - ఫ్రాంక్ ఫర్ట్ బుక్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. అంతిమంగా మహాశ్వేత "కలలకు స్వాతంత్ర్యం కావాలి. తమ లాంటి రచయితల కలాలకు స్వేచ్ఛకావాలి" అని ఎక్కడైనా, ఎప్పుడైనా తన ప్రసంగంలో చెపుతుండేవారు.


మహాశ్వేతాదేవి రచనలు 90శాతం గిరిజనుల జీవిత సంక్షోభాన్ని ఆవిష్కరించేవే. 1979లో సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన ఆమె చారిత్రక కాల్పనిక రచన 'అరణ్యేర్ అధికార్' (ఎవరిదీ అడవి) 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలనపై జరిగిన ఆదివాసీ ముండా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన గిరిజన నాయకుడు బిర్సాముండా జీవితానికి, పోరాటానికి రమణీయంగా ఉంటుంది.' 'ఎవరిదీ అడవి' 1899-1900లో చోటానాగ్‌పూర్, రాంచీ ప్రాంతంలో జరిగిన గిరిజనోద్యమం (ఉల్‌గులాన్) ఆధారంగా రాసిన నవల ఇది. తెలుగువారు కూడా విశేషంగా చదివిన నవల గిరిజనోద్యమమో, మరో ఘటనో జరిగిన ప్రదేశానికి ఒక్కసారి కూడా వెళ్ళకుండా రచనలు చేసిన వారిలా కాకుండా, అక్కడికి వెళ్ళి, ఆ మట్టితో మాట్లాడి, ఆ గాలిలో తిరగాడి రచనలు చేయడం మహాశ్వేతకు తెలిసిన అద్భుత విద్య. భారతీయ గిరిజనోద్యమాల ఆత్మఘోష మొత్తం 'ఎవరిదీ అడవి' నవల చదివితే మనకి వినిపిస్తుందన్నా అతిశయోక్తి కాదు.

మహాశ్వేత ఒక్కొక్క కథ గిరిజన జీవితంలోని ఒక విషాద పరిణామాన్ని వివరిస్తుంది. 'జీవిత ఖైదీ' కథలో మకరసవర' వర్తమాన చరిత్రలోని ఒక ఘోరంతో అల్లకల్లోలమైన గిరిజన జీవితం కనిపిస్తుంది. ఇది సవర తెగకు చెందిన 'మకర' అనే గిరిజనుడి వైవాహిక సంఘర్షణ. పెండ్లిఅయిన చాలా కాలానికి కూడా అతని భార్యకు గర్భం కాకపోవడంతో ఆమె స్వయంగా విడాకుల కోసం పంచాయతీ ఏర్పాటు చేయిస్తుంది. నిస్సంతువుగా ఉండటం ఆ తెగలో నిషేధం. గ్రామ పెద్దలకు హఠాత్తుగా తెలుస్తుంది అసలు విషయం. అతనికి పిల్లలు పుట్టకుండా, కనీసం అతనికి తెలియకుండా శస్త్రచికిత్స చేశారని! గిరిజన సాంప్రదాయాన్ని 1975 నాటి అత్యవసర పరిస్థితిలో జరిగిన బలవంతపు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు ఎలా సంక్షుభితం చేశాయో వర్ణించే కథ ఇది.

ఆదివాసీ అధ్యయనాల్లో భాగంగా మహాశ్వేతా తెలంగాణలోని గిరిజన పోరాటాలపై విస్తృత సమాచారం సేకరించారు. సామాజిక అణచివేతలపై తిరగబడ్డ ఘనమైన వారసత్వం కుమురం భీం వంటి ఆదివాసీ పోరాట యోధుల్లో ఉన్నట్టు ఆమె గ్రహించారు కూడా. హఠాత్తుగా జూలై 28, 2016న (కలకత్తాలో) కన్నుమూయడంతో అడవి నిర్ఘాంతపోయింది. అడవి రక్షణ మీద, ఆదివాసీ హక్కుల పరిరక్షణ కోసం వారు రాజ్యాంగ ఫలాలు అందిపుచ్చుకునేలా నేటి పాలకులు కొంతైనా చేయగలిగితే అదే మహాశ్వేతకు నిజమైన నివాళి!

సెల్: 9491318409

పతంగి హాఫా




తెలిదేవర భానుమూర్తి

నడినాత్రి. కుక్కలు బౌబౌ మంటున్నయి. చిమ్మట్లు పాటలు బాడుతున్నయి. మొగులు మీద సుక్కలు మెరుస్తున్నయి. సలిగాలి గొడుతున్నది. సడక్ మీద ఆడొక మోటర్, ఈడొక లారి బోతున్నది. జీపుల పోలీసోల్లు గస్తి దిర్గుతున్నరు. దొంగతనం జేసెతందుకు మోక కోసం దొంగలు ఎదురుజూస్తున్నరు. అందరు పండుకున్నరు. కొందరు కల్వరిస్తున్నరు. కొందరు కలల బజార్ల దిర్గుతున్నరు. సడక్ మీద లాటితోని మోర్ గొట్టుకుంట గూర్క గస్తి దిర్గుతున్నడు. జిద్దు ఇడ్వని విక్రమార్కుడు సైకిల్ దీస్కోని ఇంట్ల కెల్లి ఎల్లిండు. సైకిల్ దొక్కుకుంట బొందల గడ్డ దిక్కు బోబట్టిండు.


బొందల గడ్డ కాడ ఉన్న అర్రల బేతాలుడు ఉంటున్నడు. గాడు సుత విక్రమార్కుని లెక్కనే దినం పూట పంటడు. నాత్రి పూట డ్యూటి జేస్తడు.పొద్దుమీకి గానికి వొండుకోబుద్ధి గాలేదు. గాడు హొటల్కుబోయిండు. బిర్యాని దిన్నడు. తిన్నంక సిగిలేట్ దాక్కుకుంట ఇంటికి వొచ్చిండు. టివి జూస్కుంట గూసున్నడు. టివి జూస్కుంటనే గాడు పండుకుండు.

సరింగ నాత్రి రొండుగొట్టంగ బేతాలుని ఇంటి ముంగట విక్రమార్కుడు సైకిల్ రుకాయించిండు. రుకాయించి గంటి బజాయించిండు. ఎప్పటిలెక్కనే సైకిల్ గంటి సప్పుడు ఇనంగనే బేతాలుడు ఇవుతలకు రాలేదు. గీడు పండుకున్నట్లు గొడ్తున్నదనుకోని నాలుగైదు పార్లు విక్రమార్కుడు గంటి బజాయించిండు. గప్పుడు గంటి సప్పుడుకు బేతాలుడు నిద్రలేసిండు. ఇంట్ల కెల్లి ఇవుతలకు వొచ్చిండు. సైకిలెన్క గూసున్నడు. గాడు గూసోంగనే విక్రమార్కుడు సైకిల్ దొక్కబట్టిండు. గప్పుడు సైకిలెన్క గూసున్న బేతాలుడు

"నన్ను గూసుండబెట్టుకోని గుంతలు, ఎత్తుగడ్డలని సూడకుంట సైకిల్ దొక్కుతవు. నీకు దమ్ము రావొచ్చు. నీ కాల్లు గుంజొచ్చు. గవన్ని యాదిమర్సెతందుకు నీకొక కత జెప్త



ఇను. సంక్రాంతి పండ్గ వొచ్చింది. పట్నంల ఉన్నోలల్ల శానమంది ఊర్లల్లకు బోయెతందుకు రడీ అయ్యింన్రు. రేల్‌గాడిలు, బస్సులు జెనంతోని నిండిపోయినయి. ఉన్న రేల్‌గాడిలు, బస్సులు సాలలేదు. ఇగదాంతోని ఇంకొన్ని రేల్‌గాడిలు, బస్సులు నడిపిచ్చిండ్రు. జెనం లేకుండ బట్కె పట్నం సడక్లన్ని కాలి అయినయి. ట్రాపిక్ లేకుంట బోయింది. దాంతోని పోరగాల్లు సడక్ల మీద కిరికిట్ ఆడబట్టిండ్రు. జెనం ఊర్లల్లకు బోతె ఊర్ల కెల్లి గంగిరెద్దులోల్లు పట్నం వొచ్చిండ్రు. సన్నాయి ఊదుకుంట గంగిరెద్దులను ఆడిపియ్యబట్టిండ్రు. అమ్మగారికి దండంబెట్టు, అయ్యగారికి దండం బెట్టు అని పాడబట్టిండ్రు. గంగిరెద్దోల్లు బిచ్చపోల్లు అన్కుంట పోలీసోల్లు గాల్లను జేల్ల బెట్టబట్టిండ్రు. మేము బిచ్చపోల్లం గాము అని గంగిరెద్దోల్లు అన్నరు. గాల్ల గురించి



కొంత మంది సర్కార్‌తోని కొట్లాడిండ్రు.. అమెరిక ప్రెసిడెంట్ ట్రంప్ బిడ్డ ఇవాంక పట్నమొచ్చినప్పుడు గామెకు బిచ్చపోల్లను గండ్లబడకుంట జేసిండ్రు. గాల్లను దూరంగ దీస్కబోయి ఇడ్సిపెట్టిండ్రు. ఇవాంక వొచ్చిపోయినంక గూడ గంగిరెద్దోల్లను బిచ్చపోల్లు అన్కుంట జేల్ల బెట్టిండ్రు. గంగిరెద్దోల్లు లేకుంటె సంక్రాంతి పండ్గ లేదని కొంత మంది కొట్లాడిండ్రు. దాంతోని గంగిరెద్దోల్లను ఇడ్సిపెట్టిండ్రు.

సంక్రాంతి పండ్గ వొచ్చుడుతోని కోడి పందాలు గూడ షురువైనయి. పందెం కోల్ల కాల్లకు చిన్న కత్తులు గట్టి దంగలకు ఇడ్సిపెట్టబట్టిండ్రు. ఒకొక్క కోడి మీద లచ్చల రూపాలు బిట్టు గట్టబట్టిండ్రు. కోడిపందాలు వొద్దని అదాలత్ జెప్పినా ఇంటలేరు. కాంబోడియా దేసంల గూడ కోడి పందాలు అయినయి. గని గక్కడి సర్కార్ కోడి పందాలు ఆడినోల్లకు జుర్మాన ఏసింది. గంతేగాకుంట తొంబై రొండు కోల్లకు మరన శిచ్చ ఏసింది. మరన:శిచ్చ బడిన తొంబై రొండు కోల్లను పోలీసోల్లు మంచిగ కోసుకోని తిన్నరు. గా దేసం తీర్గ ఈడ గూడ ఉంటె బాగుండు గదా అని ఇక్కడి పోలీసోల్లు అనుకున్నరు.

సంక్రాంతి అనంగనే పతంగుల పండ్గ యాదికొస్తది. పోరగాల్లు, పెద్దోల్లు అనకుంట అందరు పతంగులు ఎక్కిస్తరు. పతంగులు ఎక్కియ్యాలంటె పతంగి, దారం, చర్క, మాంజ గావాలె. టిఆర్‌ఎస్, బిజెపి, కమినిస్టు పార్టీలు మాంజ సుతాయించబట్టినయి. గాజును పలగొట్టి పిండిపిండి జేసిండ్రు. గా పిండిని వస్త్రగాలం బట్టిండ్రు. కోడిగుడ్డును బలగ్గొట్టి సొన దీసిండ్రు. కలబందల కెల్లి బంకను దీసిండ్రు. బువ్వను మెత్తగ జేసిండ్రు. అన్నిటిని గల్పి ముద్ద జేసిండ్రు. ఎదురెదురంగ ఉన్న కంబలకు దారంను సుట్టిండ్రు. అన్నిటిని గల్పి జేసిన ముద్దను గా దారంకు రుద్ది మాంజ సుతాయించిండ్రు. టిఆర్‌ఎస్ మాంజల గులాబి రంగు గల్పితె, బిజెపి జాజురంగు గల్పింది. కమినిస్టోల్లు ఎర్రరంగు గల్పిండ్రు. తెలుగుదేసం పచ్చరంగు మాంజ సుతాయించింది. ఒక్క కాంగ్రెస్ పార్టినే మాంజ సుతాయించలేదు. ఎగిరేయిరో ఎముడాల రాజన్న అని రసమయి బాల్‌కిషన్ పాట బాడుతుండంగ మోటర్ బొమ్మతోని ఉన్న పతంగిని కెసిఆర్ ఎక్కిచ్చిండు. ఎర్రమాంజెర్రమాంజ ఎర్రెర్రని మాంజజెర్రమాంజెర్రమాంజ అని పాడుకుంట కమినిస్టు లీడర్లు పతంగులను ఎక్కిచ్చిండ్రు. తామర పువ్వు బొమ్మతోని ఉన్న పతంగులను బిజెపి లీడర్లు ఎక్కిస్తె చెయ్యి బొమ్మతోని ఉన్న పతంగులను కాంగ్రెస్ లీడర్లు ఎక్కిచ్చిండ్రు. పతంగులకు ఆల్లు తోకలను గూడ బెట్టిండ్రు. టిఆర్‌ఎస్, కాంగ్రెస్ పతంగితోని పేంచి ఏసింది. డీల్ ఇడ్సింది. కాంగ్రెస్ పతంగి హాఫా అయ్యింది. బిజెపి గూడ కాంగ్రెస్ పతంగితోని పేంచి ఏసింది. కాంగ్రెస్ పతంగి హాఫా అయ్యింది.

"కాంగ్రెస్ పతంగులే ఎందుకు హాఫా అయినయి. కాంగ్రెస్ ఒక్క పతంగిని గూడ ఎందుకు హాఫా జెయ్యలేదు. గీ సవాల్‌కు జవాబ్ జెప్పకుంటివా అంటె నీ సైకిల్ బిరక్ పేలైతది" అని బేతాలుడు అన్నడు.

"కాంగ్రెస్ కొంగాయితోనే పతంగులు ఎక్కిచ్చింది. సంక్రాంతి పండ్గ అయినంక టిఆర్‌ఎస్, బిజెపి, తెలుగుదేసం లీడర్లల్ల కొంతమంది కాంగ్రెస్‌ల గలుస్తరు. గిప్పుడు ఆల్ల పతంగిలను హాఫా జేస్తె నారజ్ అయితరని కాంగ్రెస్ ఒక్క పతంగిని గూడ హాఫా జెయ్యలేదు" అని విక్రమార్కుడు జెప్పంగనే సైకిల్ దిగి బేతాలుడు బొందలగడ్డ దిక్కు ఉర్కిండు.

సెల్: 9959150491

మానవి
నవతెలంగాణ
manavi@navatelangana.com
హైదరాబాద్ ఆదివారం 14-1-2018

రాధా ప్రశాంతి... ఐదువేలకు పైగా నాటికలు... వందకు పైగా సినిమాలు... ఇవన్నీ చేయాలంటే వెనక ఎవరో ఒకరి సపోర్ట్ ఉండాల్సిందే. లేదంటే కళాకారిణిగా నిలబడటం అసాధ్యం. కానీ అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు ఆమె. ఎవరికీ తలవంచని తత్వం... ముక్కుసూటిగా మాట్లాడే మనస్తత్వం గొప్ప అవకాశాలను పోగొట్టినా... నమ్ముకున్న కళామతల్లి ఆమెను మోసం చేయలేదు. నైపుణ్యంతో భిన్నమైన పాత్రలు చేసి నటిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. కష్టాలను చవిచూస్తూ పెరిగిన ఆమె కష్టాల్లో ఉన్నవారిని చూసి చలించిపోతారు. ఒకప్పుడు అందాల నటిగా ప్రేక్షకుల మదిలో... ఇప్పుడు సామాజిక సేవకురాలిగా పేదల మదిలో నిలిచిపోయిన ఆమె గురించి మరిన్ని విశేషాలు...





జీవితంలో నటించాలన్నారు

ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లా, కాశీనగర్ గ్రామంలో రాధా ప్రశాంతి పుట్టారు. అమ్మ తమటాల పగడాలమ్మ, నాన్న వెంకన్న. రాధకు ఏడేండ్లప్పుడు తండ్రి చనిపోయాడు. ఆమెకు ఇద్దరు చెల్లెళ్ళు, ఓ తమ్ముడు. నలుగురు పిల్లల్ని పెంచి పోషించడానికి తల్లి ఎన్నో కష్టాలు పడింది. పూర్వీకుల నుంచి తమకు రావల్సిన ఆస్తి కోసం ఒంటరిగా 20 సంవత్సరాలు పోరాడింది. చివరకు లాయర్ ఫీజులు కట్టలేక కేసు వదిలేసింది.

రంగస్థల నటిగా...

దసరా నవరాత్రుల సందర్భంగా ఊళ్ళో నాటికలు వేసేవారు. ఓసారి నవరాత్రులకు హీరోయిన్‌గా చేయవల్సిన అమ్మాయి రాలేదు. దాంతో ఏడో తరగతి చదువుతున్న రాధతో ఆ పాత్ర చేయించాలని స్కూల్ టీచర్లు అనుకున్నారు. ఇక నాలుగు రోజుల పాటు రాత్రీ పగలు ప్రాక్టీస్ చేయించారు. ఆ సందర్భంగా బుర్రకథ, చింతామణి, కట్నాల కాపురాలు ఇలా నాలుగైదు నాటికలు నేర్చుకొని నటించారు. అలా ఆమె అనుకోకుండా రంగస్థల నటిగా మారారు.

13 ఏండ్లకే ఉత్తమ నటిగా

అప్పటి వరకు కుటుంబంలో స్టేజ్ఎక్కిన వారు ఎవ్వరూ లేరు. దాంతో చాలామంది ఎన్నో మాటలన్నారు. కానీ ఒంటరిగా తల్లి పడుతున్న కష్టాలను చూసి తను కూడా ఎంతో కొంత సాయం చేయాలని ఇంటి పెద్ద కూతురిగా నిర్ణయించుకున్నారు. అందుకే స్టేజ్ ఆర్టిస్టుగా వచ్చిన ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకున్నారు. అలా సుమారు ఐదు వేల నాటికలు వేశారు. 13వ ఏటనే ఉత్తమ కళాకారిణిగా అవార్డు తీసుకున్నారు. ఆ తర్వాత వెంపటి చినసత్యంగారి దగ్గర కూచిపూడి కూడా నేర్చుకున్నారు. ఆర్థిక సమస్యలు, కాలేజీ దూరంగా ఉండడంతో పదోతరగతితోనే చదువు మానేశారు. దూరవిద్య ద్వారా బి.ఏలో చేరారు. నాటికల్లో బిజీగా ఉండి అది కూడా పూర్తి చేయలేదు.

చేజారిన అవకాశం

15 ఏండ్ల వయసులో జగపతి ఆర్ట్స్ వారి ప్రొడక్షన్‌లో జగపతిబాబుతో 'సింహస్వప్నం' అనే సినిమాకు హీరోయిన్‌గా చేసే అవకాశం వచ్చింది. ఈ అవకాశంతో వెండితెరపై కూడా తానేంటో నిరూపించుకోవాలనుకున్నారు. అయితే యాక్సిడెంట్ వల్ల షూటింగ్‌కి వెళ్ళలేకపోయారు. మళ్ళీ నాటకాలు వేయడం మొదలుపెట్టారు. 'గోగ్రహణం','సింహాద్రి అప్పన్నా కొండదిగిరా', 'పావలా', 'అనగనగా ఒక రోజు', 'తేనె టీగలు పగబడతాయి', 'లేడీ పంజా', 'కన్యాశుల్కం' లాంటి అద్భుతమైన నాటికల్లో కీలక పాత్రలు పోషించారు.



ఇప్పటికైనా నటిస్తా

నేను కోరుకున్నట్టు గొప్ప గొప్ప అవకాశాలు రాకపోయినా కోడి రామకృష్ణగారు, ముత్యాల సుబ్బయ్యగారు, పీఎల్ రాంచంద్రరావు గారు లాంటి డైరెక్టర్లు నా టాలెంట్‌ను గుర్తించి అవకాశాలు కల్పించారు. మంచీ చెడూ అనేవి అన్ని రంగాల్లో ఉంటాయి. అయితే ఈ గ్లామర్ ఫీల్డ్‌లో కాస్త ఎక్కువ. ఇప్పటికైనా అవకాశం వస్తే నటించాలని ఉంది. కాకపోతే నేను కోరుకున్న పాత్రలు కావాలి. మహిళను స్ట్రాంగ్‌గా, శక్తిగా చూపించాలి. నా కోసం అలాంటి పాత్రలు చేసి ఎవరు రిస్క్ తీసుకుంటారు. అయితే ఎవరైనా ఇస్తే మాత్రం కచ్చితంగా నటిస్తాను.

ఎవరికీ లొంగిపోవద్దు

ఆడపిల్లలపై ఎన్నో ఘోరాలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరో వస్తారు, ఆదుకుంటారు అని ఎదురు చూడడం అనవసరం. మగవాళ్ళతో మనం కూడా సమానం. ముందు దీన్ని ప్రతి మహిళా నమ్మాలి. మనలో ఉన్న శక్తిని బయటకు తీసుకురావాలి. సమాజంలో శక్తులగా తయారవ్వాలి. మనల్ని మనం కాపాడుకునే ధైర్యాన్ని నింపుకోవాలి. గుండె ధైర్యంతో ఎలాంటి వారినైనా జయించవచ్చు. ఒకరికి లొంగిపోయి బతికే పరిస్థితి ఎప్పటికీ తెచ్చుకోవద్దు. నా దృష్టిలో డబ్బులు, కత్తులు, తుపాకుల కంటే మహిళకు ముందు ఉండాల్సింది ధైర్యం.

అవకాశాల కోసం తలవంచను

హీరోయిన్ పాత్రల కోసం వచ్చిన మీరు క్యారెక్టర్ ఆరిస్టుగానే ఎందుకు ఉండాల్సి వచ్చిందని ఆమెను అడిగితే 'ఓసారి నేను అక్కినేని నాగేశ్వరావుగారిని కలిసి, ఇప్పటి వరకు ఐదువేల నాటికలు వేశాను. హీరోయిన్‌గా ఒక్క అవకాశం ఇస్తే నేనేంటో నిరూపించుకుంటాను. మీరే ఎలాగైనా మాట సాయం చేయమని అడిగాను. దానికి ఆయన 'ఈ ఇండస్ట్రీలో ఎదగాలంటే తెరపైన కాదు జీవితంలో నటించాలి. నువ్వా అలా నటించాలనుకుంటే హీరోయిన్‌గా అవకాశాలు వస్తాయి. లేదంటే పెండ్లి చేసుకుని సెటిలైపో. రికమండేషన్లతో పనులు కావు' అన్నారు. అప్పుడే నిర్ణయించుకున్నాను. అవకాశాల కోసం దిగజారాల్సిన అవసరం లేదని. అందుకే వచ్చిన అవకాశాలనే ఉపయోగించుకున్నాను' అన్నారు.

మళ్ళీ ఎదురుదెబ్బ

అప్పట్లో ప్రధానిగా ఉన్న పీవీ నరసింహారావు వాళ్ళ ఊరికి వస్తున్న సందర్భంగా ఓ ప్రోగ్రామ్ చేశారు. ఆ ప్రోగ్రామ్‌లో సుధాకర్‌రెడ్డి అనే కెమెరామెన్ రాధను చూసి సినిమా అవకాశం ఇప్పించారు. అయితే సినిమాల్లో నటించడానికి ముందు తల్లి ఒప్పుకోలేదు. ఇప్పటికే 'నీ కూతురు నాటికలు వేస్తూ కులం పరువు తీస్తుంది' అంటూ అందరూ నానా మాటలు అనేవారు. ఇప్పుడు సినిమాలంటే ఇంకెన్ని అంటారో అని ఆమె భయపడింది. అంతేకాక అప్పట్లో సినిమాలంటే మద్రాస్ వెళ్ళాలి. ఆడపిల్లను అంత దూరం పంపించడం కూడా ఆమెకు ఇష్టం లేక వద్దని చెప్పి వచ్చిన అవకాశాన్ని వదులుకున్నారు. కానీ మళ్ళీ నెల తర్వాత వాళ్ళే మళ్ళీ అడిగారు. 'మీ అమ్మాయి బాధ్యత మాది. ఆమెతో పాటు మరొకరు తోడుగా రావొచ్చు. వాళ్ళ ఖర్చులు కూడా మేమే పెట్టుకుంటాం' అని అగ్రిమెంట్ రాసిచ్చారు. దాంతో తల్లి ఒప్పుకుంది. అప్పుడే 'శ్రీదేవి నర్సింగ్ హోం' సినిమాలో హీరోయిన్‌గా చేశారు. అయితే కొన్ని ఆర్థిక సమస్యల వల్ల ఆ సినిమా రిలీజ్ కాలేదు. అలా రెండు సార్లు వెండితెరపై కనిపించే అవకాశం చేజారిపోయింది.

పట్టువదలకుండా...

కొంత కాలం పట్టువదలకుండా ప్రయత్నించగా 'పరువు ప్రతిష్ట' సినిమాలో సుమన్‌కు చెల్లెలిగా అవకాశం వచ్చింది. ఆ తర్వాత 'కూతురు'లో ఊహకు అక్కగా, 'సహనం'లో ప్రకాశ్‌రాజ్ భార్యగా చేశారు. మెల్లమెల్లగా అవకాశాలు పెరగడంతో 1992లో హైదరాబాద్ వచ్చేశారు. అయితే రాధకు తల్లిదండ్రులు పెట్టిన పేరు కృష్ణవేణి. సినిమాల్లోకి వచ్చిన తర్వాత ప్రశాంతిగా మారింది. ఈమె చూడటానికి హీరోయిన్ రాధలా ఉండడంతో రాధా ప్రశాంతిగా ఆమె పేరు స్థిరపడి పోయింది. ఆ తర్వాత 'గోకులంలో సీత', 'పెళ్ళి పందిరి', 'పెళ్ళి కానుక', 'ఎర్రసూర్యుడు', 'అందరూ అందరే'... ఇలా దాదాపు 100 సినిమాల్లో భిన్నమైన పాత్రలు చేశారు.

విభిన్న భాషల్లో...

ఆమె కేవలం తెలుగు పరిశ్రమకే పరిమితం కాలేదు. ఎక్కడ అవకాశం వచ్చినా ఉపయోగించుకున్నారు. అలా ఓ మళయాళం సినిమాలో హీరోయిన్‌గా చేశారు. హిందీలో రెండు సినిమాలు, ఓ సీరియల్లో నటించారు. అలాగే తమిళం, కన్నడలో ఒక్కొక్క సినిమా చేశారు. ఇంకా 'అన్వేషిత' అనే తెలుగు సీరియల్లో 'కాత్యాయిని'గా టీవీ ప్రేక్షకులకు దగ్గరయ్యారు. తర్వాత 'కళంకిత' అనే సీరియల్లో కూడా నటించారు.

కుటుంబం తర్వాతే పెండ్లి

సినిమాల్లో నటించేటప్పుడు ఎంతో మంది ఆమెకు ప్రపోజ్ చేశారు. అయితే పెండ్లి చేసుకుని తన సుఖం తాను చూసుకుంటే ఇద్దరు చెల్లెళ్ళు, తమ్ముడు, తల్లి దిక్కులేని వారవుతారని వదులుకున్నారు. చిన్నవాళ్ళు స్థిరపడిన తర్వాతనే పెండ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓ యాడ్ ఫిలిం కోసం ఆమెను కలవడానికి కిరణ్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి వచ్చారు. అలా పరిచయమైన ఆయన కొంత కాలానికి పెండ్లి చేసుకుందామని అడిగారు. కానీ ముందు ఆమె ఒప్పుకోలేదు. ఆయన రెండేండ్లు ఎదురు చూశారు. చివరకు చెల్లెళ్ళు, తమ్ముడిని స్థిరపరిచి అప్పుడు కిరణ్‌కుమార్‌రెడ్డిని పెండ్లి చేసుకున్నారు.

సామాజిక సేవకురాలిగా...



పెండ్లి తర్వాత నటనకు దూరమయ్యారు. భర్త రాజకీయాల్లో ఉంటారు. వీరికి ఇద్దరు పిల్లలు. తర్వాత కొంత కాలం కుటుంబ బాధ్యతల్లో మునిగిపోయారు. అప్పటికే ఆర్థికంగా కాస్త స్థిరపడ్డారు. చిన్నతనం నుంచి తల్లి కష్టాలు చూసిన ఆమె పేదలకు, ఒంటరి మహిళలకు, పిల్లలకు ఎంతోకొంత సాయం చేయాలని నిర్ణయించుకున్నారు. తన సొంత ఊరిలోని డప్పు కళాకారులైన 25 మందికి ఇండ్లు నిర్మించి ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ చదివే పిల్లలకు ఫీజులు కట్టి సాయం చేశారు. ఇప్పటికీ తనకు తోచిన సాయం చేస్తూ సోషల్ వర్కర్‌గా సమాజానికి తన వంతు కృషి చేస్తున్నారు. సొంత ఊళ్ళో గుడి కూడా కట్టించారు. సామాజిక సేవకురాలిగా రాధ చేస్తున్న సేవలకు మెచ్చి 2013లో రాష్ట్రపతి చేతుల మీదుగా 'స్త్రీ శక్తి' పురస్కారాన్ని ప్రదానం చేశారు. అలాగే 2017లో థియోలాజిల్ ఓపెన్ యూనివర్సిటీ(యుఎస్ బర్కిలీ) డాక్టరేట్ ఇచ్చి గౌరవించింది.

సలీమ

సుప్రసిద్ధ శాస్త్రవేత్త

మనుషుల్లో రోగనిరోధక శక్తి తగ్గడానికి కారణాలను కనుగొని ఎన్నో భయంకరమైన రోగాలను సమూలంగా నాశనం చేసే చికిత్సల కోసం పరిశోధనలు చేసిన శాస్త్రవేత్త ఇందిరా నాథ్. కుష్టువ్యాధి గురించి ప్రపంచానికి తెలియకముందే ఆ వ్యాధి మూలాలను నశింపచేసే చికిత్సను కనుగొని, మన దేశములో కుష్టువ్యాధి వ్యాపించ కుండా కృషి చేసిన వైద్యపరిశోధకురాలు. ఆమె మన తెలుగు మహిళ కావడం గర్వకారణం.

గుంటూరు జిల్లా పొన్నూరు మండలం బ్రాహ్మణకోడూరులో ఇందిర జన్మించారు. ఆమె తల్లిదండ్రులు నాగరత్నమ్మ, వెంకటరావు. స్థానికంగా ప్రాథమిక విద్యను పూర్తి చేసిన ఆమె ఢిల్లీలోని భారత వైద్య శాస్త్ర సంస్థలో (AIIMS) 1963లో M.B.B.S, 1969లో M.D చదివారు. ఇంగ్లాండ్‌లో 1983 లో M.R.C.P (Pathology) పట్టా అందుకున్నారు. ఆ తర్వాత ఎం.ఎన్.ఎ.ఎమ్.ఎస్., ఎఫ్.ఎ.సి.ఐబీ ఎఫ్.ఎన్.ఎస్.సి పూర్తి చేశారు.

లండన్‌లోని ఈస్ట్ సఫొల్క్ వైద్యశాలలో (1963–64), కార్డిఫ్‌లోని వైద్య కళాశాలలో (1964), లండన్‌లోని స్టేట్ హార్ట్ హాస్పిటల్‌లో (1965) పనిచేశారు. ఇందిర 1965లో సెయింట్ ఆండ్రూస్ వైద్యశాలలో రిజిస్ట్రార్‌గా నియమించబడ్డారు. ఆ తర్వాత 1967లో భారత్ తిరిగి వచ్చిన ఆమె AIIMS లో బయోటెక్నాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా (1967 – 71), సత్యేంద్రనాథ్ బోస్ రీసెర్చ్ సంస్థలో ప్రొఫెసర్‌గా (1999) పనిచేసి ఎంతో మంచి వైద్య విద్యార్థులను పరిశోధనా రంగంలో ప్రోత్సహించారు.



ఇందిరా నాథ్
(14 జనవరి, 1938)

కుష్టువ్యాధిని గుర్తించేందుకు రెండు "ఎం లెప్రాయ్" అనే ప్రోటీను అన్వేషించి కనుగొనడంలో ఇందిర పరిశోధనలు కీలకంగా మారాయి. ఈ వ్యాధి పై ఆమె చేసిన పరిశోధనలు ప్రపంచానికి ఎన్నో కొత్త విషయాలను తెలియచేశాయి. ఈ వ్యాధి వ్యాపించకుండా ఉండటానికి అందించాల్సిన చికిత్సను కనుగొనడంలో ఆమె విశేష కృషి చేశారు.

ఆమె పరిశోధనలకు మెచ్చి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులతో సత్కరించారు. ట్రస్ట్ ఫండ్ ఓరేషన్ అవార్డ్ (1981), శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు (1983)1985 లో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ అవార్డు అందుకున్న ఆమె వ్యాధి నిరోధక శాస్త్రంలో చేసిన కృషికి భారత ప్రభుత్వం 1999లో 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. 'ఇండియన్ జర్నల్ ఆఫ్ లెప్రసీ", "ఆసియన్ ఫసిఫిక్ జర్నల్ ఆఫ్ ఎలర్జీ అండ్ ఇమ్యూనిటీ" పత్రికలకు సహాయ సంపాదకులుగా, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ వారి ప్రచురణల సంపాదక మండలికి ఛైర్ పర్సన్‌గా పనిచేశారు.

పరిశోధనా రంగంలో ఎంతో కృషి చేసిన డాక్టర్ ఇందిర ఇండియన్ అకాడామీ ఆఫ్ సైన్సెస్, కాలేజీ ఆఫ్ అలర్జీ అండ్ అప్లైయడ్ ఇమ్యూనాలజీ సంస్థలలో ఫెలోషిప్ అందుకుని ఎన్నో పరిశోధనలు చేశారు. నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఇండియన్ ఇమ్యూనాలజీ సొసైటీ, ఇండియన్ అసోషియేషన్ ఆఫ్ పాథాలజిస్ట్ అండ్ మైక్రో బయోజిస్ట్ తదితర సంస్థలలో బాధ్యతాయుత పదవులను నిర్వహించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లెప్రొలాజిస్ట్ జీవిత సభ్యులుగా ఉన్నారు.

ఇందిరా నాథ్ అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలోని బయోటెక్నాలజీ విభాగానికి అధిపతిగా ఎస్.ఎన్.బోస్ కేంద్రంలో పరిశోధకులుగా సేవలందిస్తున్నారు. మనదేశంలో వ్యాధినిరోధక శాస్త్రం అంతగా అభివృద్ధిచెందని సమయంలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థలో బయోటెక్నాలజీ విభాగాన్ని 1986 సంవత్సరంలో ప్రారంభించారు. గత 30 సంవత్సరాలుగా ఎందరో శాస్త్రవేత్తలకు ఈ విభాగంలో శిక్షణ ఇచ్చారు.

ముత్యాల ముగ్గులు



17చుక్కలు
17 వరుసలు




ఎ. ఊర్మిల
సుజాత విద్యానికేతన్
హసన్ పర్తి






పొరండ్ల రూప
శాయంపేట, వరంగల్

25చుక్కలు 5 వరుసలు
2 చుక్కలు వదిలి 7 వచ్చే వరకు
1 చుక్క వదిలి 5చుక్కలు
2 వరుసలు



కట్ట అనురాధ
వి.ఎస్.టి

21చుక్కలు
చుక్క విడిచి చుక్క
1 వచ్చేవరకు



ఎ. కళావతి
సింగపేట్,
గద్వాల జిల్లా

21చుక్కలు
11 వచ్చేవరకు
మధ్యచుక్క





పమ్మి విజయలక్ష్మి
మహబూబాబాద్



21చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకు



ఎం. ఇందు చౌహాన్
విద్యానగర్
హైదరాబాద్





ఎ. సుజాత
సికింద్రాబాద్



హైమావతి
నాచారం

26చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకు

పల్లెకు పోదాం చలో..చలో



సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్ మహా నగరం పల్లెబాట పట్టింది. శనివారం సాయంత్రం సికింద్రాబాద్ స్టేషన్‌లో రైలు ఎక్కేందుకు ప్రయాణికులు పోటీ పడ్డారు.

సంక్రాంతికి పవన్ శుభాకాంక్షలు

హైదరాబాద్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జనసేన అధినేత, సినిమాహీరో పవన్‌కళ్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యపు రాశులు ఇంటికి చేరే కాలం కావడంతో రైతులు సంతోషంతో జరుపుకునే సంప్రదాయపు పండుగ ఈ సంక్రాంతి అని అన్నారు.

హెచ్‌ఎంల అధికారాలకు కత్తెర

- టీచర్ల సెలవులు ఇక ఎంఈఓ ద్వారానే..
- జీవోలను కాదని విద్యాశాఖ వివాదాస్పద ఉత్తర్వులు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పాఠశాల విద్యాశాఖలో గణితం,సైన్స్ టీచర్ల పంచాయితీ ముగియక ముందే మరో గందరగోళం మొదలైంది. నిన్నమొన్నటి వరకు ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుల(హెచ్‌ఎం) ద్వారా సెలవులు పొందిన ఉపాధ్యాయులు, ఇక నుంచి మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) ద్వారా పొందాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. స్థానిక హెచ్‌ఎంలకే ఆ అధికారాలు ఇస్తూ సర్కారు ఇచ్చిన జీవోను పక్కన పెడుతూ, ఉన్నతాధికారులు ఇచ్చిన ఉత్తర్వులపై ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు హెచ్‌ఎంల అధికారాలను తగ్గించడంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులందరికీ సెలవులు(సీఎల్) మంజూరు చేసే అధికారాలను ఆయా పాఠశాలలలోని ప్రధానోపాధ్యాయులకు ఇస్తూ 2002 ఫిబ్రవరి 7న జీవోనెంబర్ 40, 2009జూలై 6న జీవోనెంబర్ 70లను అప్పటి ప్రభుత్వాలు ఇచ్చాయి. ప్రధానోపాధ్యాయుల సెలవులను స్థానిక ఎంఈఓ ద్వారా తీసుకోవాల్సి ఉంటుంది. సీఎల్ కాకుండా ఇతర సెలవులను ఎంఈఓలు ఇస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల సెలవులు పెడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంకు సమాచారం ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం ఈ జీవోలను కొనసాగిస్తూ వచ్చింది. అయితే ఇటీవల రాష్ట్ర మానిటరింగ్ బృందాలు పలు పాఠశాలలను సందర్శించాయి. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో టీచర్లు వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నారని, సింగిల్ టీచర్ స్కూళ్లలో టీచర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఉన్నతాధికారులకు ఆ బృందాలు వివరించాయి. దీంతో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ బడుల్లో టీచర్లకు సెలవులిచ్చే హెచ్‌ఎంలకు ఉన్న అధికారాలను కత్తిరిస్తూ ఈనెల 12న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆర్‌సీనెంబర్ 83 ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇక సెలవులు తీసుకోవాలంటే కాంప్లెక్స్ హెచ్‌ఎం ద్వారా ఎంఈఓకు లీవ్ లెటర్ పంపి సెలవులు మంజూరు చేసుకోవాల్సి ఉంది. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కాంప్లెక్స్‌లోని బడుల ఉపాధ్యాయుల సెలవు వివరాలను రికార్డు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ప్రభుత్వమిచ్చిన జీవోలను తొక్కిపెడుతూ, విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు ఇవ్వడంపై తీవ్ర గందరగోళం నెలకొన్నది.

మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు..

విద్యాశాఖ ఉన్నతాధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఉపాధ్యాయుల గౌరవాన్ని తగ్గించే ఇటువంటి చర్యలను మానుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ రాములు, చావ రవి కోరారు. ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం అంజిరెడ్డి, చెన్నయ్య డిమాండ్ చేశారు. పాత విధానాన్నే కొనసాగించాలని ఎస్‌టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భుజంగరావు, సదానందంగౌడ్ కోరారు. ఉపాధ్యాయుల వ్యక్తిగత సెలవులపైనా ఆంక్షలు విధించడం సరికాదని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఈ రఘునందన్, టీఎస్‌పీటీఏ రాష్ట్ర అధ్యక్షులు షౌకత్‌అలీ అభిప్రాయపడ్డారు.

తండ్రి, ఇద్దరు కొడుకుల ఆత్మహత్య

- రైలుపట్టాలపై..., కుటుంబ కలహాలే కారణం..!

నవతెలంగాణ-ఖమ్మం

ఇద్దరు కుమారులతో కలిసి ఓ తండ్రి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం ఉదయం ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా తిరువూరుకు చెందిన నేరెళ్ల కాశీ విశ్వనాథం(38) ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కొర్లగూడెం గ్రామానికి చెందిన సరితను పదిహేను ఏండ్ల కిందట వివాహం చేసుకున్నాడు. కుటుంబంతో కలిసి కల్లూరులోని అంబేద్కర్‌నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. విశ్వనాథం గుమస్తాగా షాపులో పనిచేస్తున్నాడు. ఆ తర్వాత ఇంటి వద్ద చిన్న కిరాణా దుకాణం ఏర్పాటు చేశాడు. 2007 ఏప్రిల్‌లో ఖమ్మం యూనిట్‌లో హోంగార్డుగా ఉద్యోగం పొందాడు. జిల్లాల విభజన అనంతరం కొత్తగూడెం యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో కాశీ విశ్వనాథం తన ఇద్దరు పిల్లలు జయంత్(13), అజయ్ కుమార్(11)ను తీసుకొని శనివారం ఉదయం ఖమ్మం వచ్చాడు. ముగ్గురూ రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలో జయంత్ తల, మొండెం వేరయ్యాయి. అజయ్ తలకి తీవ్ర గాయాలయ్యాయి. విశ్వనాథం శరీరం రెండు ముక్కలుగా విడిపోయింది. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిబ్రవరిలో పార్టీపై టీజేఏసీ ప్రకటన

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్టీ ఏర్పాటుపై టీజేఏసీ సమాలోచనలు జరుపుతున్నది. ఫిబ్రవరి 3 లేదా 4 తేదీల్లో జరిగే విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. ఆ రోజే పార్టీపై ప్రకటన చేస్తారని సమాచారం. శనివారం నాంపల్లిలో టీజేఏసీ స్టీరింగ్ కమిటీ అంతర్గత భేటీ జరిగింది. చైర్మెన్ కోదండరామ్‌తో పాటు వెంకట్‌రెడ్డి, రఘు, తదితర ముఖ్యనేతలంతా హాజరయ్యారు. రైతు యాత్రలతో పాటు ఇటీవల జరిగిన సంఘటనపై చర్చించారు. ఉమ్మడి పది జిల్లాల్లో జరిగిన కార్యక్రమాలపై పదిరోజుల పాటు అధ్యయనం చేసి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయం తీసుకున్నారు. రైతాంగ సమస్యలపై ఫిబ్రవరిలో సభ ఏర్పాటు చేయాలని అనుకున్నారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్) గురించి చాలాసేపు చర్చించినట్టు తెలిసింది. పార్టీని ఏర్పాటు చేయకుంటే ఇప్పటిదాకా టీజేఏసీకి మద్దతిస్తున్న ప్రజాసంఘాలు దూరమయ్యే ప్రమాదం ఉందని అంచనాకు వచ్చినట్టు తెలిసింది.

మహారాష్ట్రలో మావోయిస్టు నేత మహేష్ అరెస్ట్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

మావోయిస్టు నేత మహేష్ అలియాస్ స్వామి అలియాస్ వేణుని మహారాష్ట్ర పోలీసులు శనివారం అరెస్టు చేశారు. మావోయిస్టు కార్యకలాపాలు ఎక్కువగా సాగే గడ్చిరోలి ప్రాంతంలో మహేష్‌ను అరెస్టు చేసినట్టు సమాచారం. దాదాపు 15 ఏండ్లకు పైగా అజ్ఞాతంలో ఉన్న మహేష్ నల్లగొండవాసిగా ఇక్కడి ఇంటలిజెన్స్ అధికారి ఒకరు తెలిపారు. పార్టీలో ఆర్ఎస్‌యూ కార్యకలాపాలకు ఆకర్షితుడై మావోయిస్టు పార్టీలో చేరినట్టు తెలుస్తోంది. కాగా ఎక్కువకాలం దండకారణ్యం, గడ్చిరోలి, బస్తర్ జిల్లాల్లో ఇతను డిస్ట్రిక్ట్ కమిటీ మెంబర్ (డీసీఎమ్)గా కార్యకలాపాలు సాగించినట్టు ఇంటలిజెన్స్ వర్గాలు తెలిపాయి. అయితే రాష్ట్రంలో మాత్రం ఏ పోలీస్‌స్టేషన్‌లోనూ ఇతనిపై కేసులు లేవని ఆ వర్గాలు వివరించాయి. అవసరమైతే మహేష్‌ను ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్ తీసుకొచ్చి విచారించే అవకాశాలు ఉన్నాయి.

పరామర్శపై పాశవికం

పెత్తందార్ల దాడికి గురైన దళితులను కలవడానికి వెళ్తున్న సీపీఐ(ఎం) నాయకులపై పోలీసుల నిర్బంధం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు సహా నాయకులు, కార్యకర్తలు అరెస్టు, పలు పోలీస్ స్టేషన్లకు తరలింపు
- గుంటూరు అంబేద్కర్ విగ్రహం వద్ద
- నిరసనలో పాల్గొన్న వీఎస్ఆర్,
- బాబూరావు ప్రభృతుల అరెస్టు





గుంటూరు జిల్లా పెద్దగొట్టిపాడులో పెత్తందార్ల దాడిలో గాయపడిన దళితులను పరామర్శించడానికి వెళ్లున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి మధును, ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు వి కృష్ణయ్యను అరెస్టు చేస్తున్న పోలీసులు

గుంటూరు : గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా దళితులపై ఆధిపత్య కులాల వారు దాడికి పాల్పడిన నేపథ్యంలో.. బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న సీపీఐ(ఎం) నాయకులను అక్రమంగా అరెస్టు చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధుతోపాటు ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలను పెద్దసంఖ్యలో పోలీసులు శనివారం గుంటూరులో అరెస్టు చేసి తీవ్ర ఉద్రిక్తతకు కారణమయ్యారు. అరెస్టు చేసిన వారిని జిల్లాలోని వేర్వేరు పోలీసు స్టేషన్లకు తరలించారు. పెదగొట్టిపాడును సందర్శించేందుకు మధుతోపాటు పార్టీ నాయకులు వస్తున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో.. శుక్రవారమే పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావుతోపాటు పలువురు నాయకులను అరెస్టు చేయడమేకాకుండా పార్టీ నాయకుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఉదయం 7 గంటల నుంచి పోలీసులు బ్రాడీపేటలోని సీపీఐ(ఎం) కార్యాలయాన్ని దిగ్బదించారు. పరిసర వీధుల్లో పోలీసులను మొహరించారు. నగరంలోని పోలీసు అధికారులను బస్టాండ్, రైల్వే స్టేషన్లలో తనిఖీలు నిర్వహించి మధు ఏ మార్గం నుంచి వస్తున్నారో తెలుసుకునేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ఉదయం 10 గంటల సమయంలో పోలీసుల నిఘాను చేధించుకుని మధు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.కృష్ణయ్య, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు 70 మంది వరకూ బ్రాడీపేట సీపీఐ(ఎం) కార్యాలయానికి చేరుకున్నారు. వెంటనే పోలీసులు ఒక్క ఉదుటున సీపీఐ(ఎం) నాయకులను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్రంగా పెనుగులాట జరిగింది. ఒక అదనపు ఎస్పీ,. ఒక డిఎస్పీ,. నలుగురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, పెద్ద సంఖ్యలో పోలీసులు కార్యకర్తలను వాహనాల్లోకి లాగివేశారు. బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించారు. ఈ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు నినాదాలు చేశారు. సీఎం డౌన్ డౌన్.. రావెల కిషోర్‌బాబు డౌన్ డౌన్.. పోలీసు జులుం నశించాలి.. దళితులపై దాడి చేసిన అగ్రకులాల వారిని అరెస్టు చేయాలి.. అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పెనుగులాటలో సీపీఐ(ఎం) గుంటూరు జిల్లా (పశ్చిమ) కమిటీ కార్యదర్శి గద్దె చలమయ్య స్పృహ తప్పి పడిపోవటంతో జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం జీజీహెచ్ నుండి తిరిగి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధు, వి.కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు సహా, జిల్లా నాయకులతో కలిపి మొత్తం 58 మందిని అరెస్ట్ చేసి, తాడికొండ, నల్లపాడు, పట్టాభిపురం పోలీసు స్టేషన్లకు తరలించారు. మధు, కృష్ణయ్యతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన జిల్లానాయకులను అరెస్టు చేసిన నేపథ్యంలో సీపీఐ(ఎం) కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, రాజధాని కమిటీ కన్వీనర్ సిహెచ్ బాబురావు, న్యాయవాది వై.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గుంటూరు అంబేద్కర్ సెంటర్‌లో దళితాగ్రహం పేరుతో ధర్నా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. వీరిని పోలీసులు అరెస్టు చేశారు. అలాగే శుక్ర, శనివారాల్లో అరెస్టు చేసిన వారందరినీ శనివారం సాయంత్రం విడుదల చేశారు. ఈ అక్రమ అరెస్టులపై జిల్లా వ్యాపితంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు జరిగాయి.

పోరాటం ఆగదు

డీఎస్ఎంఎం కన్వీనర్ వి.శ్రీనివాసరావు



పెదగొట్టిపాడు బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగుతుందని దళిత్ శోషణ్ ముక్తి మంచ్ కన్వీనర్ వి.శ్రీనివాసరావు ప్రకటించారు. నగరంలోని లాడ్జిసెంటర్ దగ్గర ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర గొట్టిపాడు బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కెవిపిఎస్, పెదగొట్టిపాడు దళిత బాధితుల పోరాట సంఘీభావ కమిటీ, భీమసేన సేవాదళ్ తదితర దళిత సంఘాల ఆధ్వర్యంలో శాంతియుత నిరసన కార్యక్రమం జరిగింది. గొట్టిపాడుకు వెడుతున్న సీపీఐ(ఎం) నేతలను అరెస్ట్ చేయడాన్ని కూడా ఈ సందర్భంగా ఖండించారు. పోలీసులు ఈ కార్యక్రమాన్ని కూడా అడ్డుకుని పాల్గొన్న వారిని అరెస్ట్‌లు చేశారు. అరెస్ట్‌లకు ముందు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ డిసెంబరు 31 రాత్రి జరిగిన ఘటనలో అసలు దోషులను వదిలేసి దళితులను వేధిస్తున్నారని తెలిపారు. ఆ రాత్రి పెత్తందార్లు ట్రాక్టర్లపై వెళ్లి దళితవాడపై దాడులు చేయటం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

ఆంధ్రావ్యాలీకి అంకురార్పణ

- 8 కంపెనీలను ప్రారంభించిన ముఖ్యమంత్రి
- సిలికాన్ వ్యాలీ తరహాలో అభివృద్ధి
- లక్ష ఉద్యోగాలే లక్ష్యమంటూ ప్రకటన

తిరుపతి :తిరుపతిని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతున్నట్లు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు చెప్పారు. సిలికాన్ వ్యాలీ తరహాలో ఆంధ్రా వ్యాలీగా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. సంక్రాంతి పండుగకు స్వగ్రామమైన నారావారిపల్లెలో మూడు రోజులపాటు ముఖ్యమంత్రి బస చేయనున్నారు. శనివారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్న ఆయన ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీబిజీగా గడిపారు. రేణిగుంట, తిరుపతిలో ఏర్పాటు చేసిన 8 ఐటి కంపెనీలను శనివారం ప్రారంభిం చారు. రేణిగుంట రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన ప్రముఖ ఐటి కంపెనీ 'జోహో'ను తొలుత ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. చెన్నయ్, బెంగుళూరుకు సమీపంలోని తిరుపతి పారిశ్రామికంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే సెల్‌కాన్, కార్బన్, డిక్సన్ లాంటి కంపెనీలు వచ్చాయని తెలిపారు. ఐఐటి, ఐసర్, ఎస్వీయూ, వివిధ వర్సిటీల నేతృత్వంలో నాలెడ్జ్‌హబ్‌గా రూపుదిద్దుకుంటున్న తిరుపతి నగరానికి మరిన్ని ఐటీ కంపెనీలు రానున్నాయని వెల్లడించారు. విద్యార్థులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు శిక్షణను ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జోహో ముందుకురావడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ఐటి, పంచాయతీరాజ్‌శాఖామంత్రి నారాలోకేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని, ఆయన దూరదృష్టితోనే హైదరాబాద్ సైబర్‌సిటీగా మారిందని పొగడ్తలతో ముంచెత్తారు. రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి ఎన్ అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. నారా చంద్రబాబు, నారా లోకేష్‌ల నేతృత్వంలో సింగిల్‌విండో విధానంతో పరిశ్రమలకు అన్ని అనుమతులను, సౌకర్యాలను, రాయితీలను ఇస్తూ ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం మరో 7 కంపెనీలైన ఏంజీఎస్ హెల్త్, పారికర్ సాఫ్ట్‌వేర్, ఎక్సాఫ్లఎన్స్, నేస్, ఎఎన్ఎస్, వైఐఎటీ, ఇన్జెనీసీస్ లను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో జోహో చీఫ్ రాజువిగేశ్న, సీఈవో శ్రీధర్, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయానంద్, చిత్తూరు ఎంపీ శివప్రసాద్, ఎంఎల్‌సీ గౌనివారి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న పాల్గొన్నారు.

నారావారిపల్లెలో నారా,నందమూరి కుటుంబీకులు

ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లెలో నిర్వహించే సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు నారా, నందమూరి కుటుంబీకులు హాజరయ్యారు. చంద్రబాబు, నారా లోకేష్‌లకంటే ముందుగానే శనివారం మధ్యాహ్నం నారా భువనేశ్వరి, బ్రాహ్మణి, నందమూరి బాలకృష్ణ, వసుంధరలతోపాటు పలువురు కుటుంబ సభ్యులు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి నారావారిపల్లెకు చేరుకుని సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు.

పక్కపక్కనే సీఎం, ప్రతిపక్షనేతల సంక్రాంతి సంబరాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్షనేత జగన్ కుటుంబీకులు ఒకే నియోజకవర్గంలో, పక్కపక్క మండలాల్లోనే సంక్రాంతి వేడుకల్ని నిర్వహించుకోబోతున్నారు. చిత్తూరు జిల్లా, చంద్రగిరి మండలంలోని నారావారిపల్లెలో సంక్రాంతి పండుగ నిర్వహించుకునేందుకు స్వగ్రామానికి చంద్రబాబు కుటుంబీకులు శనివారం చేరుకున్నారు. ప్రతిపక్షనేత వైఎస్ జగన్ ప్రస్తుతం అదే నియోజవర్గం, రామచంద్రాపురం మండలం నెన్నూరులో పాదయాత్రను శనివారం నిర్వహించారు. అక్కడే గుడారం ఏర్పాటు చేసుకుని రాత్రికి అక్కడే బసచేయనున్నారు. సంక్రాంతి వేడుకనూ అక్కడే నిర్వహించుకోనున్నారు. ఈ నేపథ్యంలో జగన్ తల్లి విజయమ్మ, భార్య భారతితో పాటు కుటుంబీకులు శనివారం నెన్నూరుకు చేరుకున్నారు. అటు ముఖ్యమంత్రి, ఇటు ప్రతిపక్ష నేతల కుటుంబాలు పక్కపక్క మండలాల్లోనే సంక్రాంతి పండుగను నిర్వహించుకోవడం గమనార్హం.

పరోక్ష పద్ధతిలో సర్పంచ్ ఎన్నిక

- పీఆర్ చట్టం ముసాయిదాలో ప్రతిపాదన
- ప్రత్యేక సమావేశాల్లోనే మోక్షం



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీరాజ్ కొత్త చట్టం ముసాయిదాను క్యాబినెట్ సబ్‌కమిటీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు అందజేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన శనివారం మరోసారి సబ్‌కమిటీ భేటి జరిగింది. దీనికి మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, టి.హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, కె.తారకరామారావు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మురోసారి గత వారంరోజులుగా ఉన్నతాధికారులు, అధికారులతో జరిగిన చర్చల సారాంశాన్ని సమీక్షించారు. అలాగే ఆయా ప్రజాప్రతినిధులు, ఇతరుల నుంచి వచ్చిన వినతులను పరిశీలించారు. పంచాయతీరాజ్ చట్టంలో సర్పంచుల అధికారాలతోపాటు బాధ్యతలు, విధుల విషయంలో ముసాయిదాలో స్పష్టంగా పేర్కొన్నట్టు సమాచారం. అలాగే అవకతవకలకు పాల్పడే సర్పంచులపై చర్యలు తీసుకునే అధికారం కలెక్టర్లకు ఇప్పటికే ఉంది. ఆ చర్యలపై స్టే ఇచ్చే అధికారం సంబంధిత పంచాయతీరాజ్ శాఖ మంత్రికి ఉండేది. ఇప్పడే దాన్ని ట్రిబ్యునల్‌కు అప్పగిస్తే పారదర్శకత ఉంటుందని ముసాయిదాలో పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో జరిగే లేఅవుట్ల అనుమతులు, ఇండ్ల నిర్మాణ అనుమతుల విషయంలో మండల స్థాయిలో కమిటీలు వేయాలని ప్రతిపాదించారు. అలాగే స్థానికంగా పారిశుధ్య నిర్వహణ విషయంలో కఠినంగా ఉండేందుకు, రోడ్లను శుభ్రంగా ఉంచుకోవడంలో స్థానిక ప్రజలు విఫలమైతే జరిమానా విధించడం తదితర చర్యలను చర్చించారు. దీనికి సంబంధించి సర్పంచ్‌కు, పాలకవర్గానికి అధికారాలను కట్టబెట్టినట్టు సమాచారం. అంతేగాక గ్రామ సభ కాలపరిమితిని తగ్గించడం, సభ్యులు మూడు మార్లు సభలకు గైర్హాజరైతే అనర్హత వేటు పడేలా చూడటం తదితర అంశాలను చట్టంలో చేర్చినట్టు సమాచారం.

సర్పంచ్ ఎన్నికలను పరోక్షంగా నిర్వహించాలని ప్రతిపాదించినట్టు తతెలిసింది. వార్డు సభ్యులను నేరుగా ఎన్నుకుని, ఆ తరువాత సర్పంచ్‌లను ఎన్నుకునే పద్ధతికి ప్రవేశపెట్టాలని చట్టం ముసాయిదాలో పేర్కొన్నట్టు సమాచారం. ఈ ముసాయిదాను బడ్జెట్ సమావేశాలకు ముందే ప్రత్యేకంగా అసెంబ్లీని ఏర్పాటు చేసి చట్టం చేయనున్నారు. ఈమేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం గవర్నర్‌కు తెలియజేసిన సంగతి తెలిసిందే.

హైలెస్సో.. హైలెస్సా



దివిసీమ సంప్రదాయ సంబరాల్లో భాగంగా కృష్ణా జిల్లా నాగాయలంకలో శనివారం నిర్వహించిన పడవ పోటీల్లో సెయిలర్ల జోరు ఇది. సందర్శకులను ఈ పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

రాజకీయ దుమారం

- నిట్‌కు స్థల కేటాయింపుపై టీడీపీ × బీజేపీ
- గూడెం మున్సిపల్ చైర్మెన్‌కు సీఎం హెచ్చరిక
- విచారణకు త్రిసభ్య కమిటీ



అమరావతి : రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ నాయకత్వం మధ్య ఇప్పటికీ పొసగడం లేదు. పైకి నవ్వుతూ కనిపించినా లోన మాత్రం ఎవరికి వారు గోతులు తవ్వుకుంటున్నారు. నీ సంగతి చూస్తానంటే నీ సంగతి చూస్తానంటూ హెచ్చరికలు చేసుకుంటున్నారు. తాజాగా పశ్చిమ గోదావరి జిల్లాలో మంత్రి మాణిక్యాలరావు, తాడేపల్లిగూడెం మున్సిపల్ చైర్మెన్ బొలిశెట్టి శ్రీనివాస్ మధ్య రేగిన వివాదం రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపింది. బీజేపీ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిని ఆఫ్ట్రాల్ అనడంపై ఆ పార్టీ తీవ్రస్థాయిలో ఆగ్రహంతో ఉంది. పైకి వ్యక్తిగత దూషణగా కనిపిస్తున్నా లోపల మాత్రం రాజకీయ వ్యవహారం ఉంది. తాడేపల్లిగూడేనికి కేంద్రం నిట్‌ను మంజూరు చేసింది. దీనికి స్థల కేటాయింపు వ్యవహారం సమస్యాత్మకంగా మారింది. అక్కడ నిట్‌ను ఏర్పాటు చేస్తే బీజేపీ మంత్రికి లాభిస్తుందని టీడీపీకి ఉంది. ఈ నేపథ్యంలో స్థల కేటాయింపు వ్యవహారంపై కొద్దికాలంగా చర్చ సాగుతోంది. స్థలం కేటాయించేది తెలుగుదేశం పార్టీ, లబ్ధి పొందేది బీజేపీ అని దీన్ని తాము ఏ మాత్రమూ సహించేది లేదని ఆ నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు పార్టీ జిల్లా శాఖకు సమాచారం ఇచ్చారు. దీనిపై టీడీపీ కూడా చూసీచూడనట్లు వ్యవహరించింది. ఇటీవల ఆ స్థల కేటాయింపుపై తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో చర్చ సాగుతుండగా స్వల్ప వాగ్వివాదం ఏర్పడింది. ఈ క్రమంలో మున్సిపల్ చైర్మెన్ బొలిశెట్టి శ్రీనివాస్ మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మంత్రిననే విషయాన్ని మరచి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని మాణిక్యాలరావు కూడా హెచ్చరించారు. ఆఫ్ట్రాల్ అనడం సరికాదని, వెంటనే క్షమాపణ చెప్పాలని కోరారు. అంతటితో ఆగకుండా తాను తలుచుకుంటే కట్ చేస్తానని హెచ్చరించారు. కట్ చేస్తాననే మాటను టీడీపీ నాయకులు తీవ్రంగా పరిగణించారు. ఏం కట్ చేస్తారో చెప్పాలని నిరసనకు దిగారు. ఈ వ్యవహారం టీడీపీ, బీజేపీ మధ్య వివాదాస్పదమైంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాని మోడీని ఢిల్లీలో కలిసి రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్రానికి నిధులివ్వాలని కేంద్రంలో తమను కోరుతూ ఇక్కడ తిడతారా అంటూ మాణిక్యాలరావు మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వ్యవహారం కావడంతో రాజకీయంగా మరింత వేడెక్కింది. చివరికి శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జోక్యం చేసుకున్నారు. వివాదాన్ని ఆపాలని, అనవసర వ్యాఖ్యలు, టీడీపీ, బీజేపీ మధ్య వివాదం రేపే వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంత్రి మున్సిపల్ ఛైర్మన్ వ్యాఖ్యలపై నిజానిజాలు తేల్చేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, పశ్చిమగోదావరి జడ్పీ చైర్మెన్ బాపిరాజు, ఎమ్మెల్యే వర్మ సభ్యులుగా ఉన్నారు. వెంటనే విచారించి వెంటనే నివేదిక ఇవ్వాలని సీఎం వారిని ఆదేశించారు. అనవసరంగా మాట్లాడితే పార్టీపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని మున్సిపల్ చైర్మెన్ శ్రీనివాస్‌ను హెచ్చరించారు. దీనిపై తాడేపల్లిగూడెం మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాస్ స్పందించారు. తమను ఆఫ్ట్రాల్ కౌన్సిలర్లని మంత్రి వ్యాఖ్యానించినందువల్లే తాను కూడా మాట్లాడాల్సి వచ్చిందని, అయితే ఆఫ్ట్రాల్ ఆనలేదని, ఆఫ్టర్ ఫొటోగ్రాఫర్ అని మాత్రమే అన్నానని.. చెప్పుకొచ్చారు. టీడీపీకి ఎక్కువ మంది ఎమ్మెల్యేలను అందించిన పశ్చిమగోదావరి జిల్లాలో ఈ వ్యవహారం జరగడంతో రాజకీయంగానూ ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ముఖ్యమంత్రి నేరుగా జోక్యం చేసుకున్నారని పరిశీలకులు భావిస్తున్నారు.

న్యాయమూర్తులు విల్లు ఎక్కుపెట్టండి

సీనియర్ నటుడు ప్రకాష్‌రాజ్



చెన్నై : సుప్రీం కోర్టు నిర్వహణ సరిగా లేదని చెప్పిన నలుగురు న్యాయమూర్తులు ఇక ముందు విల్లును ఎక్కువపెట్టాలని ప్రముఖ నటుడు ప్రకాష్‌రాజ్ సూచించారు. న్యాయవస్థ సరిగా నడవటం లేదని నలుగురు న్యాయమూర్తులు వ్యాఖ్యానించిన నేపథ్యంలో ప్రకాష్‌రాజ్ ట్విటర్ ద్వారా స్పందించారు. దేశంలో మనస్సాక్షిని అమ్ముకోలేని వ్యక్తులున్నారని, నలుగురు న్యాయమూర్తులు స్పష్టం చేశారని అన్నారు. జస్టిస్ లోయా, అధార్ కేసుల్లో కేంద్రాన్ని ఎవరూ తప్పించలేరని ఆయన వ్యాఖ్యానించారు.

మా అభిప్రాయాలను గౌరవించే వారితో కలుస్తాం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



తమ పార్టీ సిద్దాంతాలకు, అభిప్రాయాలను గౌరవించే పార్టీతో కలిసి వచ్చే ఎన్నికల్లో వెళ్తామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తెలిపారు. అసెంబ్లీలోని టీడీపీఎల్పీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తుంటుందని ప్రశ్నించగా.. ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. మాకు పదవులు ముఖ్యం కాదని, పార్టీని కాపాడుకోవడమే ముఖ్యమన్నారు. పేదల కోసం ఆలోచిస్తున్న పార్టీ టీడీపీ ఒక్కటే అని తెలిపారు. గతంలో మాదిరిగా వామపక్షాలు కలిసి వస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అధికారం నిలుపుకోవాలని టీఆర్ఎస్, అధికారంలోకి రావాలన్న కాంగ్రెస్ ఆకాంక్ష సంపూర్ణంగా నెరవేరే పరిస్థితి కన్పించడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో తామే కీలక పాత్ర పోషిస్తామన్నారు. నేతల కులాల ఆధారంగా మీడియా ప్రచారం చేస్తున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాల విద్యాశాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా అశోక్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఇంటర్మీడియేట్ కమిషనర్ డాక్టర్ ఎ అశోక్‌కు పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్న జి కిషన్ ఈనెల 13 నుంచి 21 వరకు సెలవులో వెళ్తున్నారు.



సమ్మె హక్కుపై ఆంక్షలు

• గ్రీసులో నిరసించిన కార్మిక లోకం • సంస్కరణల బిల్లుకు వ్యతిరేకత

ఏథెన్స్ : సమ్మె చేసే హక్కుపై ఆంక్షలు విధించడంతో సహా కొత్తగా తీసుకువస్తున్న సంస్కరణలను వ్యతిరేకిస్తూ సెంట్రల్ ఏథెన్స్‌లో శుక్రవారం వేలాదిమంది నిరసనకారులు ప్రదర్శనలు నిర్వహించారు. బెయిలవుట్ నిధులు తీసుకున్నందుకు బదులుగా పార్ల మెంట్ వచ్చే వారం ఈ సంస్కరణల బిల్లును ఆమోదించాల్సి వుంది. కొత్త సంవత్సరంలో తలెత్తిన ఈ మొట్టమొదటి పారిశ్రామిక తిరుగుబాటు సందర్భంగా ఏథెన్స్ మెట్రోను మూసివేశారు. రోజూ దాదాపు పది లక్షలమంది ప్రజలు ఉపయోగించే ఈ మెట్రోను నిలిపివేయడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. దీంతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. నావికులు కూడా సమ్మెలో వుండడంతో సముద్రంలో నౌకలు కూడా తిరగలేదు. డాక్టర్లు సమ్మెకు దిగడంతో రిజర్వ్ సిబ్బందితో ఆస్పత్రులు నడిచాయి. సోమవారం ఈ బిల్లును గ్రీసు పార్లమెంట్ ఆమోదించాల్సి వుంది.

పోర్న్‌స్టార్‌తో ట్రంప్ ఎఫైర్ !

• విషయం దాచిపెట్టినందుకు రూ.82లక్షలు చెల్లింపు : వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం



న్యూయార్క్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు సంబంధించి తాజాగా ఓ రహస్యం వెలుగులోకి వచ్చింది. ఆయనకు ఓ అశ్లీల చిత్రాల నటితోనూ శారీరక సంబంధాలు ఉన్నట్టు తెలిసింది. అయితే, అధ్యక్ష పదవిలోకి రాకముందే ఆ సంబంధం ఉండగా, ఆ విషయం బయటకు తెలియకుండా ఉండేందుకు, దానిని ఎక్కడా మాట్లాడకుండా ఉండేందుకు 1.30 లక్షల డాలర్లు (సుమారుగా రూ.82 లక్షలు) ఆ నటికి ముట్టజెప్పినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది. స్టీఫానీ క్లిఫార్డ్ అనే అమెరికన్ పోర్న్‌స్టార్, 2006లో ట్రంప్‌ను కలుసుకుంది. ఆ సమయంలోనే ట్రంప్ మూడో వివాహం (మెలానియా) చేసుకున్నారు. అయినప్పటికీ తనకు పరిచయం ఉన్న క్లిఫార్డ్‌తో ట్రంప్ శారీరక సంబంధం ఏర్పరుచుకున్నారు. అయితే, ట్రంప్ అమెరికా అధ్యక్ష బరిలో దిగుతుండగా 'గుడ్‌మార్నింగ్' అమెరికా కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ట్రంప్‌తో తనకున్న సంబంధాలు మాట్లాడే ప్రయత్నం చేయగానే ఆ విషయం బయటకు పొక్కనీయకుండా చూసేలా మైఖేల్ కోహెన్ అనే న్యాయవాదికి ట్రంప్ బాధ్యతలు అప్పగించాడు. దాంతో మైఖేల్ మధ్యవర్తిగా ఉండి అధ్యక్ష ఎన్నికలకు కొద్ది వారాల ముందు క్లిఫార్డ్‌కు ఏకంగా లక్షా ముప్పైవేల డాలర్లు చెల్లించారు. ఈ విషయం ఎట్టి పరిస్థితుల్లో బయటకు రానివ్వొద్దని ఆమె దగ్గర హామీ తీసుకున్నారు. ఈ విషయాలన్నింటినీ పూసగుచ్చినట్టుగా వాల్‌స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. అయితే, వీటన్నింటినీ మైఖేల్ కొట్టిపారేయగా క్లిఫార్డ్ మాత్రం స్పందించలేదు. వైట్‌హౌస్ మాత్రం ట్రంప్‌పై చేసిన తాజా ఆరోపణలు అబద్ధాలని, కుట్రలని కొట్టి పారేసింది. గతంలో ట్రంప్‌పై ఇలాంటివి పలు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే.

ట్రంప్‌నకు వైద్య పరీక్షలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యం భేషుగ్గా ఉందని ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ రోనీ జాక్సన్ వైద్య బృందం తెలిపింది. వాషింగ్టన్ డీసీలోని వాల్టర్ రీడ్ నేషనల్ మిలిటరీ మెడికల్ సెంటర్‌లో ట్రంప్‌నకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కొన్ని గంటల పాటు కొనసాగిన ఈ పరీక్షల్లో ఆయన బీపీ, బ్లడ్‌షుగర్, కొలెస్ట్రాల్, గుండె స్పందన, బరువు వంటి పరీక్షలు చేశారు.పరీక్షల అనంతరం డాక్టర్ రోనీ జాక్సన్ మాట్లాడుతూ, ట్రంప్ ఆరోగ్యం చక్కగా ఉందని చెప్పారు. గత మూడు ప్రభుత్వాల నుంచి అధ్యక్షులకు డాక్టర్ రోనీనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ట్రంప్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించిన పూర్తి నివేదికను జనవరి 16న మీడియాకు వెల్లడించనున్నారు.

భారత్‌పై ఆధారపడాల్సిన అవసరం లేదు...

నేపాల్‌కు సైబర్ కనెక్టివిటీ అందించనున్న చైనా

• తరచూ నెట్‌వర్క్ ఫెయిల్యూర్స్ వల్ల చైనా సాయం కోరిన నేపాల్

కాట్మాండు: దేశ పౌరులకు ఇంటర్నెట్ సేవల్ని అందుబాటులోకి తెచ్చేందుకు హిమాలయ దేశం నేపాల్ చైనా సాయాన్ని కోరింది. దీంతో గత దశాబ్దంగా నేపాల్ సైబర్ కనెక్టివిటీపై భారత్ ఏకచత్రాధిపత్యానికి తెర పడింది. ఇప్పటివరకూ భారతీ ఎయిర్‌టెల్, టాటా కమ్యూనికేషన్స్ లిమిటెడ్ ద్వారా నేపాల్ అంతర్జాల సౌకర్యాన్ని పొందుతూ వచ్చింది. అయితే, తరచూ నెట్‌వర్క్ ఫెయిల్యూర్స్ గురవుతుండటం నేపాల్ అధికారులను విసుగొచ్చేలా చేసింది. దీంతో వేరే దేశ ఉత్తమ నెట్‌వర్క్ కల్పన కోసం చైనా సాయం కోరినట్టు నేపాల్ ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. నేపాల్ టెలికాం, చైనా టెలికాం గ్లోబల్‌లు కలిసి చైనాలోని కెరుంగ్ నగరం నుంచి నేపాల్‌లోని రసువగడి వరకూ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపింది.

50 కిలోమీటర్ల మేర నిర్మించిన నెట్‌వర్క్‌ను శనివారం ప్రారంభించినట్టు పేర్కొంది. భారత్ విఫల సర్వీసులకు చైనా నుంచి ప్రత్యామ్నాయం లభించినట్టు నేపాల్ టెలికాం అధికార ప్రతినిధి పేర్కొన్నారని 'రాయిటర్స్' తెలిపింది. రెండు కోట్ల 80లక్షల జనాభా కలిగిన నేపాల్‌లో ప్రస్తుతం 60 శాతం మందికి ఇంటర్నెట్ సర్వీసులు అందుతున్నట్టు పేర్కొంది.

సరిహద్దుల్లో కీలక ప్రాంతంగా ఉన్న నేపాల్‌లో తమ పలుకుబడిని పెంచుకునేందుకు ఏండ్లుగా భారత్, చైనాలు ప్రయత్నిస్తున్నాయి. 2016లో పోర్టులను వర్తకానికి ఉపయోగించుకునేందుకు నేపాల్‌కు చైనా అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. 2017లో నేపాల్ చైనా తలపెట్టిన సిల్క్ రోడ్డులో చేరేందుకు అంగీకారం కూడా తెలిపింది.



(ఫైల్)

మహిళలు ఒంటరిగా సౌదీకి రావొచ్చు...

25 ఏండ్లు దాటినవారు మాత్రమే..



రియాద్: ఇన్నిరోజులు సౌదీ అరేబియాను సందర్శించాలంటే మహిళలకు కచ్చితంగా పక్కన ఓ తోడు ఉండాలి. లేదంటే ఆ దేశం టూరిస్ట్ వీసానే జారీచేయదు. కానీ ప్రస్తుతం 25 సంవత్సరాలు, ఆపైబడిన మహిళలు ఇక ఒంటరిగా టూరిస్ట్ వీసాపై సౌదీ అరేబియాను సందర్శించవచ్చుట. ఈ విషయాన్ని సౌదీ కమిషన్ ఫర్ టూరిజం, నేషనల్ హెరిటేజ్ అధికార ప్రతినిధి చెప్పారు. కుటుంబ సభ్యులు లేదా సహచరులు అవసరం లేకుండానే మహిళలు సౌదీ అరేబియా సందర్శించే స్వేచ్ఛను తాము కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కానీ 25 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న మహిళలు మాత్రం సౌదీ అరేబియాకి ప్రయాణించాలంటే కచ్చితంగా ఎవరో ఒకరు తోడు ఉండాల్సిందేనని తెలిపారు. "టూరిస్ట్ వీసా అనేది సింగిల్-ఎంట్రీ వీసా. గరిష్ఠంగా 30 రోజులు కాలవ్యవధితో ఉంటుంది. ఇది వర్క్, విజిట్, హజ్, ఉమ్రా వీసాలు నుండి స్వతంత్రంగా ఉంటుంది" అని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ది కమిషన్స్ లైసెన్సింగ్ డిపార్ట్‌మెంట్ ఉమర్ అల్-ముబారక్ తెలిపారు. టూరిస్ట్ వీసాలకు సంబంధించిన నిబంధనలు తుది రూపకల్పన జరిగాయని, ఈ నిబంధనలను 2018 తొలి క్వార్టర్‌లో ప్రకటించనున్నామని పేర్కొన్నారు. కేంద్ర సమాచార సెంటర్, విదేశీ మంత్రిత్వశాఖ ప్రతినిధులతో కలిసి టూరిస్ట్ వీసాల జారీ కోసం ఎలక్ట్రానిక్ సిస్టమ్‌ను కమిషన్ ఐటీ డిపార్ట్‌మెంట్ అభివద్ధి చేస్తుందని అల్-ముబాకర్ తెలిపారు.

భద్రతామండలిలో సంస్కరణలు చేపట్టాలి

• ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రెస్



న్యూయార్క్ : భద్రతామండలిని మరింత ప్రజాస్వామ్యయుతం మార్చాల్సిన అవసరం ముందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటో నియో గుటెర్రెస్ అన్నారు. సంస్కరణలు ప్రవేశపెట్టి, భద్రతా మండలిలో అధికార సమతుల్యత సాధించాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. శుక్రవారం ఇక్కడ జరిగిన 'జీ-77' దేశాల కూటమి సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... "ఐక్యరాజ్యసమితి కార్యకలాపాల్ని మరింత ప్రజాస్వామ్యబద్ధంగా నడిపించాలి. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల నుంచి సమితి వివిధ విభాగాలకు ప్రాతినిధ్యం దక్కాలి. ఐరాస అధికారం భిన్న త్వంతో, సమతుల్యంతో కూడినదిగా ఉండాలి. భద్రతామండలిలో సంస్క రణలు చేపట్టి, సర్వప్రతినిధి సభను మళ్లీ పున:ప్రారంభించాలి. దీనిని నేను బలంగా కోరుకుంటున్నాను" అని చెప్పారు. తాము తెరమీదకు తెస్తున్న ఈ ప్రతిపాదనను జీ-77 కూటమి బలపరుస్తుందన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. తద్వారా న్యాయాన్ని సులభంగా పునరుద్ధరించ వచ్చునని చెప్పారు. ఇందుకుగాను జీ-77 కూటమి పోషించే పాత్రచాలా ముఖ్యమైనదని అన్నారు. భిన్నదేశాలతో ఏర్పాటైన ఈ కూటమిద్వారా ప్రపంచ సంబంధాలు మరింత న్యాయాన్ని అందించే విధంగా చెప్పారు.

షెరీన్ హత్య కేసు
దత్తత తండ్రిపై హత్యారోపణలు



హూస్టన్ : షెరీన్ మాథ్యూస్ హత్య కేసులో దత్తత తండ్రి వెస్లే(37)పై కోర్టు హత్యారోపణలు నమోదుచేసింది. భారత్‌కు చెందిన 3 ఏండ్ల షెరీన్ మాథ్యూస్ చిన్నారిని ఏడాదిన్నర క్రితం వెస్లే దంపతులు దత్తత తీసుకున్నారు. అక్టోబర్ 6న వీరిద్దరూ డల్లాస్‌లోని తమ స్వగృహంలో చిన్నారి షెరీన్‌ను ఒంటరిగా వదిలి వెస్లే దంపతులు ఫంక్షన్‌కు వెళ్లినట్టు తెలిసింది. తిరిగొచ్చాక తెల్లవారుజామున 3 గంటలకు పాలు తాగమని చెప్పగా, చిన్నారి కనిపించకుండా పోయిందని వెస్లే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్టోబరు 7న ఇంటికి కొంతదూరంలో షెరీన్ మృతదేహం పోలీసులకు లభ్యమైంది. ఈ నేపథ్యంలో ఘటనపై దత్తత తీసుకున్న వెస్లే దంపతులపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. శవపరీక్ష నివేదిక కూడా ఆ అనుమానాల్ని బలపర్చిందని, ఇది నరహత్య అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయని డల్లాస్ కౌంటీ జిల్లా అటార్నీ ఫెయిత్ జాన్సన్ విలేకర్ల సమావేశంలో చెప్పారు. చిన్నారిని ఒంటరిగా వదిలేయటం, సాక్ష్యాల్ని తారుమారు చేయటం, హత్య...తదతర ఆరోపణలు దత్తత తండ్రి వెస్లేపై నమోదుచేశామని ఆయన తెలియజేశారు. వెస్లే దంపతులు ఇద్దరూ ప్రస్తుతం జైల్లో ఉన్నారు. ఒకవేళ హత్యారోపణ రుజువైతే మరణశిక్ష లేదా జీవిత ఖైదు పడే అవకాశముంది.

పనామా దౌత్యవేత్త రాజీనామా



జాన్ ఫీలే

వాషింగ్టన్ : పనామా దౌత్య రాయబారి జాన్‌ఫీలే(56) వ్యక్తిగత కారణాలతో రాజీ నామా చేస్తున్నట్టు ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేతృత్వంలో తాను పని చేయలేనని పేర్కొన్నారు. ఆయన గతంలో మెరైన్ హెలికాప్టర్ పైలెట్‌గా పనిచేశారు. మొదటిసారిగా విదేశీ రాయబారిగా ఎన్నికైన ఆయన రాజీనామాను ప్రకటించారు. మార్చి 9 నుండి ఆయన తన పదవికి రాజీనామా చేస్తున్నారని అమెరికా వైట్‌హౌస్ కార్యవర్గం పేర్కొంది. కొత్తరాయబారి వచ్చేంత వరకు మిషన్ డిప్యూటీ చీఫ్ రోక్షాన్ కాబ్రాల్ పనామాలో దౌత్య కార్యనిర్వాహకుడిగా పనిచేస్తారని పేర్కొన్నారు. కాగా, ఈ వార్త స్థానిక వార్తా పత్రికలో ప్రచురితమవడం విశేషం.

మంద కృష్ణను బేషరతుగా
విడుదల చేయాలి : కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను బేషరతుగా విడుదల చేయాలని కుల వివక్ష పోరాట సంఘం డిమాండ్ చేసింది. కేసీఆర్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటమే కాకుండా ప్రశ్నించే గొంతులను నులిమివేస్తున్నదని విమర్శించింది. ఈ మేరకు శనివారం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిగల్ల భాస్కర్, టి స్కైలాబ్ బాబు ఒక ప్రకటన విడుదల చేశారు. హక్కుల కోసం ఉద్యమించే శక్తులను అణచివేయడంతో పాటు వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ తీవ్ర నిర్భంధాన్ని ప్రయోగిస్తున్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో కోందడరామ్, మందకృష్ణ, అద్దెంకిదయాకర్, ప్రొఫెసర్ కంచ ఐలయ్య లాంటి ప్రముఖులపై అక్రమంగా కేసులు బనాయించి జైల్లోపెట్టారని పేర్కొన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దళితులపై దాడులుదౌర్జన్యాలు పెరుగుతున్నాయని ఆవేదనవ్యక్తం చేశారు. 2014లో 1104 సంఘటనలు జరిగితే 2017లో ఆసంఖ్య 1904కు పెరిగింద న్నారు. దళితుల పట్ల ప్రభుత్వానికి ఎంతచిత్తశుద్ధి ఉందో ఈఘటనలే నిదర్శనమని తెలిపారు.

వీసా మోసాలకు పాల్పడితే పీడీ యాక్ట్



మంత్రి కేటీఆర్
• నకిలీ ఏజెంట్లపై కొరడా
• మహిళల అక్రమ రవాణ నిరోధానికి సమన్వయ బృందాలు
• విదేశీ భవనానికి వచ్చే నెలల్లో శంకుస్థాపన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వీసా మోసాలకు పాల్పడే నకిలీ ఏజెంట్లపై ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం (పీడీ యాక్ట్) కింద కేసులు నమోదు చేయాలని పరిశ్రమల శాఖ మంత్రి కె తారకరామారావు పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. అదేవిధంగా మహిళల అక్రమ రవాణ నిరోధానికి సంయుక్త బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. శనివారం సచివాలయంలో "నాన్ రెసిడెంట్ ఇండియన్" (ఎన్నారై) శాఖపైన హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పోలీస్, ఎన్నారై శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఉపాధి కోసం విదేశాలకు వెళ్లేవారిని మోసం చేస్తున్న నకిలీ గల్ఫ్ ఏజెంట్లపైన కఠిన చర్యలు తీసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఇమిగ్రేట్‌లో రిజి స్టర్ చేసుకునేందుకు ఏజెంట్లకు నెల రోజులు గడువు ఇవ్వాలని చెప్పారు. నెల రోజుల్లో ఇమిగ్రేట్‌లో రిజిస్టర్ చేసుకోని ఏజెంట్లను నకిలీ ఏజెంట్లుగా గుర్తించి చర్య లు తీసుకోవాలన్నారు. నకిలీ ఏజెంట్ల ఆట కట్టించేం దుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. "సుర క్షితంగా వెళ్లండి.. సుశిక్షితులై వెళ్లండి" అనే కేంద్ర ప్రభుత్వ విదేశాంగ శాఖ నినాదానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టామ్‌కామ్ ద్వారా చట్ట పరంగా విదేశాలకు వెళ్లాలని సూచించారు.

వచ్చే నెలల్లో విదేశీ భవన్‌కు శంకుస్థాపన

ఫిబ్రవరి రెండోవారంలో హైదరాబాద్‌లో విదేశీ భవన్‌కు శంకుస్థాపన చేస్తామని మంత్రి వెల్లడిం చారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. గల్ఫ్ దేశాలకు మహిళా అక్రమ రవాణా, మోసపూరితమైన వివాహాలపైన మరింత కఠినంగా వ్యవహరించాలని హోంమంత్రి పోలీస్ శాఖను ఆదేశించారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి కార్మిక, ఎన్నారై, పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మహిళల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఏజెంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకుగాను పాస్‌పోర్ట్ కార్యాలయ అధికారుల సహకారం తీసుకోవాలన్నారు.

త్వరలోనే మార్గదర్శకాలు - డీజీపీ

నకిలీ పాస్‌పోర్ట్ ఏజెంట్లు, మహిళల అక్రమ రవాణా నిరోదానికి త్వరలోనే మార్గదర్శకాలను రూపొందిస్తామని డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు.



మార్చ్ 4న హైదరాబాద్‌లో జనజాతర

• టీఎస్‌సీపీఎస్ఈయూ అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) ఆధ్వర్యంలో పాతపింఛన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 4న హైదరాబాద్ జనజాతర జరగనుంది. శనివారం హైదరాబాద్ కాచిగూడలోని నపతుంగ కాలేజ్‌లో టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎస్‌సీపీఎస్ఈయూ అధ్యక్షులు గంగాపురం స్థితప్రజ్ఞ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానంపై స్పందించాలని కోరారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లోపు సీపీఎస్‌పై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సామాజిక భద్రత కొరకు, పాత పింఛన్ సాధన కొరకు తమ కుటుంబాలతో మార్చి 4న హైదరాబాద్‌లో సీపీఎస్ జనజాతరను నిర్వహిస్తామని అన్నారు.

ప్రభుత్వ సొమ్ము, ఉద్యోగి కష్టార్జితమని, దీనిపై షేర్ మార్కెట్ పెత్తనం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. పాత పింఛన్ సాధించే దాకా విశ్రమించబోమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సీపీఎస్ విధానంపై అత్యవసర సమీక్ష జరపాలని టీఎస్‌సీపీఎస్ఈయూ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ చెప్పారు. సభ్యత్వం చేసుకున్న ప్రతి సభ్యుడికీ లక్ష రూపాయల ప్రమాద బీమా కల్పించాలని, నేషనల్ ఇన్సూ రెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు.

ఈ కార్యక్రమంలో కోశాధికారి నరేష్ గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమూర్తి, కో ఆర్డినేటర్ లెక్కల వీరేశం, మహిళ ఆర్గనైసింగ్ సెక్రెటరీ సమినా ఖతున్, ఉపాధ్యక్షులు మ్యాన పవన్, పోల శ్రీనివాస్, బుచ్చన్న, సాహిత్య కార్యదర్శి రోషన్, సంయుక్త కార్యదర్శులు ఉపేందర్, విక్రమ్ సింగ్, కురాకుల శ్రీనివాస్, లింగారెడ్డి, మల్లికార్జున్, విజయ్ శ్రావణ్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ సరఫరాపై గుడ్డి విమర్శలు

• బీహెచ్ఈఎల్‌ను బద్‌నాం చేయొద్దు : ఎంపీ గుత్తాసుఖేందర్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ ప్రతినిధి

24గంటల కరెంట్ సరఫరాపై కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గుడ్డి విమర్శలు చేస్తున్నారని ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎబీసీడీలు కూడా తెల్వనోళ్లు కరెంట్ విషయమై సీఎంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ద్వారా 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు పనులు చేపట్టామన్నారు. అందుకు అవసరమైన భూసేకరణ చేసి రైతులకు పరిహారం కూడా అందజేశామని చెప్పారు. దేశంలో నవరత్నాల్లో ఒకటిగా ఉన్న బీహెచ్ఈఎల్ సంస్థను బద్‌నామ్ చేసే విధంగా కాంగ్రెస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఛత్తీస్‌గఢ్‌తో వెయ్యి మెగావాట్ల విద్యుత్ కొనుగోలుపై ఒప్పందం చేసుకున్న సమయంలో దేశంలో సర్‌ప్లస్ కరెంట్ లేదన్నారు. ప్రస్తుతం దేశంలో సర్‌ప్లస్ విద్యుత్ లభిస్తుందన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలో ఒకటైన ఎనర్జీ కమిటీలో ఎనిదేండ్లుగా సభ్యులుగా ఉన్న తనకు కరెంట్ ఉత్పత్తి సాంకేతిక సమస్యలేంటో బాగా తెలుసన్నారు. 3150 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. నల్లగొండ జిల్లాలో థర్మల్ పవర్ ప్లాంట్‌తో పాటు 500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమలు వచ్చాయని చెప్పారు.

కౌలురైతు ఆత్మహత్య

నవతెలంగాణ-మర్పల్లి

అప్పుల బాధతో తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో శనివారం జరిగింది. మృతుని భార్య సత్యమ్మ, ఎస్ఐ విఠల్‌రెడ్డి వివరాల ప్రకారం.. మర్పల్లికి చెందిన ఈడిగి నాగయ్యగౌడ్(నగేష్)(45), సత్యమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. బతుకుదెరువు కోసం కల్లుదుకాణం, కిరాణాషాపు నిర్వహించేవాడు. రెండేండ్లుగా అవి నడవట్లేదు. దీంతో తన అరెకరంతోపాటు ముగ్గురు అన్నదమ్ములకు చెందిన ఎకరంన్నర, శేఖర్‌యాదవ్‌కు చెందిన మరో ఎకరంన్నర కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాడు. గతేడాది లాగే ఈ సారీ పొలంలో పత్తి, మొక్క, కంది పంటలను సాగు చేశాడు. సక్రమంగా వర్షాలు కురవక పంటలు పండలేదు. దీంతో పంట పెట్టుబడుల కోసం, కుటుంబ పోషణకు రూ.4 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలీక తీవ్ర మస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో భార్య ఆందోళనకు గురై నగేష్ అన్నదమ్ముళ్లకు, ఇరుగుపొరుగువారికి చెప్పింది. వారంతా కలిసి ఊర్లో వెతికారు. ఎక్కడా కనిపించలేదు. బావుల వద్ద వెతుకుతుండగా శనివారం తెల్లవారుజామున నగేష్ మృతదేహం కనిపించింది. పక్కనే పురుగుల మందు డబ్బా ఉంది. భార్య సత్యమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలి

• పీఎఫ్ఆర్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారథి




నవతెలంగాణ - సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా సికింద్రాబాద్ మండలంలోని రసూల్‌పురాలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న కబ్జా దారుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పీపుల్స్ ఫోరం ఫర్ రైట్ టు ఇన్ఫర్మేషన్ (పీఎఫ్ఆర్ఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి డిమాండ్ చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రసూల్‌పురాలో సర్వేనంబర్ 74/1లో భూరికార్డుల ప్రకారం 5.21 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంద న్నారు. అందులో సుమారు 3వేల చదరపు గజాల స్థలాన్ని ఆక్రమించుకున్న మహ్మద్ ఉస్మాన్ క్రమేణా రెండువేలకు పైగా చదరపు గజాల స్థలాన్ని విక్రయించినట్టు విమర్శించారు. అంతేకాకుండా, వీటికి సంబంధించిన సేల్ డీడ్ డాక్యుమెంట్లు సొంతదారులుగా చెప్పుకుంటున్న వారు సంతకాలు లేకుండానే, ఇతరుల సంతకాలను ఫోర్జరీతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించా రన్నారు. 2001లో తహసీల్దార్‌గా ఉన్న జలాలుద్దీన్ ఈ భూమి ప్రభుత్వానిది కాదంటూ తప్పుడు నివేదికలిచ్చి ఉస్మాన్‌కు సహకరించారన్నారు. దీంతో అక్రమంగా విక్రయించిన స్థలానికి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నట్టు తెలిపారు. ఆతర్వాత వచ్చిన తహసీల్దార్లు, ఆర్డీవోలు సర్వేనంబర్ 74/1లో స్థలం ప్రభుత్వానికే చెందుతుందనే వాస్తవాలను చెబుతున్నారని వివరించారు. అంతేకాకుండా ఇదే ప్రాంతంలో నివసించే మహ్మద్ అహ్మద్‌ను 50గజాల స్థలం నుంచి వెళ్లగొట్టేందుకు ఉస్మాన్ యత్నిస్తున్నారన్నారు. ఈవిషయాలపై జిల్లా రెవెన్యూ యంత్రాంగం పూర్తివిచారణ జరిపి, ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి, విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీపుల్స్ ఫోరం ఫర్ రైట్ టూ ఇన్ఫర్మేషన్ రాష్ట్ర కార్యదర్శులు మహమ్మద్ సిరాజుద్దీన్, కేఎస్ఎన్ మూర్తి, కోశాధికారి బీజేఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు

• భారజల కర్మాగారంలోని హెచ్‌టూఎస్ ప్లాంట్‌లో ప్రమాదం
• ప్లాంట్ ఉద్యోగి మృతి



నవతెలంగాణ-అశ్వాపురం

భారజలం కర్మాగారంలో హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు గాఢతను తట్టుకోలేక ఓ కార్మికుడు చనిపోయాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరు భారజల కర్మాగారంలో శనివారం జరిగింది. స్థానిక ఉద్యోగుల వివరాలు ప్రకారం...భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన వేల్పుల వెంకట రమణ (37) మణుగూరు భారజల కర్మాగారంలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం మొదటి షిఫ్ట్‌కు కర్మాగారంలోని ఎచ్‌టూఎస్ ప్లాంట్‌కు వెళ్లాడు. ఒంటిగంట సమయంలో హెచ్‌టూఎస్ ప్లాంట్‌లో హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు విడుదలయ్యే సంకేతాలకు సంబంధించిన సైరన్ వచ్చింది. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న అతను వెంటనే హైడ్రోజన్ వాయువు విడుదలవుతున్న ప్రాంతానికి వెళ్లాడు. గ్యాస్ తీవ్రత అధికంగా ఉండటంతో వెంకట రమణ సొమ్మసిల్లి పడిపోయాడు. దీన్ని గమనించిన తోటి కార్మికులు వెంటనే అతన్ని అంబులెన్సులో మండల కేంద్రంలోని గౌతమినగర్ కాలనీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వెంకట రమణను గౌతమినగర్ కాలనీలోని ఆస్పత్రికి తీసుకెళ్లిన అధికారులు రెండు గంటల పాటు హైడ్రామా నడిపించారు. అతను చనిపోయిన విషయాన్ని చెప్పకుండా అపస్మారక స్థితిలో ఉన్నట్టు తోటి ఉద్యోగులను నమ్మించారు. ఆస్పత్రిలోకి ఎవ్వరినీ వెళ్లకుండా చూశారు. చివరకు వెంకట రమణ మృతి చెందినట్టు ప్రకటించారు. ఆస్పత్రి వద్దకు కర్మాగార జీఎం జితేంద్ర శ్రీవాస్తవ, ఇతర సిబ్బందితో కలసి వచ్చారు. ఆస్పత్రి వద్దకు ఉద్యోగులు భారీగా చేరుకోవడంతో కర్మాగార యాజమన్యం సీఐఎస్ఎఫ్ సిబ్బందిని మోహరించింది. అలాగే స్థానిక సీఐ అల్లం నరేందర్ పరిస్థితిని సమీక్షించారు. మృతునికి భార్య లావణ్య, ఇద్దరు ఆడపిల్లలున్నారు.

విద్యుద్ఘాతంతో కార్మికుడు మృతి

• మిషన్ భగీరథ పనుల్లో ప్రమాదం

నవతెలంగాణ-పాల్వంచ

పొట్టకూటి కోసం రాష్ట్రం దాటి వచ్చిన ఓ కాంట్రాక్టు కార్మికుడు మిషన్ భగీరథ పనుల్లో విద్యుద్ఘాతానికి గురై చనిపోయాడు. ఈ ఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాల్వంచలో శనివారం జరిగింది. తోటి కూలీల వివరాల ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం కుషినగర్ జిల్లా పాథ్‌ద్రోణ గ్రామానికి చెందిన చట్టు సౌరస్య(21) ఆరు నెలల కింద పాల్వంచలో మిషన్‌భగీరథ పనులు నిర్వహిస్తున్న కోయ కంపెనీలో చేరాడు. రోజు మాదిరిగానే శనివారం ఉదయం అతను పనుకెళ్లాడు. పాల్వంచలోని ములకలపల్లిదారిలో పైపలైన్ నిర్మాణ పనుల్లో హైడ్రాలిక్ ట్రెయిన్ పైప్ లైన్‌ను అమరుస్తున్నాడు. ఈ క్రమంలోనే పైన ఉన్న 33 కేవీలైన్ పైపుకు తగలడంతో సౌరస్య విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే చనిపోయాడు.



శ్రీచరణ్, శ్రీరంజని, నాగార్జున, సితార, రాజ్‌తరుణ్, చిత్రాశుక్లా, ప్రియదర్శి

ప్రేక్షకుల్ని మెప్పించే రంగులరాట్నం

'రియలిస్టిక్‌గా ఉండే చిత్రం 'రంగులరాట్నం'. తల్లీకొడుకుల మధ్య ఎమోషన్స్, ఓ కుర్రాడికి, అతనికి కాబోయే భార్యకు మధ్య వచ్చే సన్నివేశాలు కంట తడిపెట్టిస్తాయి' అని అంటున్నారు నాగార్జున. రాజ్‌తరుణ్, చిత్రా శుక్లా జంటగా శ్రీరంజని దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నిర్మించిన సినిమా 'రంగులరాట్నం'. నేడు (ఆదివారం) ఈ సినిమా విడుదల కానుంది.

ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ వేడుకలో నాగార్జున మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని సంక్రాంతికి అన్నపూర్ణ స్టూడియో వడ్డించే పొంగలి అని భావిస్తున్నాం. సినిమా చాలా బాగా వచ్చింది. బొబ్బట్టులాగా చాలా తీపిగా ఉంటుంది. సినిమాను నెల రోజుల క్రితమే రెడీ చేసి పెట్టాం. లక్కీగా నాకు సంక్రాంతికి డేట్ దొరికింది. కుటుంబమంతా కలిసి చూడదగ్గ చిత్రమిది. నవ్వుకుంటూ, అప్పుడప్పుడు కొంచెం కంటతడి పెడుతూ ప్రేక్షకులు చూస్తారు. ఏడాది క్రితం ఈ కథకు నేను ఓకే చెప్పా. ఇటీవల సినిమా చూశా. ప్లజెంట్ సర్‌ప్రైజ్‌లాగా అనిపించింది. ఈ సినిమా మా సంస్థకు మంచి పేరు తెస్తుంది. మా బ్యానర్‌లో ఎవరు ఏం చేసినా క్రెడిట్ నాకే దక్కుతుంది. అందుకే చాలా హ్యాపీ. శ్రీరంజని ఎలా నెరేట్ చేసిందో నాకు గుర్తులేదు. కానీ సినిమాను అనుభవం ఉన్న దర్శకురాలిగా తెరకెక్కించింది. ఎమోషన్స్, మదర్ సెంటిమెంట్, అమ్మాయి భావోద్వేగాలను ఓ అమ్మాయి పాయింట్ ఆఫ్ వ్యూ నుంచి చూపించింది. రాజ్‌తరుణ్ 'ఉయ్యాల జంపాల'లో నేచురల్‌గా నటించాడు. ఒక సీన్‌లో తల్లిని ప్రేమించే అబ్బాయిలాగా బిత్తరచూపులతో చేశాడు. అది చూసి నాకు రకరకాల విషయాలు గుర్తొచ్చాయి. అతని యాస ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. హీరోయిన్ చిత్ర సినిమాలో చాలా అందంగా కనిపిస్తుంది. ప్రియదర్శి సినిమాకు పెద్ద అసెట్ అవుతాడు. సహజమైన కామెడీ టైమింగ్ ఉన్న చిత్రమిది. సితారకు, రాజ్‌తరుణ్‌కి మధ్య తల్లీకొడుకుల అనుబంధం బాగా పండింది. ఈ సంక్రాంతికిది స్వీట్ లవ్లీ ఫిల్మ్ అవుతుంది' అని అన్నారు. "ఉయ్యాల జంపాలా' తర్వాత అన్నపూర్ణ స్టూడియోలో ఈ సినిమా చేయడం ఆనందంగా ఉంది. దర్శకురాలు శ్రీరంజనికి తనకేం కావాలో స్పష్టంగా తెలుసు. ఆర్టిస్టుల నుంచి ఉత్తమ నటన రాబట్టుకుంటారు. ప్రియదర్శి, నా మధ్య వచ్చే సన్నివేశాలు ఫన్నీగా ఉంటాయి. శ్రీచరణ్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు. రీరికార్డింగ్‌తో సినిమాను మరో లెవల్‌కి తీసుకెళ్ళాడు' అని రాజ్ తరుణ్ చెప్పారు.

దర్శకురాలు శ్రీరంజని చెబుతూ, 'నన్ను, నా కథను నమ్మి ఛాన్స్ ఇచ్చిన నాగార్జునకు థ్యాంక్స్. రెండు సంవత్సరాలు కష్టపడి ఈ సినిమా చేశాం. మేకింగ్ విషయంలో సుప్రియ, ప్రసాద్ ఎంతో సపోర్ట్ చేశారు. అన్నపూర్ణ స్టూడియో ద్వారా దర్శకురాలిగా లాంచ్ అవ్వడం అదృష్టంగా భావిస్తున్నా. నాగార్జునకు నేను పెద్ద అభిమానిని. ఈ కథ విన్నప్పుడు ఆయన ఫేస్ ఎక్స్‌ప్రెషన్స్ చూసి భయపడ్డాను. ఇటీవల సినిమా చూసి 'వెరీ స్వీట్ అండ్ నైస్' అని చెప్పగానే నాకు ధైర్యం వచ్చింది. సినిమా అంతా కలర్‌ఫుల్‌గా ఉంటుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సితార, చిత్రా శుక్లా, శ్రీచరణ్, ప్రియదర్శి పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

నవచిత్రం

నేనూ దేవుడినే..



'గాయత్రి' చిత్రంలో మోహన్‌బాబు

'పురాణాల్లో చేసింది తప్పయితే అయితే ఇప్పుడు నేను చేసిందీ తప్పే' అని అంటున్నారు మోహన్‌బాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. మదన్ రామిగాని దర్శకుడు. మంచు విష్ణు, శ్రియా, నిఖిలా విమల్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా లక్ష్మి ప్రసన్న పిక్చర్స్ పతాకంపై మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. శనివారం ఈ చిత్ర టీజర్ విడుదలైంది. ఈ చిత్రం గురించి యూనిట్ చెబుతూ, "రామాయణంలో రాముడికి, రావణాసురుడికి గొడవ, మహాభారతంలో పాండవులకు, కౌరవులకు మాత్రమే గొడవ. వాళ్ళూ వాళ్ళూ కొట్టుకుని ఎవరో ఒకరు చనిపోయుంటే బాగుండేది, కానీ వాళ్ళ మూలంగా జరిగిన యుద్ధంలో అటు, ఇటు కొన్ని లక్షల మంది సైనికులు చనిపోయారు. పురాణాల్లో వాళ్ళు చేసింది తప్పయితే, ఇక్కడ నేను చేసింది కూడా తప్పే. అక్కడ వాళ్ళు దేవుళ్ళయితే, ఇక్కడ నేనూ దేవుడినే. అర్థం చేసుకుంటారో అపార్థం చేసుకుంటారో ఛాయిస్ ఈజ్ యువర్స్' అని టీజర్‌లో మోహన్‌బాబు చెప్పే డైలాగులు ఆకట్టుకుంటున్నాయి. ఇందులో మంచు విష్ణు ఓ శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా శ్రియా నటించారు. వీరు ఆదర్శదంపతులుగా కనువిందు చేస్తారు. సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసిన ఫిబ్రవరి 9న సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపింది. బ్రహ్మానందం, అనసూయ, తనికెళ్ళభరణి ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్.థమన్, కెమెరా: సర్వేష్ మురారి, ఆర్ట్: చిన్న, ఎడిటర్: ఎం.ఆర్.వర్మ.

థ్రిల్ చేసే కమర్షియల్ ఎంటర్‌టైనర్



చిరంజీవితో 'జువ్వ' చిత్రయూనిట్ సభ్యులు

"జువ్వ' నిర్మాత భరత్ సొమ్మి వృత్తి రీత్యా డాక్టర్. తన సోదరుడు రంజిత్‌ను యాక్టర్‌గా నిలబెట్టాలని డాక్టర్ కాస్త నిర్మాతగా మారి ఈ చిత్రాన్ని నిర్మించడం అభినందనీయం' అని చిరంజీవి అన్నారు. రంజిత్, పాలక్ లల్వానీ జంటగా త్రికోటి పేట దర్శకత్వంలో ఎస్.వి.రమణ సమర్పణలో సొమ్మి ఫిల్మ్ పతాకంపై భరత్ సొమ్మి నిర్మిస్తున్న చిత్రం 'జువ్వ'. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను, టీజర్‌ను శనివారం తన నివాసంలో చిరంజీవి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, 'సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉంది. హీరో రంజిత్, నిర్మాత భరత్ అన్నదమ్ములు. వీరి నాన్నగారితో నాకు మంచి పరిచయం ఉంది. సాధారణంగా డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యారని వింటుంటాం. తన తమ్ముడి కోసం డాక్టర్ భరత్ నిర్మాతగా మారాడు. అలా అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీకగా ఈ సినిమా నిలిచింది. టీజర్‌లో రంజిత్ డైనమిక్‌గా, హుషారుగా కనిపిస్తున్నాడు. పాత్ర మాస్‌గా ఉంటుందని అర్థమవుతుంది. హీరోయిన్ పాలక్ లల్వానీ రొమాంటిక్‌గా, అందంగా కనిపిస్తుంది. రంజిత్, పాలక్ కోసం సినిమా చూస్తాను. రాజమౌళి వద్ద పనిచేసిన త్రికోటి దర్శకుడిగా ఈ సినిమాలో తన ప్రతిభను చాటారని అనుకుంటున్నా. ఇది పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు. 'చిరంజీవి చేతుల మీదుగా ఈ టీజర్ విడుదల కావడం చాలా ఆనందంగా ఉంది. ఇది నాకు రెండవ సినిమా. లవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందించిన చిత్రమిది. చిన్న చిన్న థ్రిల్లింగ్ పాయింట్స్ ఉంటాయి. సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నా' అని దర్శకుడు తెలిపారు. హీరో రంజిత్ చెబుతూ, 'చిన్నప్పట్నుంచి చిరంజీవికి పెద్ద అభిమానిని. ఆయనతో ఓ ఫొటో దిగితే చాలనుకున్నాను. కానీ ఇప్పుడు ఏకంగా ఆయన పక్కనే కూర్చుని ఛాన్స్ వచ్చింది. ఆయన్ని కలవడం ఒక భావోద్వేగపూరితమైనది. నటుడిగా ఆయనే నాకు స్ఫూర్తి. ఒంటరిగా ఫీలయినప్పుడు చిరంజీవి పాటలు వింటుంటాను' అని అన్నారు. 'షూటింగ్ పూర్తయ్యింది. ఈ నెలాఖరులో ఆడియోను, ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తాం' అని నిర్మాత తెలిపారు. ఈ సినిమా చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంద'ని హీరోయిన్ పాలక్ చెప్పారు.

గ్రాఫిక్స్ కోసం...



మీసాలు తీసేసి చిరంజీవి క్లీన్ షేవ్‌తో కనిపించడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఆయన 'సైరా నరసింహారెడ్డి' చిత్రంలో నటిస్తున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకుడు. ఫస్ట్ షెడ్యూల్ ఇటీవల పూర్తి చేసుకుంది. గతంలో చిరంజీవి పూర్తి గడ్డం, మీసాలతో కనిపించారు. ఇప్పుడు అవి తీసేయడంతో ఆయన సరికొత్తగా కనిపిస్తున్నారు. ఈ చిత్రంలో చిరంజీవి ఫేస్‌ను గ్రాఫిక్స్ ద్వారా కొత్తగా గెటప్ క్రియేట్ చేయబోతున్నారట. అందుకోసం క్లీన్ షేవ్ చేసుకోవాల్సి వచ్చిందని తెలుస్తుంది. కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై రామ్‌చరణ్ నిర్మిస్తున్న ఈచిత్రంలో చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటిస్తుండగా, అమితాబ్ బచ్చన్, సుదీప్, విజయ్ సేతుపతి, జగపతిబాబు ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

కాకతీయ కళా వైభవాన్ని చాటే మహోత్సవం

మోహన్‌బాబుకు విశ్వ నట సార్వభౌమ బిరుదు



వింజమూరి సుజాత, పద్మజారెడ్డి, టి.సుబ్బరామిరెడ్డి, మోహన్‌బాబు, పరుచూరి గోపాలకృష్ణ, విజయ్‌కుమార్

'కళలను, కళాకారులను గౌరవించే వ్యక్తుల్లో టి.సుబ్బరామిరెడ్డి ముందుంటారు. కాకతీయుల కళా వైభవాన్ని ప్రజలకు చాటి చెప్పాలనుకోవడం అభినందనీయం' అని మోహన్‌బాబు అన్నారు. కాకతీయ లలితా కళా పరిషత్ ఆధ్వర్యంలో 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' పేరుతో టి. సుబ్బరామిరెడ్డి తెలంగాణ రాష్ట్రంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించబోతున్నారు. ఇందులో భాగంగా నటుడిగా 42 ఏండ్ల సినీ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోహన్‌బాబును 'విశ్వ నట సార్వ భౌమ' బిరుదుతో సత్కరించబోతున్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ, 'కాకతీయుల పరిపాలన స్వర్ణయుగం. 600 ఏండ్ల క్రితమే తెలుగు సంస్కృతి, నాగరికతలు ఘనంగా చాటడంతోపాటు విభిన్న కళలను పోషించారు. ఎన్నో గొప్ప దేవాలయాలను, శిల్ప కళా నైపుణ్యాన్ని ఎంతో చాతుర్యంతో నిర్మించారు. శ్రీకృష్ణదేవరాయల కంటే ముందు నుంచి తెలుగు జాతికి వారసత్వాన్ని అందించారు. వరంగల్ రాజధానిగా 300 ఏండ్లు తెలుగు వారిని పరిపాలించారు. వాళ్ళ పేరు మీద 'కాకతీయ కళా వైభవ మహోత్సవం' చేయడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఈ నెల 17న హైదరాబాద్‌లోని శిల్ప కళా వేదికలో ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించబోతున్నాం. మహారాష్ట్ర గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు చేతుల మీదుగా వేడుక ప్రారంభమవుతుంది. సుమారు 560 చిత్రాల్లో నటించి, చిత్ర పరిశ్రమలో 42 ఏండ్లు పూర్తి చేసుకున్న మోహన్‌బాబును 'విశ్వ నట సార్వభౌమ' బిరుదుతో ఈ వేడుకలో సత్కరించుకోవడం ఆనందంగా ఉంది. ఆధ్యాత్మిక, రాజకీయ, సినీ, సాంస్కృతిక ప్రముఖులు ఈ మహోత్సవానికి హాజరు కానున్నారు. తర్వాత కూడా తెలంగాణలోని వరంగల్, ఖమ్మం, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రెండు మూడు నెలలకు ఒకసారి కాకతీయ సాంస్కృతిక మహోత్సవాలు నిర్వహిస్తాం. ఇందులో పద్మజా రెడ్డి, సుజాత తన నృత్యంతో ఆకట్టుకోనున్నారు. త్వరలోనే సినిమా ఉంటుంది. మంచి కథ కోసం ఎదురుచూస్తున్నాం' అని అన్నారు. 'నాకు ఇవ్వనున్న బిరుదుల గురించి సుబ్బరామిరెడ్డి చెప్పినప్పుడు 'బిరుదులు నాకు ఎందుకు? వద్దు' అని చెప్పా. మళ్ళీ ఇప్పుడు ఇస్తున్నట్టు ప్రకటించారు. దీంతో ఆయన అభీష్టాన్ని కాదనలేకపోయా. అందరి ప్రేక్షకుల ఆశీస్సులు ఉంటే చాలు' అని మోహన్‌బాబు తెలిపారు. కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ చెబుతూ, 'సుబ్బరామిరెడ్డిగారు ఏం చేసినా అది క్లాస్‌గా మంచి హిట్ అవుతుంది. ఇప్పుడు క్లాస్, మాస్ మేళవింపుగా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టబోతున్నారు. ఈ బిరుదును మోహన్‌బాబుకి సరైన సమయంలో, సరైన విధంగా ఇవ్వడంగా భావిస్తున్నాం' అని చెప్పారు. పరుచూరి గోపాలకృష్ణ, ప్రముఖ నృత్యకారిణిలు పద్మజారెడ్డి, వింజమూరి సుజాత పాల్గొన్నారు.



శ్రియా

ఇన్నోసెంట్ స్లమ్ గర్ల్ జీవిత నేపథ్యంలో..

గతంలో 'మిడ్‌నైట్ చిల్డ్రన్' అనే హాలీవుడ్ చిత్రంలో నటించిన పాత్ర తరహాలోనే శ్రియా మరోసారి నటించనుంది. నూతన దర్శకురాలు సుజన దర్శకత్వంలో తెరకెక్కబోయే చిత్రంలో సిటీ స్లమ్‌లో పెరిగిన సాధారణ వర్కింగ్ ఉమెన్‌గా శ్రియా కనిపించబోతోంది. ఓ ఇన్నోసెంట్ గర్ల్ జీవిత ప్రయాణాన్ని తెలిపే చిత్రమిది. ఇన్నోసెంట్ గర్ల్‌గా శ్రియా కనిపించనుంది. గతంలో ఎప్పుడూ కనిపించని పాత్రలో శ్రియా మెస్మరైజ్ చేయనుందట. మహిళా ప్రధానంగా సాగే ఈ సినిమాకు సుజన దర్శకత్వం వహిస్తున్నారు. సుజనకిది డైరెక్టర్‌గా తొలి చిత్రం. ఇక ఈ సినిమాకు ఇళయరాజా సంగీతం సమకూర్చనుండటం విశేషం. సినిమాటోగ్రాఫర్ జ్ఞాన శేఖర్ వి.ఎస్ ఈ చిత్రంతో నిర్మాతగా మారుతున్నారు. సాయి మాధవ్ బుర్రా డైలాగులు అందిస్తున్నారు. 'కథ పూర్తయ్యింది. సినిమాకు సంబంధించిన డిజైన్స్ కూడా పూర్తయ్యాయి. అన్ని కుదిరితే ఈ చిత్రాన్ని మార్చి ఫస్ట్ వీక్ నుంచి సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని దర్శకురాలు సుజన తెలిపారు. శ్రియా ప్రస్తుతం 'గాయత్రి', 'నరకాసూరన్', 'తడ్కా', 'వీరభోగ వసంత రాయలు' వంటి తదితర చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

విజయయాత్రకి రంగం సిద్ధం..



సూర్య

సూర్య, కీర్తి సురేష్ జంటగా నటించిన తమిళ చిత్రాన్ని తెలుగులో 'గ్యాంగ్' పేరుతో యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు తెలుగులో రిలీజ్ చేశారు. సంక్రాంతి సందర్భంగా ఈ శుక్రవారం విడుదలైన ఈ సినిమాకు మంచి స్పందన లభిస్తున్న నేపథ్యంలో సూర్య తెలుగునాట విజయయాత్ర చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఆ విశేషాలను నిర్మాతలు తెలియజేస్తూ, 'సంక్రాంతి పండుగ సందర్భంగా విడుదలైన మా సినిమాకు అద్భుతమైన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. అన్ని వర్గాల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. సినిమాకు భారీ ఓపెనింగ్స్ రావడంతో డిస్ట్రిబ్యూటర్లు హ్యాపీగా ఉన్నారు. దర్శకుడు విఘ్నేష్ శివన్ టేకింగ్, సూర్య నటన, రమ్యకృష్ణ, కార్తీక్‌ల క్యారెక్టరైజేషన్స్, కీర్తి సురేష్ అందం, మంచి సందేశం, ట్విస్టులు ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేస్తున్నాయి. సినిమాకు వస్తున్న స్పందన నేపథ్యంలో థియేటర్ల సంఖ్య కూడా పెంచబోతున్నాం. తెలుగు ప్రేక్షకులకు థ్యాంక్స్ చెప్పేందుకు హైదరాబాద్‌లో అభిమానుల సమక్షంలో గ్రాండ్ సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేయబోతున్నాం. దీంతోపాటు హీరో సూర్య సక్సెస్ టూర్‌లో పాల్గొనబోతున్నారు. ఇప్పటి వరకు తనను ఆదరించిన తెలుగు ప్రేక్షకుల్ని స్వయంగా పలకరించబోతున్నారు. 'గ్యాంగ్' చిత్రంతో ఇంత మంచి విజయం అందించిన తెలుగు ప్రేక్షకుల్ని ఆప్యాయంగా కలుసుకోబోతున్నారు' అని అన్నారు.



రెజీనా

ఆశించినట్టుగానే..

'2017 గొప్ప సంవత్సరం కాదు. కానీ 2018 ఆశించిన స్థాయిలో ఉంటుందని అనుకుంటున్నా' అని అంటోంది రెజీనా. గతేడాది తమిళంలో మూడు సినిమాలు, తెలుగులో రెండు సినిమాల్లో నటించింది. సందీప్ కిషన్ సరసన 'నక్షత్రం', నారా రోహిత్‌కి జోడీగా నటించిన 'బాలకృష్ణుడు' చిత్రాలు ఆశించిన ఫలితాన్నివ్వలేదు. దీంతో గతేడాది ఎలా సాగిందనే ప్రశ్నకు రెజీనా స్పందిస్తూ, 'నిజం చెప్పాలంటే 2017 నా కెరీర్‌కు గొప్ప ఏడాది కాదు. నా సినిమాలు ఆశించిన ఫలితాన్విలేదు. కానీ 2018 ఆశించిన స్థాయిలో ఉంటుందని అనుకుంటున్నా. ఈ ఏడాది నేను పనిచేసిన కొన్ని చిత్రాలు నటిగా నాలో పరిణతికి తోడ్పడ్డాయి. ఇప్పటి వరకు నేను పోషించిన పాత్రలతో పోల్చితే ఇప్పుడు చేస్తున్నవి చాలా విభిన్నంగా ఉంటాయి. నా పాత్రలు చూసిన తర్వాత ప్రేక్షకుల్లో వచ్చే స్పందన కోసం ఎదురుచూస్తున్నా. తెలుగు సినిమా 'అ!'లో నేను మాదక ద్రవ్యాలకు బానిసైన అమ్మాయిగా కనిపిస్తాను. ఈ పాత్ర కోసం నా జుట్టును షార్ట్ కట్ చేసుకున్నా. ఇది నాకు మంచి పేరు తెచ్చిపెడుతుందని ఆశిస్తున్నాను' అని చెప్పింది. రెజీనా ఈ సినిమాతోపాటు తమిళంలో 'మిస్టర్ చంద్రమౌళి' అనే సినిమాలోనూ నటిస్తోంది.

ఊహించిన దానికంటే ఆదరణ



కె.ఎస్.రవికుమార్

'ప్రతి హీరోలో ప్లస్‌లు, మైనస్‌లుంటాయి. ప్లస్‌లు ఎక్కువ ఉన్న హీరో టాప్ పొజిషన్‌కు వెళ్తాడు' అని అంటున్నారు దర్శకులు కె.ఎస్.రవికుమార్. బాలకృష్ణ, నయనతార, నటాషా దోషి, హరిప్రియ హీరోహీరోయిన్లుగా కె.ఎస్.రవికుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'జై సింహా'. సి.కళ్యాణ్ నిర్మాత.

ఇటీవల విడుదలైన ఈ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తున్న నేపథ్యంలో శనివారం దర్శకుడు మీడియాతో మాట్లాడుతూ, 'సినిమాకు మంచి స్పందన వస్తోంది. ఊహించిన దానికంటే బాగా ఆదరిస్తున్నారు. అయితే మొదటి రెండు మూడు రోజులు అభిమానులే ఉంటారు. తర్వాత వచ్చే వారు నిజమైన ప్రేక్షకులు. వాళ్ళు ఎలా స్పందిస్తారో చూడాలి. బాలకృష్ణతో సినిమా చేయాలని 8 ఏండ్ల క్రితమే అనుకున్నాం. అప్పుడు ఓ కథ అనుకున్నాం, చివరి నిమిషంలో కథ బాగా లేక చేయలేదు. మళ్ళీ ఆయనతో సినిమా చేయాలని ఐదారు కథలు అనుకున్నా. కానీ రత్నం చెప్పిన లైన్‌లో ఓపెనింగ్ సన్నివేశం, క్లైమాక్స్ సన్నివేశం నచ్చి ఈ కథ చేశాం. 14 ఏండ్ల తర్వాత తెలుగులో చేసిన చిత్రమిది. బేసిక్‌గా ఇది లవ్ స్టోరీ. పూర్తిగా లవ్ ట్రాక్ పెడితే బాలకృష్ణకు సూట్ కాదు. అందుకే కుటుంబ అనుబంధాలు, ఎమోషనల్ సన్నివేశాలు, సెంటిమెంట్ పెట్టాం. లవ్ కూడా మెచ్యూర్డ్‌గా ఉంటుంది. డ్యూయెట్స్ పెడితే సెట్ కాదు. అయా సన్నివేశాలు సినిమాలో బాగా పండాయి. కథ పాతది అంటున్నారు. కానీ సెంటిమెంట్, లవ్ ఎవర్‌గ్రీన్. వాటిని కొత్తగా చెప్పడమే చేయాల్సింది. బేసిక్‌గా నేను కథ రాసుకునేటప్పుడు ఓ ఆడియెన్‌లా ఫీలై రాస్తాను. బాలకృష్ణ వంటి మాస్ హీరోకు రజనీకాంత్ తరహా మాస్ అంశాలే పెట్టాలి. కమల్ హాసన్‌లా క్లాస్‌గా చెబితే జనం చూడరు. అందుకే బాలకృష్ణను ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ఇందులో పాటలు, ఫైట్స్, డైలాగులు ఇలా అన్ని అంశాలను మేళవించాం. బాలకృష్ణ కూడా చాలా బాగా నటించారు. సంక్రాంతి సినిమాగా బాగా ఎంజాయ్ చేస్తున్నారు. క్లాస్ సినిమా కొంత మందికే కనెక్ట్ అవుతుంది. కమర్షియల్ సినిమానే అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. నేను తెరకెక్కించే సినిమాలో కామెడీ, అనుబంధాలు, ఎమోషన్స్ ఉండేలా చూసుకుంటాను. అవే సినిమాకు బలం. తదుపరి చిత్రాలు ఇంకా ఏం అనుకోలేదు. నేనేది ప్లాన్ చేయను. వచ్చిన ఛాన్స్‌లను సద్వినియోగం చేసుకుంటూ వెళ్తాను. అన్ని కుదిరితే తెలుగులోనూ వరుసగా సినిమాలు చేయడానికి సిద్ధమే' అని అన్నారు.

స్పై థ్రిల్లర్ గూఢచారి ఫస్ట్‌లుక్ అదుర్స్



అడివి శేషు

నటుడు, రచయిత అడివి శేషు నటిస్తున్న తాజా చిత్రం 'గూఢచారి'. సంక్రాంతి పండుగ నేపథ్యాన్ని పురస్కరించుకుని ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను చిత్రయూనిట్ శనివారం విడుదల చేసింది. సమ్మర్ స్పెషల్‌గా ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేందుకు దర్శక, నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ చిత్రం గురించి నిర్మాతలు మాట్లాడుతూ, 'క్షణం', 'అమీతుమీ' వంటి విభిన్న తరహా చిత్రాలతో అడివిశేషు మంచి విజయాలను సొంతం చేసుకున్నారు. ఈ చిత్రం కూడా అదే పంథాలో ఉంటుంది. స్పై థ్రిల్లర్ నేపథ్యంలో సాగే చిత్రమిది. సంక్రాంతి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని విడుదల చేసిన ఫస్ట్‌లుక్ అందరి ప్రశంసలను సొంతం చేసుకుంటోంది. తుపాకులు, బుల్లెట్స్‌తో అధునాతనంగా డిజైన్ చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ అందరిలోనూ క్యూరియాసిటీని పెంచుతోంది. ఓ మంచి కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈచిత్రంలో అడివిశేషు గూఢచారిగా కనిపిస్తారు. ఆయన సరసన శోభిత ధూళిపాళ కథానాయికగా నటిస్తోంది. అభిషేక్ పిక్చర్స్, విస్టా డ్రీమ్ మర్చంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈచిత్రాన్ని సమ్మర్ స్పెషల్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది' అని చెప్పారు. శశికరణ్ తిక్క దర్శకత్వంలో రూపొందుతున్న ఈచిత్రానికి కథ : అడివి శేషు, సహ నిర్మాత : వివేక్ కూచిబొట్ల, సంగీతం : శ్రీచరణ్ పాకాల, మాటలు: అబ్బూరి రవి, కెమెరా : షానియల్ డియో, ఎడిటింగ్ : గ్యారీ బి.హెచ్, నిర్మాతలు : అభిషేక్ నామా, టి.జి.విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్.

ఆన్‌లైన్ అంగట్లో నకిలీ!

-జై

సంక్రాంతి పండుగను ద ష్టిలో ఉంచుకుని పలు ఈ-కామర్స్ సంస్థలు పెద్ద ఎత్తున ఆఫర్లను ప్రకటించాయి. కొన్ని సంస్థలు ఎలక్ట్రానిక్స్, వస్త్రాల ఉత్పత్తులపై 40-65 శాతం వరకు ఆఫర్‌లను ప్రకటించాయి. మరికొన్ని సంస్థలు మొబైల్స్ పై యాభై శాతం, ఫుట్‌వేర్‌పై ఏకంగా 90 శాతం వరకు తగ్గింపును ప్రకటించడం గమనార్హం. ఐతే, సదరు ఆన్ లైన్ సంస్థలు విక్రయించే వస్తువులు అసలైనవా? నకిలీవా? అన్న సందేహం పలువురిలో వ్యక్తమవుతున్నది. దీనికి కారణం గతంలో జరిగిన పలు సంఘటనలే! ఆన్‌లైన్‌లో అమ్మే వస్తువుల్లో చాలా వరకు నకిలీ ఉత్పత్తులేనని గత డిసెంబర్ లో ఓ ఆంగ్ల ఛానల్ జరిపిన పరిశోధనలో వెల్లడవడం మార్కెట్ వర్గాలతో పాటు వినియోగదారులను షాక్ కి గురిచేసింది. సాధారణ రోజుల్లో కంటే, పండుగ సమయాల్లో ఈ-కామర్స్ వెబ్‌సైట్లు రాయితీల్లో అమ్మే పలు వస్తువుల అసలు ధర, నాణ్యతలో తేడా ఉన్నట్టు.. చాలామంది తయారీదారులు, విక్రేతలు ఆన్‌లైన్‌లో నకిలీ సరుకులను వినియోగదారులకు ఆఫర్ల పేరిట అంటగడుతున్నట్టు సదరు ఛానెల్ రీసెర్చ్ లో తేలింది. ఐటీ చట్టంలో ఉన్న పలు లోపాలే ఇందుకు కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. కాగా, తమ బ్రాండ్ పేరుతో తయారు చేసిన నకిలీ ప్రొడక్టులను విక్రయించినందుకు రిటైల్ నెట్, టెక్ కనెక్ట్, యూనికెమ్ లాజిస్టిక్స్, మార్కో వేగన్ అనే సెల్లర్స్ తో పాటు.. వేదికగా నిలిచిన ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ 'ఫ్లిప్‌కార్ట్'పై అమెరికాకు చెందిన అథ్లెటిక్ ఫుట్‌వేర్ బ్రాండ్ 'స్కెచర్స్' ఇరవై రోజుల క్రితం కేసు వేసిన విషయం తెలిసిందే!. కాగా, కస్టమర్లకు, సెల్లర్స్ కు మధ్య తాము కేవలం మధ్యవర్తిగా మాత్రమే ఉంటామని, దానికి మమ్మల్ని బాధ్యులుగా చెయ్యడం ఎంతవరకు కరెక్ట్ అని ఫ్లిప్‌కార్ట్ అధికార ప్రతినిధులు ఈ కేసు వ్యవహారమై వ్యాఖ్యానించడం విశేషం.

గత మూడేండ్ల కాలంలో.. టామీ హిల్‌ఫిగర్, లాకోస్ట్, కెల్విన్ క్లీన్, లెవీస్, సూపర్‌డ్రై వంటి సంస్థల వేర్‌హౌస్‌లలో భారీస్థాయిలో నకిలీ ఉత్పత్తులు వెలుగుచూడటం ఆలోచించాల్సిన విషయం.



ఆన్ లైన్ కొనుగోళ్ళు - ఆసక్తికర అంశాలు

- గత దీపావళి పండుగ సీజన్‌లో దేశంలో దాదాపుగా రూ.19,000 కోట్ల ఆన్‌లైన్ అమ్మకాలు జరిగాయని అంచనా!
- ఆన్‌లైన్‌లో అమ్మే 60 శాతం ఆట వస్తువులు, 40 శాతం వస్త్ర ఉత్పత్తులు నకిలీవేనట!
- అమెరికా, ఐరోపా వారికంటే ఆసియా వాసులే ఆన్‌లైన్ కొనుగోళ్లను ఎక్కువగా చేస్తున్నారని గణాంకాల సారాంశం.

నిబంధనలు వచ్చాయి.. అమలు ఎప్పుడు?

తరుచూ రేగుతున్న నకిలీ వివాదాల వల్ల ఉత్పత్తుల నాణ్యతకు తాము బాధ్యులం కాదని అటు విక్రేతలు , ప్రొడక్ట్‌ల అమ్మకానికి వేదిక కల్పించిన వారు (ఈ- కామర్స్ సంస్థలు) కూడా తప్పించుకోవడం పరిపాటిగా మారింది. చివరకు వస్తువును ఉత్పత్తి చేసిన తయారీదారు సంస్థలు కూడా 'మేము తయారు చేసిన వస్తువు, మీకు డెలివరీ అయిన వస్తువుకు సారూప్యత లేద'ని అనిపించుకున్న కేసులు కూడా ఉన్నాయి. ఇవన్నీ చూస్తే, అంతిమంగా వినియోగదారుడే నష్టపోతున్నాడన్నది అవగతమవుతోంది. వినియోగదారుల రక్షణ చట్టం ప్రకారం.. ఆన్ లైన్ లోనైనా, ఆఫ్ లైన్ లోనైనా తయారీ సంస్థ వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను, ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్ణయించిన ధరకే విక్రయించాలి. ఆయా వస్తువులను వినియోగదారులకు చేర్చేవారిది కూడా భాగస్వామ్యం ఉంటుంది. వస్తువు పాడైనా, నకిలీదిచ్చినా ఈ-కామర్స్ కంపెనీ, విక్రేత, తయారీదారు ముగ్గురూ బాధ్యత వహించాల్సిందేనని చట్టం చెబుతోంది. అయినప్పటికీ, ఇది ఎక్కడా పాటించడం లేదు. ఆన్ లైన్ లో అమ్మకం జరిపే వివిధ వస్తువులపై రిటైల్ గరిష్ట ధర (ఎంఆర్‌పి), తయారీ తేదీ, తయారీదారు ఇతర వివరాలను స్పష్టంగా ముద్రించాలని వినియోగదారుల మంత్రిత్వ శాఖ ఇప్పటికే, ఆదేశాలు జారీచేసినప్పటికీ ఇంకా అది పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం విచారకరం. ఇప్పటికైనా, వినియోగ దారుల మంత్రిత్వ శాఖ అధికారులు, ప్రభుత్వం.. ఆన్ లైన్ వేదికగా సాగుతున్న ఈ నకిలీ మోసానికి అడ్డుకట్ట వేసి వినియోగదారుడి జేబులకు చిల్లుపడకుండా చూస్తారని ఆశిద్దాం.

విద్యా విధానం నిర్వహణ మాకు తెలుసు

- ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలకు కాశ్మీర్ విద్యా మంత్రి 'కౌంటర్'

జమ్మూ : రాష్ట్రంలో విద్యా విధానాన్ని ఎలా నిర్వహించుకోవాలో తమకు తెలుసని , ఈ విషయంలో తమకు సలహాలిచ్చేందుకు ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ గొప్ప విద్యావేత్తేమీ కాదని, జమ్మూకాశ్మీర్ మంత్రి అల్తాఫ్ బుఖరి వ్యాఖ్యానించారు.. విద్య రాష్ట్రానికి సంబంధించిన అంశమని, పాఠశాలలను ఎలా నడపాలో తమ ప్రభుత్వానికి తెలుసునని ఆయన అన్నారు. కాశ్మీర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావ్యవస్థ అవినీతిమయంగా ఉందని, మతపరమైన భావాలను ప్రోత్సహిస్తున్నారని, ప్రతీ తరగతి గదిలోనూ రెండు మ్యాపులు ఉన్నాయని, ఒకటి భారత్ మ్యాప్, రెండోది జమ్మూకాశ్మీర్ మ్యాప్ అనిశుక్రవారం ఆర్మీ డే సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ చేసిన వ్యాఖ్యలపై ఆయన శనివారం ఈ విధంగా 'కౌంటర్' ఇచ్చారు. అంతేగాకుండా జమ్మూకాశ్మీర్‌కు రెండు రాజ్యాంగాలు ఉన్నాయని, ఒకటి జమ్మూకాశ్మీర్ రాజ్యాంగం, రెండోది భారత రాజ్యాంగమని బుఖరి పేర్కొన్నారు. రాష్ట్రం గురించి విద్యార్థులకు బోధించడానికి రాష్ట్రం మ్యాప్ అవసరమని, రాష్ట్రానికి రెండు జెండాలు ఉన్నాయని కూడా అన్నారు.

వీడియో చిత్రాలను విడుదల చేసిన ఇస్రో


న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటా నుంచి శుక్రవారం విజయవంతంగా రాకెట్లను అంతరి క్షంలోకి ప్రవేశ పెట్టిన అనంతరం కెమెరా ద్వారా పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి) తీసిన వీడియో



చిత్రాలను ఇస్రో విడుదల చేసింది. పిఎస్ఎల్వి గంటకు 27,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించి, అంతరిక్షంలో 31 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రవేశపెట్టింది. 23 సెకన్ల పాటు ఉన్న వీడియోలో ఉష్ణ కవచం విభజన దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాకెట్ తీసుకెళ్లిన వాటిలో 'కార్టోస్టాట్ 2' భారీ ఉపగ్రహం. దీనిని మొట్టమొదటిగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. బయటకు వెలువడింది. 710 కిలో గ్రాముల బరువునన ఈ నిఘా ఉపగ్రహం భారతదేశ సరిహద్దులను పర్యవేక్షిస్తుంది.

మహారాష్ట్ర పర్యటనలో రాష్ట్రపతి

ముంబయి: భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రెండ్రోజుల పర్యటనలో భాగంగా శనివారం మహారాష్ట్రకు వచ్చారు. విమానాశ్రయానికి సీఎం ఫడ్నవీస్ చేరుకొని కోవింద్‌కు ఘన స్వాగతం పలికారు. భాయందర్‌లోని రంభౌ మహల్గీ ప్రభోదినిలో నిర్వహించే ఆర్థిక ప్రజాస్వామ్య సమావేశాన్ని ఆదివారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్రపతి ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సమావేశ ముఖ్య లక్ష్యం యువ పారిశ్రామికవేత్తలకు వేదిక కల్పించడం, స్వయం ఉపాధికి ప్రేరణ కల్పించి మార్గదర్శకత్వాలు సూచించడం. మరుసటి రోజు మధ్యాహ్నం సబర్బన్ బోరివలిలోని ప్రపంచ విపాసాన పగోడని సందర్శించి తిరిగి ఆయన ఢిల్లీకి వెళ్లనున్నారు.



నాగం వ్యవహారం పార్టీలో చర్చిస్తాం

బీజేపీ శాసనసభాపక్షనేత జి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీజేపీ సీనియర్ నేత నాగం జనార్ధన్‌రెడ్డి వ్యవహారాన్ని పార్టీలో చర్చిస్తామని ఆపార్టీ శాసనసభాపక్షనేత జి కిషన్‌రెడ్డి చెప్పారు. అయితే దీనిపై తాను వ్యక్తిగతంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని స్పష్టం చేశారు. నాగం వ్యాఖ్యలు పార్టీ దృష్టికి వచ్చాయని చెప్పారు. శనివారంనాడిక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా నాగం వ్యవహారంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన పై



విధంగా స్పందించారు. అయితే ఇప్పటికే పార్టీ ముఖ్యనేతలు కొందరు నాగం జనార్ధన్‌రెడ్డితో జరిపిన చర్చలు విఫలమైనట్టు సమాచారం. ఉగాది తర్వాత తాను పార్టీని వీడుతానని, 2019 ఎన్నికలు తన జీవితానికి ఆఖరివని ఆయన వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నాగం వ్యవహారంపై పార్టీలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఆయన కాంగ్రెస్‌లో చేరతారని బీజేపీ నేతలు కొందరు బాహటంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో కిషన్‌రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. అఖిలపక్షంతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్ట సవరణలు చేపట్టడాన్ని కిషన్‌రెడ్డి తప్పుపట్టారు. నాలుగేండ్లుగా పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి నిధులు కూడా విడుదల చేయలేదని విమర్శించారు. నూతనంగా రూపొందించిన ముసాయిదా



చట్ట సవరణల్ని మొదట గ్రామపంచాయతీలకు పంపి చర్చలు జరపాలని అన్నారు. ప్రభుత్వంలో తెలంగాణ వ్యతిరేకులు మంత్రులుగా ఉన్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ చేసిన వ్యాఖ్యల్ని విలేకరులు ప్రస్తావించగా, తాము మొదటి నుంచీ అదే మాట చెప్తున్నామని, ఇప్పటికైనా ఆపార్టీలోని వారికి జ్ఞానోదయం అవుతున్నందుకు సంతోషం అని అన్నారు.

కొత్త పాసుపుస్తకాలిస్తాం



మొదటిపేజీ తరువాయి

ల్యాండ్ వెబ్‌సైట్ నిర్వహిస్తామని, దీనికి 'ధరణి' అనే పేరును ఖరారు చేసినట్టు కేసీఆర్ చెప్పారు. అవినీతికి ఏమాత్రం ఆస్కారం లేని పారదర్శకమైన కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని తీసుకొస్తున్నామని, పూర్తి స్థాయి సంస్కరణలతో వస్తున్న కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని మార్చి 11 నుంచే అమలు చేస్తామన్నారు. అదేరోజు మండల రెవెన్యూ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు ప్రారంభిస్తామని వెల్లడించారు.

రెవెన్యూ శాఖ పరిధిలోనే ఇకపై భూముల నిర్వహణ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతున్నదని కాబట్టి రెండు శాఖల మధ్య మరింత సమన్వయం సాధించడానికి ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న వాకాటి కరుణకే రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు సిఎం చెప్పారు. కొత్త పాస్ పుస్తకాల జారీ, రిజిస్ట్రేషన్ విధానంలో సంస్కరణలపై ప్రగతి భవన్‌లో దాదాపు 8 గంటల పాటు శనివారం సుదీర్ఘ సమీక్ష జరిగింది. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సిఎం ముఖ్య కార్యదర్శులు ఎస్.నర్సింగ్‌రావు, శాంత కుమారి, కార్యదర్శి స్మితా సబర్వాల్, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి రాజేశ్వర్ తివారి, మీ సేవా కమిషనర్ జిటి వెంకటేశ్వరరావు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్మార్ట్ గవర్నమెంట్ జిఎం డి.శ్రీధర్, సీనియర్ మేనేజర్ సుధీర్ గోలి తదితరులు పాల్గొన్నారు. సమగ్ర భూ ప్రక్షాళన ద్వారా వచ్చిన ఫలితాలను ఈ సమావేశంలో విశ్లేషించారు. తెలంగాణ వ్యాప్తంగా వందరోజుల పాటు నిర్వహించిన భూ రికార్డుల ప్రక్షాళన పార్ట్ ఎ విజయవంతమైందని సీఎం చెప్పారు. దాదాపు 90 శాతానికి పైగా భూముల విషయంలో స్పష్టత వచ్చిందని, ఏ భూమికి ఎవరు యజమానో తేలిందన్నారు. ఈ వివరాల ఆధారంగానే కొత్త పాస్ పుస్తకాల జారీ, పంట పెట్టుబడి మద్దతు పథకం అమలు చేస్తామన్నారు. కోర్టు కేసులు, ఇతర వివాదాలు, అభ్యంతరాలు కలిగిన భూములను పార్ట్ బిలో పరిష్కరిస్తామన్నారు. పార్ట్ బి చేపట్టడానికి వీలుగా ప్రభుత్వం కొన్ని విధాన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందని, త్వరలోనే క్యాబినెట్ సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. పార్ట్ ఎ ద్వారా లెక్కతేలిన భూములకు సంబంధించిన వ్యవసాయ ఖాతాలు దాదాపు 71 లక్షలున్నాయని, వారందరికీ కొత్త పాస్ పుస్తకాలు ఇస్తామన్నారు.

కోర్ బ్యాంకింగ్ తరహాలో 'ధరణి' నిర్వహణ

భూ రికార్డుల వెబ్ సైట్ 'ధరణి'ని కోర్ బ్యాంకింగ్ తరహాలో నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. దీనికోసం ప్రత్యేకంగా ఐటి విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ వివరాలు, పేరు మార్పిడి వివరాలు అదే రోజు ఈ ధరణిలో నమోదు అవుతాయని, మండల కార్యాలయం నుంచి మొదలుకుని రాష్ట్ర స్థాయిలో అన్ని చోట్ల ఈ వెబ్ సైట్ నుంచి వివరాలు తీసుకోవచ్చన్నారు. విదేశాల్లో ఉన్న వారు కూడా ధరణి ద్వారా అందే సమాచారంతో క్రయ, విక్రయాలు జరుపుకోవచ్చని వెల్లడించారు.

సీఎంకు నివేదికలు అందజేసిన సబ్‌కమిటీలు


పంట పెట్టుబడి మద్దతు పథకం అమలు, పంచాయితీ రాజ్ చట్టంలో తేవాల్సిన మార్పులకు సంబంధించి ఏర్పాటైన మంత్రి వర్గ ఉప సంఘాలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తమ సిఫారసులు అందించాయి. పంట పెట్టుబడి మద్దతు పథకంపై పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన సంఘం, పంచాయితీ రాజ్‌పై ఏర్పాటైన జూపల్లి కృష్ణారావు నాయకత్వంలోని సంఘం పలు సూచనలు, సిఫారసులు చేశాయి. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మంత్రి వర్గ ఉపసంఘాల సభ్యులు ఈటల రాజేం దర్, హరీశ్‌రావు, కేటీఆర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులున్నారు.

తహశీల్దార్‌కు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు

రైతులు, ఇతర ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా ప్రతీ మండల రెవెన్యూ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. రాష్ట్రంలో మొత్తం 584 మండలాలున్నాయి. ప్రస్తుతం 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వాటిని యధావిధిగా కొనసాగిస్తారు. ఈ 141 సబ్ రిజిస్ట్రార్ల పరిధి వారి కార్యాలయమున్న మండలానికే పరిమితం అవుతుంది. మిగతా 443 చోట్ల తహశీల్దార్‌కు సబ్ రిజిస్ట్రార్ బాధ్యతలు అప్పగిస్తారు. శని, ఆదివారాలు, ఇతర సెలవులు మినహాయించి వారానికి ఐదు రోజులు ఉదయం పూట రిజిస్ట్రేషన్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో తహశీల్దార్ హాజరుకాలేకపోతే, ఆ బాధ్యతలను డిప్యూటీ తహశీల్దార్‌కు అప్పగిస్తారు.

తెలంగాణ భూ భాగం వివరాలు

మొత్తం భూ భాగం	1,12,077 చదరపు కిలోమీటర్లు
మొత్తం ఎకరాలు	2.80 కోట్ల ఎకరాలు
వివాదం లేని వ్యవసాయ భూమి	1.42 కోట్ల ఎకరాలు
కోర్టు కేసులు, వివాదాలు, చిక్కులు కలిగినవి	17.89 లక్షల ఎకరాలు
రైతుల వద్ద ఉన్న వ్యవసాయేతర భూములు	11.95 లక్షల ఎకరాలు
చెరువులు, కుంటలు, కాలువలు, రైల్వేలైన్లు, సబ్‌స్టేషన్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ ఆస్తుల కింద భూములు, కోర్టు కేసుల్లోని అటవీ భూములు	84.00 లక్షల ఎకరాలు
నగరాలు, పట్టణాలు, గ్రామాల నివాస ప్రాంతాలు, వివాదాలేని అటవీభూమి	24 లక్షల ఎకరాలు



ఎన్నికలెప్పుడొచ్చినా సిద్ధమే

మొదటిపేజీ తరువాయి

అవినీతి గురించి మాట్లాడితే స్పందించాల్సిన అవసరం తమకు లేదని రేవంత్‌రెడ్డినుద్దేశించి మంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ స్థిరపడితే... ఎప్పటికీ అధికారంలోకి రాలేమన్న భయం కాంగ్రెస్‌కు పట్టుకుందని, ఈ నేపథ్యంలోనే ఆ పార్టీ నేతలు ఇష్టారీతిన ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కరెంట్ కొనుగోలు ఆరోపణలపై ఆధారాలుంటే కోర్టుకు వెళ్లొచ్చని మంత్రి కాంగ్రెస్ నేతలకు సూచించారు.

కూలిన ఓఎన్‌జీసీ హెలికాప్టర్

మొదటిపేజీ తరువాయి

ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే తొలుత హెలికాప్టర్ శకలాలు లభ్యమ య్యాయి. తర్వాత నలుగురి మృతదేహా లను కూడా వెలికి తీశారు. మిగిలిన ముగ్గురి జాడ తెలియరాలేదు. వారి కోసం 5 నౌకలు, 4 హెలికాప్టర్ల సహాయంతో రెస్క్యూ బృందాలు గాలిస్తున్నట్టు నేవి అధికారి ఒకరు వెల్లడించారు.

రిజిస్ట్రేషన్లకు రెక్కలు..



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 రిజిస్ట్రేషన్ జిల్లాల్లో 141 రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చోటుచేసుకుంటున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరానికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా గత జనవరి నుంచి డిసెంబరు వరకు 10,31,709 డాక్యుమెంట్లను రిజిష్టర్ చేశారు. తద్వారా రూ.3889.28 కోట్ల ఆదాయం సమకూరింది. ఇంకా మరో మూడు నెలల సమయం మిగిలి ఉన్నది. దీంతో మరింత ఆదాయం వస్తుందని అధికారిక అంచనా.

కాగా గత 2016-17 ఆర్థిక సంవత్సరంలో 11,21,429 డాక్యుమెంట్లు రిజిష్టర్ అయ్యాయి. తద్వారా రూ.3536.93 కోట్లు ఆదాయం ప్రభుత్వ ఖాతాకు చేరాయి. అయితే ఆ ఏడాదిలో 4,291 కోట్లు లక్ష్యం పెట్టుకోగా, వచ్చింది మాత్రం రూ.4,041 కోట్లు మాత్రమే. ఈనేపథ్యంలో 2017-18 సంవత్సరానికి ప్రభుత్వం రూ. 3000 కోట్లకు ఆదాయ లక్ష్యాన్ని తగ్గించింది. అయితే ఇప్పటికే రూ. 3889. 28 కోట్లు రావడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలను పరిశీలిస్తే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అధికంగా డాక్యుమెంట్లు రిజిష్టర్ అయ్యాయి. అంతేగాక ఆదాయం సైతం అక్కడి నుంచే అధికంగా వచ్చిందని ఆశాఖ అదనపు డిఐజి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అయితే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన నోట్ల రద్దు మూలంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాదికి భారీగా ఆదాయం కోల్పోయిందని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు అంటున్నారు.

జోరుగా వ్యాపారం: రాష్ట్రంలో రియాల్టీ బిజినెస్ కొంత మేర పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం అధికమైందని అధికారులు చెబుతున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం (ఫ్లాట్లు), ప్లాట్లు, ఇండిపెండెంట్ ఇండ్లు, విల్లాలు తదితర నిర్మాణాలు కొంతమేర పుంజుకుందని రియాల్టీ వ్యాపారులు తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఈ తరహా నిర్మాణ రంగ వ్యాపారం మరోసారి గాడిలో పడింది. గత 2007 నుంచి 2010 సంవత్సరాల మధ్యలో రియాల్టీ వ్యాపారం ఎప్పుడూలేని విధంగా జరిగిన సంగతి తెలిసిందే. ఆతరువాత చోటుచేసుకున్న ఆర్థికమాంద్యం ప్రభావం దేశంతోపాటు రాష్ట్రంపైనా పడింది. ప్రధానంగా హైదరాబాద్‌తోపాటు హెచ్ఎండీఏ పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్, మెదక్, మహబూబ్‌నగర్, యాదాద్రి, నల్లగొండ తదితర జిల్లాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం మందగించడానికి కారణమైందని విశ్లేషకులు అభిప్రాయప్డారు.

రూ.1500 కోట్లు నష్టం

కేంద్ర ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంగా చేపట్టిన పరిపాలన సంస్కరణలు రాష్ట్ర ప్రభుత్వ ఆదాయంపై దెబ్బకొట్టాయి. నోట్ల రద్దు మూలంగా స్టాంపు డ్యూటీ ఆదాయం భారీగా పడిపోయిందని సమాచారం. ఈ సంగతి అధికారులు ధ్రువీకరించనప్పటికి, పేరు రాయడానికి ఇష్టపడని కొందరు అధికారులు పరోక్షంగా అంగీకరిస్తున్నారు. నోట్ల రద్దుతో రియాల్టీ వ్యాపారంలో కొంత స్థబ్దత వచ్చిందని, రిజిస్ట్రేషన్లు కొన్ని రోజులపాటు జరగలేదని రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ప్రాంత రియల్‌ఎస్టేట్ వ్యాపారి అన్నారు. తద్వారా ప్రభుత్వం సైతం ఆదాయం కోల్పోయిందని చెప్పారు. ఈ విషయాన్ని అధికారులు సైతం అంగీకరిస్తున్నారు. ఈ నష్టం దాదాపు రూ. 1000 కోట్ల నుంచి రూ. 1500 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఆ ప్రాంతాల్లో అధికాదాయం

హెచ్ఎండీఏ పరిధిలోని రిజిస్ట్రేషన్ జిల్లాల్లో అధికాదాఆయం నమోదైంది. ప్రధానంగా హైదరాబాద్, హైదరాబాద్ సౌత్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఎక్కువగా డాక్యుమెంట్లు రిజిష్టర్ అయ్యాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్ జిల్లాకు 19864 డాక్యుమెంట్లు రిజిష్టర్ కాగా , రూ.224.4 కోట్లు స్టాంపు డ్యూటీ కింద వచ్చింది. హైదరాబాద్ సౌత్ పరిధిలో 36,553 డాక్యుమెంట్లకుగాను రూ.427.75 కోట్లు ఆదాయం సమకూరింది. రంగారెడ్డిలో 2,09,275 డాక్యుమెంట్లకుగాను రూ.1318.04 కోట్ల ఆదాయం నమోదైంది. అదే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 1,18,878 డాక్యుమెంట్లకు రూ.884.95 ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ అయింది.

మధ్యలో నోట్ల రద్దు, ఇతర కారణాలతో తగ్గింది. మళ్లీ గత కొంతకాలంగా ఈ వ్యాపారంలో కదలికలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల జిల్లాల్లో రియల్‌ఎస్టేట్ పెరిగింది. హైదరాబాద్‌లో ఇటీవల మెట్రోరైల్ ప్రారంభమైన విషయం విదితమే. దీని ప్రభావం కూడా ఈ వ్యాపారం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతేగాక యాదాద్రి-భువనగిరి జిల్లాల్లోని యాదగిరిగుట్ట దేవాలయాన్ని అభివృద్ధి చేసే పేర ప్రభుత్వం దాదాపు రూ. 200 కోట్లు కేటాయించింది. రోడ్లు, బ్రిడ్జిలు, ఇతర మౌలిక సదుపాయాలు యాదగిరిగుట్టలో కల్పిస్తున్నారు. దేవస్థానాన్ని భారీహంగులతో నిర్మిస్తున్న తరుణంలో అక్కడ భూముల ధరలు అమాంతం ఆకాశాన్నంటాయి.

హైదరాబాద్ చుట్టుపక్కల ఇప్పుడు ఎక్కడ ప్లాట్లు దొరికే పరిస్థితి లేదు. నేడు హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో చదరపు గజం భూమి దాదాపు లక్ష రూపాయల వరకు రేటు పలుకుతున్నది. కర్మన్‌ఘాట్‌లో సుమారు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు ధరలు ఉన్నాయి. ఫ్లాట విషయానికొచ్చినపుడు ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉన్నాయి. సాధారణ ప్రాంతాల్లో చదరపు అడుగకు రూ. 2500 నుంచి రూ.3000 వరకు నడుస్తున్నది.

విల్లాల రేట్లు ఆకాశంలోనే ఉన్నాయి. నగర శివారు ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ల సంస్కృతి విస్తరించింది. మూడేండ్ల క్రితం రూ. 25 లక్షలకే వచ్చిన డబుల్‌బెడ్‌రూమ్ ఫ్లాట్లు ఇప్పుడు రూ. 35 నుంచి రూ. 40 లక్షలకు చేరాయి. శేరిలింగంపల్లి, మాదాపూర్, రాజేంద్రనగర్, ఉప్పల్, మల్కాజ్‌గిరి, కీసర, హయత్‌నగర్, మొయినాబాద్, శంకర్‌పల్లి, అల్వాల్, శామీర్‌పేట, జవహర్‌నగర్, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో భారీగా ధరలు పెరిగాయి. యాదగిరిగుట్ట పట్టణ సమీప ప్రాంతంలో చదరపు గజానికి రూ. 20 వేలు ధర పలుకుతుండగా, కాస్త దూరంలో రూ. 6000 నుంచి రూ. 8000 ప్లాట్లు విక్రయిస్తున్నారని స్థానిక రియల్‌ఎస్టేట్ వ్యాపారి తెలిపారు.

సెన్సెక్స్ ▲89
34,592

నిఫ్టీ ▲30
10,681

డాలరుకు రూపాయి విలువ
63.62



శుక్రవారం మార్కెట్లు ముగింపు సమయానికి

బంగారం(10.గ్రా)
రూ. 30,449



వెండి (కేజీ)
రూ. 41,900



కోడిగుడ్లు			
హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



8వేల కోట్లకు.. వారసులేవరు!

బ్యాంకుల్లో అనామతు డిపాజిట్లు

- నాలుగేండ్లలో అప్రకటిత ఖాతాలు రెట్టింపు
- చిరునామా లేని 2.63 కోట్ల ఎకౌంట్లు
- ఎస్‌బీఐలో మూలుగుతున్న రూ.1,036 కోట్లు : భారతీయ రిజర్వు బ్యాంకు నివేదిక

నవతెలంగాణ- వాణిజ్యవిభాగం

బ్యాంకుల్లో నుంచి తిరిగి తీసుకోని, ఎవరికి చెందినవో సరైన సమాచారం లేని బ్యాంకు డిపాజిట్లు రూ.8,000 కోట్లకు చేరాయి. దాదాపుగా 2.63 కోట్ల ఖాతాలకు దిక్కెవరూ లేరన్నట్లు ఉంది. ఆ బ్యాంకు డిపాజిట్లకు సంబంధించిన వ్యక్తులు లేదా వారసులకు సంబంధించిన వివరాలేవీ బ్యాంకు అధికారుల వద్ద లేవు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రిపోర్టు ప్రకారం గత డిసెంబర్ 16 నాటికి రూ.8,864 కోట్ల విలువ చేసే అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు బ్యాంకుల్లో మూలుగుతున్నాయి. కేవలం నాలుగు సంవత్సరాల్లోనే ఇలాంటి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు రెట్టింపు అయ్యాయి. 2012-2016 మధ్య కాలంలో ఇలాంటి డిపాజిట్ల విలువతో పాటు ఖాతాలు కూడా రెట్టింపయ్యాయి. బ్యాంకుల్లో డిపాజిట్లు చేసి ఆ తర్వాత ఏళ్ల తరబడి వాటిని తీసుకోవడానికి ఎవరూ రాకపోవడం లేదా ఆ డిపాజిట్‌దారులకు సంబంధించిన పూర్తి సమాచారం లేకపోతే వాటిని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా పరిగణిస్తారు.

దేశంలో 2012 నాటికి 1.32 కోట్ల అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు నమోదయ్యాయి. కాగా 2016 నాటికి ఈ సంఖ్య రెట్టింపై 2.63కోట్లకు చేరింది. కాగా ఇదే సమయంలో వారి డిపాజిట్లు కూడా రూ.3,598కోట్ల నుంచి రూ.8,864.6కోట్లకు పెరిగాయి. మరోవైపు ఈ డిపాజిట్లపై బ్యాంకు ఇచ్చే వడ్డీతో ఆ నగదు మరింత పెరుగుతూ వస్తోంది.



స్టేట్ బ్యాంకులో 47 లక్షల ఖాతాలు..

దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థగా ఉన్న స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో అత్యధికంగా 47 లక్షల అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు ఉన్నాయి. వీటి విలువ రూ.1,036 కోట్లుగా ఉంది. అదే విధంగా కెనరా బ్యాంకులో కూడా 47 లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాల్లో రూ.995కోట్ల నగదు ఉంది. కాగా దేశంలోనే రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఈ తరహా 23 లక్షల ఖాతాలు నమోదయ్యాయి. వీటి విలువ రూ.829కోట్లుగా ఉన్నాయి.

పదేండ్లు దాటితే అంతే..

కనీసం 10 సంవత్సరాల పాటు ఒక్క సారి కూడా లావాదేవీ జరపని ఖాతాలను అప్రకటిత డిపాజిట్లుగా పరిగణిస్తారు. పదేండ్ల పాటు ఫిక్సుడ్ డిపాజిట్లు, సేవింగ్, కరెంట్ ఎకౌంట్స్ ఖాతాలను బ్యాంకుల ప్రధాన కార్యాలయాలకు పంపిస్తారు.

కాగా వ్యక్తిగత బ్యాంకుల్లో పదేళ్ల పాటు నిర్వహణలోని ఖాతాలను ఏడాది ముగిసిన తర్వాత 30 రోజుల్లోగా ఆర్‌బీఐకి సమర్పించాల్సి ఉంటుంది.

వెబ్‌సైట్లలో వివరాలు..

అన్‌క్లెయిమ్డ్ బ్యాంకు డిపాజిట్‌దారుల వివరాలను బ్యాంకు అధికారులు తమ బ్యాంకు అధికారిక వెబ్‌సైట్‌లలో ఉంచాల్సిందిగా ఆర్‌బీఐ సూచించింది. ఈ జాబితాలో తప్పకుండా ఆ డిపాజిట్ చేసిన ఖాతాదారుని పూర్తి పేరు, వివరాలు పొందుపరచాల్సిందిగా ఆర్‌బీఐ ఆదేశించింది. అలా చేయడం వల్ల వారి వారసులు వివరాలను తెలుసుకోవడం చాలా సులభమవుతోందని ఆర్‌బీఐ ఉద్దేశ్యం.

ఉచితమేమీ కాదు..

ఇలాంటి అప్రకటిత ఖాతాల్లోని నగదు బ్యాంకులకేమీ ఉచిత సొమ్ము కాదు. సేవింగ్ ఖాతాలపై వడ్డీని ఆ ఖాతాల్లోనే జమ చేయాల్సి ఉంటుంది. ఫిక్సుడ్ డిపాజిట్లు మ్యాచుర్ అయిన తర్వాత ఖాతాదారు తీసుకోకపోతే ఆ మొత్తాలపై కూడా సేవింగ్ ఖాతాలపై ఇస్తున్న వడ్డీ రేటును అమలు చేయాల్సి ఉంటుంది. అదే విధంగా ఆ మొత్తాలపై ఆర్‌బీఐకి నగదు నిల్వల నిష్పత్తి కింద 4 శాతం సొమ్మును జమ చేయాల్సి ఉంటుంది. నిర్వహణలోని ఖాతాలపై సరైన ఆడిట్ ఉండాలని 2015లో బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది. అయితే ఈ అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను ఖాతాదారులకు చెల్లించేంత వరకు ఆ నిధులను మాత్రం ఆర్థిక అక్షరాస్యతకు ఉపయోగించుకోవడానికి వీలుంది. అదే విధంగా డిపాజిట్లపై చైతన్యం, విద్యా ఫండ్ కోసం వాడుకోవచ్చు.

నాణేల తయారీపై వెనక్కి తగ్గిన ప్రభుత్వం



కోల్‌కతా : నాణేల తయారీని నిలిపివేయాల్సిందిగా ఈ మధ్యకాలంలోనే ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకుంది. తిరిగి నాణేల తయారీని పునరుద్ధరించాల్సిందిగా సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎస్‌పీఎంసీఐఎల్)కు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ప్రస్తుతం కోల్‌కతా, ముంబయి, నోయిడా, హైదరబాద్‌లో ఈ తయారీ కేంద్రాలు(మింట్) ఉన్నాయి. కాగా శుక్రవారం నుంచే తిరిగి నాణేల తయారీని తిరిగి ప్రారంభించామని కోల్‌కతా మింట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బిజన్ దేవ్ తెలిపారు. కాగా రెండు షిఫ్టుల్లో కాకుండా ఒకే షిఫ్ట్‌లో పనియాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. బ్యాంకుల్లో నాణేలను భద్రపరిచేందుకు స్థలం లేదని నాణేల తయారీని నిలిపివేయాల్సిందిగా ఈనెల 9న ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేసింది. దీంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.

జనవరి తర్వాత మళ్లీ ధరలు పెరుగొచ్చు

ఎస్‌బీఐ అంచనా



న్యూఢిల్లీ : ప్రస్తుత జనవరి నెలలో ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉందని ఎస్‌బీఐకి చెందిన ఎకనమిక్ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన ఒక నివేదికలో తెలిపింది. అయితే ఈ నెల తర్వాత మళ్లీ ధరలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. తమ అంచనాలకు తగ్గట్టే 2017 డిసెంబరు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.21 శాతానికి ఎగిసి 17 నెలల గరిష్టానికి చేరిందని ఆ సంస్థ పేర్కొంది. నవంబరులో ఇది 4.88శాతంగా ఉందని, కాగా దీని గురించి ఆందోళన పడాల్సిన అవసరం లేదని పేర్కొంది. జనవరిలో కూరగాయల ధరలు తగ్గుముఖం పడుతున్నాయని తెలిపింది. దీంతో ఈ నెలలో రీటైల్ ద్రవ్యోల్బణం డిసెంబరు కంటే తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది. కాగా జనవరి తర్వాత నుంచి జూన్ వరకు మాత్రం కాస్త ఎక్కువగానే ఉండే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ సమయంలో సగటున ద్రవ్యోల్బణం 5.5శాతం ఉండనున్నట్లు అంచనా వేసింది. అయితే జులై తర్వాత నుంచి డిసెంబరు వరకు మాత్రం మళ్లీ తగ్గుముఖం పట్టి 4శాతం కిందకు చేరే అవకాశం ఉందని ఆ రిపోర్టు తెలిపింది.

వొడా-ఐడియా విలీనానికి మరో అడుగు



న్యూఢిల్లీ : వొడాఫోన్ -ఐడియా మెగా విలీనానికి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)నుంచి అమోదం లభించిందని ఐడియా సెల్యూలర్ ప్రకటించింది. ఇక ఫైనల్‌గా రెండు కంపెనీలకు టెలికామ్ విభాగం నుంచి తుది ఆమోదం రావాల్సి ఉంది. గత ఏడాది మార్చిలో బ్రిటన్ టెలికం దిగ్గజం వొడాఫోన్ గ్రూపునకు చెందిన వొడాఫోన్ ఇండియా.ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన ఐడియా సెల్యులార్‌తో విలీనం కాబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఒప్పందం విలువ 23 బిలియన్ డాలర్లుగా ఉంది. విలీనం పూర్తి అయితే భారత టెలికం సెల్యూలర్ రంగంలో 35 శాతం మార్కెట్ వాటా ఈ సంస్థలదే కానుంది.

ఏకమైన ఐడీఎఫ్‌సీ బ్యాంక్, క్యాపిటల్ ఫస్ట్

ముంబయి : అనేకక ఊహాగానాల మధ్య ఐడిఎఫ్‌సీ బ్యాంక్, క్యాపిటల్ ఫస్ట్ ఎట్టకేలకు ఒక్కటయ్యాయి. బ్యాంకింగేతర విత్త సంస్థ క్యాపిటల్ ఫస్ట్, ఐడిఎఫ్‌సీ సంస్థలు విలీనం అయినట్లు శనివారం ప్రకటించాయి. వీటి ఆమోదానికి సంబంధించిన అన్ని అనుమతులు రావాల్సి ఉంది. ఆ తర్వాత సంయుక్త భాగస్వామ్యంలో ఈ సంస్థలు కొనసాగనున్నాయి.

దీంతో సుమారు 64లక్షల మంది వినియోగదారులు రూ. 1.4కోట్ల ఆస్తులతో ఈ జాయింట్ వెంచర్ అమల్లోకి రానుంది. మరోవైపు ఈ కంపెనీకి బీపీల్ జెమానీ మధ్యంతర సీఈవొగా వ్యవహరించనున్నారు. ఈ క్రమలోనే ఆయన ఐడీఎఫ్‌సీ సీఎఫ్‌ఓ పదవీకి రాజీనామా చేశారు. అదే విధంగా క్యాపిటల్ ఫస్ట్ వ్యవస్థాపకులు వైద్య నాథన్ నూతన సంస్థలకు సీఈవొ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించనున్నారు. కాగా ఐడీఎఫ్‌సీకి చెందిన రాజీవ్ లాల్ నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా ఉంటారు. ఈ ఒప్పందం ప్రకారం 10 క్యాపిటల్ ఫస్ట్ షేర్లకు గాను, ఐడీఎఫ్‌సీ 139 షేర్లు దక్కనున్నాయి. ఐడీఎఫ్‌సీ ఇంతక్రితం శ్రీరామ్ సిటీ యూనియన్‌తో విలీనాన్ని రద్దు చేసుకుంది. ఆ తర్వాత కాపిటల్ ఫస్ట్‌తోనూ ఇదే జరుగనుందన్న ఊహాగానాలకు తాజాగా రెండు సంస్థల తమ ఏకీకరణతో సమాధానం చెప్పినట్లయ్యింది. విలీనం తర్వాత వీటి ఆస్తులు రూ.88,000 కోట్లకు చేరొచ్చని అంచనా. డీస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ 194 శాఖలకు, 353 చానల్స్‌కు, 9,100 మైక్రో ఎటీఏంలకు చేరనున్నాయి. శుక్రవారం బీఎస్‌ఈలో ఐడీఎఫ్‌సీ షేర్ విలువ 1.31 శాతం తగ్గి రూ.67.65 వద్ద ముగిసింది. కాపిటల్ ఫస్ట్ సూచీ 0.05 శాతం పెరిగి రూ.835.90 వద్ద ముగిసింది.

రూ.1157లకే విమానయానం : గోఎయిర్

సంక్రాంతి ఆఫర్



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ గో ఎయిర్ అన్ని చార్జీలు కలుపుకొని రూ.1157లకే విమానయానాన్ని ఆఫర్ చేస్తోంది. ఫ్లై స్మార్ట్, సేవ్ మోర్ స్కీం కింద ఈ ఆఫర్‌ను అందిస్తున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. జనవరి 22 తో ఈ ఆఫర్ బుకింగ్స్ ముగుస్తాయి. ఇలా బుక్ చేసుకున్న టికెట్ల ద్వారా 1 ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ 15 దాకా ప్రయాణించవచ్చు. ముఖ్యంగా పండగసీజన్, కొత్త ఏడాది, ఎక్కువ వారాంత సెలవుల సందర్భంగా ఈ డిస్కౌంట్ ఆఫర్‌ను అందించాలని నిర్ణయించామని గో ఎయిర్ పేర్కొంది. ఈ డిస్కౌంట్ పాటు గోఎయిర్ యాప్ ద్వారా టికెట్లను బుక్ చేసుకుంటే 10శాతం అదనపు తగ్గింపుకూడా ఇస్తున్నామని తెలిపింది. ఇలా వన్ వేలో రూ.250 తగ్గింపును, రిటర్న్ టికెట్ బుకింగ్‌పై 500 ఆఫర్ చేస్తోంది. ఆ కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్-లక్నో రూ. 3002, హైదరాబాద్ - అహ్మదాబాద్ రూ.3362, లక్నో-హైదరాబాద్ టికెట్ ధరలను రూ. 3574 గాను నిర్ణయించింది. అదే విధంగా లక్నో-ఢిల్లీ, బెంగళూరు-కొచ్చి, పుణె-బెంగళూరు, గౌహతి-కోల్‌కతా, పుణె-అహ్మదాబాద్, ఢిల్లీ-పాట్నా మధ్య రాయితీ ప్రయాణాన్ని అందిస్తున్నట్లు వెల్లడించింది.

అదుపుతప్పిన గులాబీ కారు..

వికటిస్తున్న రాజకీయ పునరేకీకరణ

- స్వరం పెంచుతున్న టీఆర్‌ఎస్ నేతలు
- కేసీఆర్ నిర్ణయాలపై మండిపాటు


(ఫైల్)

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీఆర్‌ఎస్ నేతలు స్వరం పెంచుతున్నారు. ఆ పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలను బహిరంగంగా తప్పుపడుతున్నారు. ఇందులో మంత్రులు, ఎమ్మెల్యేలే ఉండటం గమనార్హం. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడొద్దంటూ గతంలో గులాబీ బాస్ చేసిన ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి రాజకీయ పునరేకీకరణ జరగాలని, అన్ని పార్టీల్లో ఉన్న నేతలు టీఆర్‌ఎస్‌పార్టీలో కలిసిపోవాలని చేసిన పిలుపే కేసీఆర్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ఇప్పుడదే టీఆర్‌ఎస్‌పార్టీ నాయకత్వాన్ని ఆందోళనకు గురిచేస్తున్నదని ఒకరిద్దరు నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండురోజులక్రితం హెూంమంత్రి నాయిని నర్సింహారెడ్డి సొంత పార్టీ నేతలపైనే తిట్ల పురాణం అందుకుంటే, ఆ తర్వాత ఆ పార్టీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ మద్దతుగా నిలిచారు. కేసిఆర్‌ను తిట్టిన ముండాకొడుకులే... ఇవాళ తెలంగాణ క్యాబినెట్‌లో కులుకుతున్నారు అని నాయిని మాట్లాడారు. తాజాగా శనివారం జరిగిన మర్రి చెన్నారెడ్డి జయంతి కార్యక్రమంలోనూ ఆయనను ఆకాశానికెత్తేశారు. చెన్నారెడ్డి స్ఫూర్తితోనే కేసీఆర్ తెలంగాణ కోసం పోరాడారని చెప్పడం విశేషం. తెలంగాణలో మగాడంటే మర్రి చెన్నారెడ్డే అని కొనియాడారు. ఉద్యమంతో సంబంధం లేని వారు మంత్రి వర్గంలో ఉన్నమాట వాస్తవమేనని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇదెదో కాకతీయళంగా జరిగిందని కాదు అని తెలుస్తోంది. ఎప్పట్నుంచో అనాలని మనసులో దాచుకున్న వాటిని ఈ రోజు బయటపెట్టారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి విమర్శలు ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి స్థానిక నేతలు చేస్తున్నా, పెద్దగా వాటిని కేసీఆర్ పట్టించుకోలేదు.కొంతమందికి నామినేటెడ్ పదవులు, మరికొందరికి పార్టీ పదవులు కట్టబెట్టి అసంతృప్తులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. అయినా ఎక్కడో చోట టీఆర్‌ఎస్‌పార్టీలో అసంతృప్తి సెగలు రేగుతూనే ఉన్నాయి. ఉమ్మడి రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో ఒకరిద్దరు కార్యకర్తలు ఆత్మహత్య చేసుకున్నారు. తీగల కృష్ణారెడ్డిపైనే తిట్లదండకం అందుకున్న సంఘటన ఉన్నాయి. అదేవిధంగా టీఆర్‌ఎస్‌పార్టీలో చేరిన నేతలతో మొదట్నుంచి ఉన్న నేతలకు పొసగడం లేదు. వచ్చే ఎన్నికల్లో తమకు టికెట్లు రావన్న భయం వారిని వెంటాడుతున్నది.

నియోజకవర్గాల సీట్లు పెరిగే అవకాశం లేకపోవడంతో 30 నుంచి 40 మంది సిట్టింగులను తప్పిస్తారన్న ప్రచారం జోరందుకున్నది. చాలాచోట్ల ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు సమన్వయం లేదు. నిజామాబాద్ రూరల్, మునుగోడు వంటి చోట్ల విభేదాలు రచ్చకెక్కాయి. మరికొన్నిచోట్ల సిట్టింగులను తప్పించి ఎంపీలకు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి టికెట్లు ఇవ్వడానికి కేసీఆర్ సిద్ధమయ్యారని తెలిసింది. ఈ నేపథ్యంలో నిజామాబాద్ రూరల్‌లో ఎమ్మెల్సీ భూపతిరెడ్డిపై వేటు వేయాలని సీఎం కేసీఆర్‌కు ఆ జిల్లా ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందించారు. అది పెండింగ్‌లో ఉండగానే మంత్రులు, ఎమ్మెల్యేలు బహిరంగ ప్రకటనలు చేస్తుండడం కేసీఆర్‌ను, టీఆర్‌ఎస్‌పార్టీని కలవరపెట్టిస్తున్నది. కేసీఆర్ నుండి కారు స్టీరింగ్ అదుపుతప్పిందా అన్న ప్రచారం జరుగుతున్నది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో తనను తప్పించి మాధవరెడ్డికి గానీ, గుత్తా సుఖేందర్‌రెడ్డికి గానీ, ఎర్రబెల్లి దయాకర్‌రావుకు గానీ కట్టబెడతారని ప్రచారం జరుగుతుండడంతో నాయిని ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. పార్టీలోనూ, జిల్లాలోనూ ప్రాధాన్యత తగ్గిస్తున్నరని శ్రీనివాస్‌గౌడ్ ఎప్పట్నుంచో చెబుతూనే ఉన్నారు. వీటిని కట్టడి చేస్తూ నేతలను సముదాయించకుంటే చేయి దాటిపోయి ప్రమాదం ఉందని సీఎం కేసీఆర్‌కు పలువురు నేతలు సూచిస్తున్నారు.

బాల్కసుమన్‌పై కేసీఆర్ సీరియస్ !

విద్యుత్ ఒప్పందాలు, కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం వైఖరిని చెప్పాల్సిందిపోయి, టీఆర్‌ఎస్ పార్టీని, ప్రభుత్వాన్ని ఇరకాటంలో నెట్టేలా ప్రతిపక్షాలకు అస్త్రాలు ఇచ్చారంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంపీ బాల్కసుమన్‌పై మండిపడ్డారని తెలిసింది. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై సుమన్ తొందరపడి సవాల్ విసరడాన్ని కేసీఆర్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. వెంటనే సుమన్‌ను పిలిపించి నోరు అదుపులో పెట్టుకోవాలని తీవ్రంగా మందలించినట్టు ప్రచారం జరుగుతున్నది. అంతేగాకుండా మిగతా వారికి పరోక్షంగా సీఎం హెచ్చరిక సంకేతాలు పంపినట్లు సమాచారం. దీంతో శనివారం నాటి ప్రెస్‌మీట్‌ను సుమన్ రద్దు చేసుకున్నారు.

చర్మవ్యాధికి డీఆర్‌డీఓ మందు తయారీ

'లూకోస్కిన్' ఔషధ కొనుగోలుకు అంతర్జాతీయంగా కంపెనీల ఆసక్తి



న్యూఢిల్లీ : డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు తయారుచేసిన ఆయుర్వేద ఔషధం 'లూకోస్కిన్' కొనుగోలుకు అంతర్జాతీయ ఔషధ కంపెనీలు పెద్ద ఎత్తున ఆసక్తి చూపాయి. న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన 'అంతర్జాతీయ ఆరోగ్య ఫెస్టివల్ 2017' ఉత్సవాల్లో 'లూకోస్కిన్' గురించి వివిధ దేశాల ఔషధ కంపెనీలకు డీఆర్‌డీఓ చూపింది. బొల్లి, తెల్లమచ్చలు వంటి చర్మవ్యాధుల్ని నయం చేస్తుందని...తాము తయారుచేసిన ఆయుర్వేద ఔషధం గురించి డీఆర్‌డీఓ తెలిపింది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసిన 'ఆరోగ్య ఫెస్టివల్'లో పలు హెర్బల్ ఉత్పత్తుల్ని ప్రదర్శనకు ఉంచారు. దేశ, విదేశీ ఔషధ కంపెనీల ప్రతినిధులు ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్మసంబంధ వ్యాధులపై డీఆర్‌డీఓ తయారుచేసిన ఆయుర్వేద ఔషధాన్ని కొనుగోలు చేయడానికి పెద్ద ఎత్తున ఆసక్తి వెల్లడైంది.

తెల్లమచ్చలు, బొల్లి (వైద్యపరిభాషలో 'విటిలిగో') చర్మ సంబంధ సమస్యలతో బాధపడుతున్నవారు ప్రపంచవ్యాప్తంగా 1 నుంచి 2 శాతం మంది ప్రజలు ఉన్నారు. భారత్‌లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. ఇక్కడ 4 నుంచి 5 శాతం మంది చర్మరోగులు ఉన్నారు. అందునా రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో ఈ సమస్య అధికంగా..5 నుంచి 8 శాతం ఉంది. దీని గురించి చర్మరోగ నిపుణులు తెలియజేస్తూ, "మనుషుల చర్మం పొరల్లో 'మెలనిన్' అనే ప్రొటీన్ ఉంటుంది. దీనివల్లే శరీరానికి రంగు ఏర్పడుతుంది. దీనిపై మన శరీరంలోని రోగనిరోధక శక్తి దాడి చేయటంతో, 'మెలినిన్' తగ్గిపోతుంది. క్రమక్రమంగా ఇది విస్తరించి చర్మవ్యాధికి దారితీస్తుంది. ప్రస్తుతం దీనిని నయం చేయడానికి ఎన్నో రకాల అల్లోపతి మందుల అందుబాటులో ఉన్నప్పటికీ, అవి తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే ఇవ్వగలుగుతున్నాయి. దీంతో ఆయుర్వేద మందుల వైపు ఔషధ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి" అని చెప్పారు.

గుజరాత్‌లోని ఓ ఆధ్యాత్మిక శిబిరంలో భారీ అగ్ని ప్రమాదం

ముగ్గురు యువతులు మృతి, 15 మందికి గాయాలు

రాజ్‌కోట్ : గుజరాత్‌లోని ప్రన్సలా గ్రామంలోని స్వామి ధర్మబంధు నిర్వహిస్తున్న ఒక ఆధ్యాత్మిక శిబిరంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఘటనలో ముగ్గురు యువతులు మృతి చెందగా, 15 మంది గాయపడినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక దళాలు తీవ్రంగా కృషి చేశాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. మంటలు మహిళల శిబిరంలోకి వ్యాపించడంతో వారు మృతి చెందారని జిల్లా కలెక్టర్ విక్రాంత్ పాండే అన్నారు. ఈ ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణం కావచ్చునని, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఈ శిబిరాన్ని స్వామి ధర్మబంధు గత 20 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ఈ నెలలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, ముఖ్యమంత్రి విజయ్‌రూపానీ కూడా ఈ శిబిరానికి వచ్చారు. ఈ ఘటనపై విచారణ జరిపి, వెంటనే నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి విజయ్‌రూపాని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 4 లక్షల పరిహారం ప్రకటించారు.

బురఖా వేసుకున్నందుకు విద్యార్థినిపై దాడి

కెనడాలో దారుణం


(ఫైల్)

ఒట్టావా, కెనడా : బురఖా ధరించినందుకు పాఠశాలకు వెళ్ళే విద్యార్థినిపై దాడి జరిగిన సంఘటన కెనడాలో చోటు చేసుకుంది. టొరంటోలో శుక్రవారం బురఖా వేసుకుని వెళుతున్న విద్యార్థిని (11)పై ఒక వ్యక్తి దాడి చేశాడని పోలీసులు తెలిపారు. కత్తెరతో ఆమె బురఖా చించివేసేందుకు ఆ వ్యక్తి రెండుసార్లు ప్రయత్నించాడని, ఆ తర్వాత పారిపోయాడని చెప్పారు. తన తమ్ముడితో కలిసి స్కూలుకు వెళుతుండగా ఆ వ్యక్తి కత్తెరతో తన ముఖంపై గల బురఖాను లాగేందుకు యత్నించాడని, తాను చాలా భయపడ్డానని, ఏం జరుగుతుందో తెలియని అయోమయంలో పడ్డానని తెలిపింది. తలపై నల్ల టోపీతో, కళ్ళద్దాలతో వున్న ఆ వ్యక్తి ఆసియన్ జాతీయుడని, దాదాపు ఆరడుగులు వున్నాడని పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆ వ్యక్తి అంతలా మీదకు వస్తున్నా ఒక్కరు కూడా అడ్డగించడానికి ముందుకు రాలేదని కానిస్టేబుల్ జెనిఫర్జిత్ సిదూ పత్రికా సమావేశంలో తెలిపారు. ఆ బాలిక తన తమ్ముడితో కలిసి అరుస్తూ అక్కడ నుండి పారిపోయిందన్నారు. మొదటిసారి దాడి జరిగిన పది నిముషాల తర్వాత మరోసారి ఆ వ్యక్తి మళ్ళీ అదే విధంగా దాడికి యత్నించాడు. ఇది పిరికిపంద చర్య తప్ప మరొకటి కాదని ఓంటారియో ప్రధాని ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు.

సౌదీలో మొదటిసారిగా

పురుషుల ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షించిన మహిళలు


(ఫైల్)

జెడ్డా : పురుషుల ఫుట్‌బాల్ క్రీడ తిలకించడానికి మొట్టమొదటి సారిగా సౌదీ అరేబియాలోని మహిళలను అనుమతించారు. దీంతో నలుపు రంగు వస్త్రధారణ, ఫ్లోరెసెంట్ నారింజ దుస్తులు ధరించిన మహిళలు శనివారం రాజు అబ్దుల్లా స్టేడియంలోని గేట్లు వద్ద నిలబడి మ్యాచ్‌ను వీక్షించారు. అల్-అహ్లీ, అల్-బాటిన్ జట్ల మధ్య జరుగుతున్న ఈ పోటీలకు మహిళలు వారి భర్తలతో, పిల్లలతో, మిత్రులతో కలిసి వీక్షించారు. జెడ్డాలోని డమ్మామ్, రియాద్ స్టేడియాలను 2018 లో ప్రారంభించి కుటుంబాలను ఆహ్వానిస్తామని గత అక్టోబర్‌లోనే జనరల్ స్పోర్ట్స్ అథారిటీ ప్రకటించింది. ఈ నిర్ణయం చాలా కాలం క్రితమే జరిగిఉండాల్సిందని ఈ క్రీడకు హాజరైన వారిలో ఒకరు పేర్కొన్నారు.

బహిరంగ క్రీడా కార్యక్రమంలో మహిళలు పాల్గొనడానికి అనుమతించే నిర్ణయంతో దేశంలో మంచి మార్పును తెస్తుందని ఆశిస్తున్నారు.. కొన్ని నెలల క్రితం మహిళలు కారు నడిపే హక్కును సౌదీ అరేబియా ప్రకటించిన అనంతరం గురువారం వారి కోసం మొట్టమొదటి కారు ప్రదర్శన ఏర్పాటు చేశారు.

జోష్
నవతెలంగాణ

వలపు నానీలు

తానలా
కదిలిపోతోంది,
దారంతా
సీతాకోక చిలుకలు జల్లుతూ!

అక్షరాలు తీయగా
మూల్గుతున్నాయి,
నిన్ను వర్ణించిన
అలసటతో!

చినుకు పాదాలతో
మెత్తగా వచ్చి,
గుండెలోతులో
తడి నింపి వెళ్లావు!

తనువు
నిదురపోయినా,
హృదయం నీకోసం
అడుగులేస్తూనే ఉంటుంది!

పగలే
చీకటిని కప్పుకున్నా
కలలో వచ్చే
వెలుగులాంటి నీకోసం!

మట్టిలోకింకినా
ఆవిరైపోయినా,
నిన్ను కరిగించడానికే
కురుస్తుంటా!

– పుట్టి గిరిధర్,
9491493170





జీవన సూత్రం

దైనందిన జీవితంలో కమ్యూనికేషన్ అనేది చాలా ముఖ్యం. ఈ అంశంపై చాలాసార్లు అనేక సందర్భాల్లో మాట్లాడుకుంటూనే ఉన్నాం. అయినా ప్రతిసారీ దీన్ని అనేక కోణాల్లో విశ్లేషించుకోవడం ఎంతైనా అవసరం. కమ్యూనికేషన్ సూత్రం అందరికీ ఒక్కటే. చిన్నాపెద్దా తేడా లేదు. సమాచారలోపం ఎవరికైనా శాపంగా మారొచ్చు. పరస్పరంగా కమ్యూనికేషన్ కలిగి ఉంటేనే జీవితాలు సుఖదాయకంగా సాగుతాయి. ముఖ్యంగా యువత ఈ విషయాన్ని ఎన్నటికీ మరువొద్దు.

సమాచారలోపమనేది సమాజంలోని అన్ని వ్యవస్థలనూ అవస్థల పాల్జేస్తుంది. ఎలాంటి బిడియం లేకుండా అభిప్రాయాలను వెల్లడించే పద్ధతి మొదట కుటుంబం నుంచే ప్రారంభం కావాలి. తల్లిదండ్రులు, బిడ్డల మధ్య ఇదెంతో అవసరం. తామేమి కోరుకుంటున్నామో తల్లిదండ్రులకు నిర్మొహమాటంగా పిల్లలు చెప్పేయాలి. అయితే.. ఆ సమయంలో కుటుంబ వాస్తవ పరిస్థితులను పరిగణనలో తీసుకోవడం కూడా ముఖ్యం. తల్లిదండ్రులు కూడా పిల్లల అవసరాలను నిండు మనసుతో అర్థం చేసుకోవాలి. ఆ అవసరాలను తాము ఏమాత్రం తీర్చగలమో, ఎంతవరకు వాటిని అందించగలమో అర్థమయ్యేలా చెప్పగలగాలి. ఒకరినొకరు అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తేనే అన్ని సమస్యలకూ పరిష్కారం



లభిస్తుంది. అర్థవంతమైన వాతావరణాన్ని ఆవిష్కరించాలంటే మనసు విప్పి మాట్లాడాలి. ప్రత్యక్షంగా కూర్చుని పరిశుద్ధమైన మనసుతో చర్చించాలి. ఎలాంటి భావావేశాలకు ఎవరూ లోనుకావద్దు. ఎంతబాగా కమ్యూనికేట్ చేయగలిగితే అంతబాగా సంబంధాలు బలపడతాయి. వ్యక్తిగత జీవితంలోనే కాదు.. వృత్తి పరంగానూ కమ్యూనికేషన్ స్కిల్స్ అనేవి చాలా ముఖ్యం.

ఒక వ్యక్తి సామాజిక స్పృహ అలవర్చుకున్నప్పుడు, అతను ఈ సమాజాన్ని అర్థం చేసుకున్నప్పుడు, ఈ సమాజంలో ఉన్న పరిస్థితులు సరైనవి కావని భావించినప్పుడు తన ఆలోచన్లకు పదును పెడతాడు. ప్రజలనూ, సమాజాన్నీ కమ్యూనికేట్ చేస్తాడు. ఆ ఆలోచన్లు ఆచరణలో అమలైతే ఒక మార్పునకూ, విప్లవానికీ దారితీయొచ్చు.

కమ్యూనికేషన్ అనేది ఇలాగే ఉండాలని స్థిరీకరించే ఒక సబ్జెక్టు కాదు. ఇట్లే ఉంటుందని ఓ అంచనాకో, అవగాహనకో రాలేం. తమ తమ సృజనాత్మకనుబట్టి, పనిస్తున్న రంగాన్నిబట్టి, పరిస్థితినిబట్టి, విషయాన్నిబట్టి ప్రభావితం చేసే అంశాల్నిబట్టి, ఎవరికివారు ఎలా కమ్యూనికేట్ చేయాలో ఆలోచించుకొని ఆచరించగలగాలి. తమకు కావాల్సిన కమ్యూనికేషన్‌ని ఎవరికి వారు అలవర్చుకోవాలి.

అదీ ఇదీ అనే కాదు.. సమాజంలోని ప్రతి రంగంలోనూ సమాచారం లోపం జాడ్యం ఉంది. ఉద్యోగం కావచ్చు, వ్యాపారం కావచ్చు, మరేదైనా వృత్తి కావచ్చు, రాజకీయాలు కావచ్చు. మార్పును కోరుకునే వారు, కొత్త అవకాశాలు అందుకోవాలనుకునే వారు నిర్మొహమాటంగా మనసులో మాటను బయటపెడితేనే మంచిది. లేదంటే అవకాశాలు ఎన్నటికీ రావు. ప్రేమ విషయంలోనూ అంతే. మనకు నచ్చిన వ్యక్తికి ప్రేమ వ్యక్తపర్చడంలో ఎలాంటి దాపరికం ఉండొద్దు. మనసులో ఉన్నది చెప్పకపోతే ప్రేమ వ్యవహారం 'వన్‌సైడ్' గానే ఉండిపోతుంది.

మనసులో మనమేం అనుకుంటున్నామో అవతలి వారికి కచ్చితంగా తెలిజేయాలి. ఆఫీసులో బాస్ తిడుతున్నప్పుడో.. మరొక సమయంలోనో అయితే మనం మనసులో ఏం అనుకుంటున్నామో తెలియనక్కరలేదు. మిగిలిన అన్ని సమయాల్లో మాత్రం మనసులో మనమేం అనుకుంటున్నామో అది తప్పనిసరిగా ఎదుటి వ్యక్తికి తెలియాలి. లేదంటే అభిప్రాయ భేదాలు వస్తాయి.

కమ్యూనికేషన్ గ్యాప్ అనేది మానవ వికాసానికి అవరోధంగా మారుతుందనే విషయాన్ని మరచి పోవద్దు. భవిష్యత్తు అగాధంలోకి పడేందుకు ఇది ప్రాధాన పాత్ర పోషిస్తుంది. అనవసరమైన భయాలు, అలసత్వం, దూరదృష్టి లేకపోవడం, కాలంతోపాటు వేగంగా పరిగెత్తలేకపోవడం, ముఖ్యంగా విజ్ఞాన లోపం కమ్యూనికేషన్ గ్యాప్‌కు కారణాలవుతున్నాయి. దీనిని ఎవరికి వారే గుర్తించి సరిచేసుకోవాలి. మనలో కమ్యూనికేషన్‌గ్యాప్ ఉందని గ్రహించగానే ఈ సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలి. అవసరమైతే ఇందుకు ఇతరుల సలహాలు, సూచనలు స్వీకరించాలి.

మజాక్

ఓపెన్ చాలెంజ్




పింకి: నీకు ఇంగ్లిష్ వచ్చా?
వెంకి: వచ్చు..
పింకి: అన్ని పదాలకూ అర్థాలు చెప్పగలవా?
వెంకి: కచ్చితంగా చెప్పగలను...
పింకి: అయితే.. జిలేబీని, అప్పడాన్ని ఇంగ్లిష్‌లో ఏమంటారో చెప్పు..
వెంకి: ...???!!!

డిజిటల్ కోపం



'నా గర్ల్‌ఫ్రెండ్ నాపై డిజిటల్ కోపం ప్రదర్శిస్తోంది' ఆవేదన వ్యక్తం చేశాడు కుమార్.
'డిజిటల్ కోపమా.. అదెలా?' ఆశ్చర్యంగా అడిగాడు ఉమర్.
'ఆన్‌లైన్‌లో చాటింగ్ చేయడానికి నేను ప్రయత్నించగానే ఆమె ఆఫ్‌లైన్ అయిపోతోంది..' నిట్టూర్చాడు కుమార్.



ఓ అబ్బాయి ఆవేదన

నేను ఆమెను 2జీ స్పీడ్‌తో మెల్లమెల్లగా ప్రేమను వ్యక్తపర్చాను.
ఆమె 3జీ స్పీడ్‌తో రియాక్ట్ అయ్యింది.
4జీ స్పీడ్‌తో ఓ షాకింగ్ విషయం చెప్పింది–
ఆల్రేడి తానో అబ్బాయిని ప్రేమిస్తున్నానని.

ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి...

- **వి**జయం పొందిన వారిని చూసి జేజేలు పలికితే సరిపోదు. వారి బాటలో నడవాలి. ఆ దారిలో ఒక్కో అడుగూ ఒక పాఠం లాంటిది. ఒక్కో మలుపూ ఒక్కో సూత్రం. వేర్వేరు రంగాల్లో, వేర్వేరు ఉద్యోగాల్లో, స్థితిగతుల్లో ఉన్న యువతీయువకులందరూ ఈ విజేతల నుంచి నేర్చుకోవాల్సింది ఒక్కటే. అది.. ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగాలనే తపన. ప్రేరణ, పట్టుదల, సకారాత్మక ఆలోచన విధానం, వైఫల్యాలకు నిరాశపడకపోవడం, కొంచెం సాధించగానే సంతృప్తి పడక పోవడం... ఇలా ఎన్నో చక్కని లక్షణాలు విజేతల వెనుక చోదక శక్తిగా ఉంటాయి. వీటిలో అన్ని, లేదా కొన్ని కొందరిలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. వారిని ముందుకు నడుపుతాయి. మనం గమనించాల్సింది ఆ లక్షణాలనే.
- సాధించిన దానికి సంతృప్తిని పొంది అదే విజయమనుకుంటే పొరపాటు. ఉన్నదాంతో సమాధానపడిపోతే కాలం గడిచిపోతుంది. పైకి లోపమేదీ ఉండకపోవచ్చు. కానీ విజయంలోని మజా దూరమవుతుంది. ఎవరైనా ఉత్తమ స్థితికేసి దృష్టి సారిస్తేనే అద్భుత ఫలితాలు అందుకుంటారు.
- వాహనం నడవాలంటే ఇంధనం కావాలి. మనిషి ఎదగాలంటే ప్రేరణ కావాలి. విజయ పథంవైపు నడిపించే లక్షణాల్లో ఉత్తమమైన ఆశయం కూడా ఒకటి. అదే చోదక శక్తిగా మారి మార్గాన్ని నిర్దేశిస్తుంది. దాన్ని మనసులో ముద్రించుకున్నవారు మాత్రమే విజయాల దిశగా అడుగులు వేస్తారు.
- అనుకున్న పనిని పూర్తి చేసే వరకూ నిద్రపోని మనస్తత్వం విజేతల సొంతం. దీని కోసం ఇష్టాలను వదులుకుంటారు. కష్టాలకు ఎదురెళ్తారు. ఇందులో పేదా గొప్ప తారతమ్యాలుండవు. స్థాయి, హోదాలు కానరావు. ఐఏఎస్ కూతురుకైనా, వాచ్‌మన్ కొడుకుకైనా అందరిదీ ఒకే పంథా ఉంటుంది.



- జీవితంలో ఎదగాలనుకునే వారికి ఒక లక్ష్యం చాలదు. ఒక దాని తర్వాత మరో లక్ష్యం పెట్టుకుంటూ ముందుకు సాగుతారు. అదే వారికి విజయ సోపానమై ఉన్నత స్థితికి చేరుస్తుంది.
- సమాజంలో పరస్పర సహకారం లేనిదే ఏదీ సాధ్యం కాదు. ఇది గ్రహించిన వారు ఇతరుల నుంచి సూచనలు అందుకుంటూ తమని తాము తీర్చిదిద్దుకుంటారు. ఇతరుల నుంచి ప్రోత్సాహం పొందాలంటే వారిలోని గొప్పదనాన్ని గ్రహించాలి. మనసు తలుపులు తెరిస్తే నలుదిశలా సహకారమే.
- ఉన్నత స్థానంలో నిలిచినవాళ్లను చూసి ఆశ్చర్యపోవడం సామాన్యుల వంతు. ఆ స్ఫూర్తిని పుణికి పుచ్చుకొని వారి సరసన చేరడం విజేతల లక్షణం. ఆ స్ఫూర్తే సంకల్పంగా మారుతుంది.
- మొదట ఏం సాధించాలనుకుంటున్నామో నిర్ణయించుకోవాలి. తర్వాత దానికి అనుగుణంగా ప్రణాళిక వేసుకోవాలి. లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాక అనుక్షణం దాన్ని గుర్తు తెచ్చుకోవాలి. ప్రణాళికను అమల్లో పెట్టాలి.
- మనసు విభిన్న ఆలోచనల పుట్ట. ప్రతికూల ఆలోచనలను అది ఎప్పుడూ ముందుకు తెస్తుంటుంది. వాటిని దూరం చేసుకుంటేనే విజయం. పల్లెటూరి వాడిననో, ఇంగ్లిషు రాదనో, కష్టపడినా ఫలితం ఉండదనో లాంటి ఆలోచనలకు లొంగకూడదు.

ప్రేమను గుర్తించడమెలా..?



- **ప్రే**మికులుగా మారాలంటే తప్పనిసరిగా ఆలోచనను నాటడం అనే కళ తెలిసి ఉండాలి. అందుకు తొలి అస్త్రం చూపు. అలాగని కళ్లలోకి సూటిగా చూడాల్సిన పని లేదు. నేల చూపులతో కూడా అమ్మాయిని ఆకర్షించవచ్చు!
- ఆమెవి అందమైన కళ్లు. కానీ ఆ చూపులకు అర్థం చెప్పడం కష్టం. ఆ చూపులు ఎలా ఉన్నా వాటిని ప్రేమగా మలుచుకోవడం అబ్బాయి సామర్థ్యానికి నిదర్శనం.
- ఆమె చూపులు మిమ్మల్ని వెంటాడేలా చేసుకోవడమే కాదు, ఆమె ఆలోచనలు మీ గురించి వేటాడేలా చేసుకోవాలి కూడా.
- అమ్మాయి చూపుల్లో అమాయకత్వం అనే కోణాన్ని కూడా చూడగలం. కానీ అబ్బాయిల చూపుల్లో అపార్థాలే కనిపిస్తాయి. కాబట్టి చాలా జాగ్రత్త వహించడం మంచిది.
- మీరేంటో అమ్మాయి కి అర్థమవ్వాలి. మీలోని అందాలను ఆమె గుర్తించాలి. మీలోని తెలియని విషయాలను తెలుసుకోవాలనే ఉత్సుకత కలిగించాలి.
- మీరు ఆమె గురించి ఎంతగా పడిచస్తున్నారో మొదట్లోనే చెప్పేయడం, మీరేంటో వందశాతం ఆమెకు అర్థమయ్యేలా చేసేయడం, వెనువెంటనే ఆమెకు ప్రేమిస్తున్నట్టు చెప్పేసి 'నో' చెప్పించేసుకోవడం... ఇలా చేస్తే చేజేతులారా ప్రేమకథకుక్లైమాక్స్ రాసుకోవడమే! అందుకే... మీరు ఎంపిక చేసుకున్న అమ్మాయి మీకు ఎంత చేరువలో ఉందో తెలుసుకొనే వరకూ మాటల్ని, మనసులోని ఊసుల్ని పొదుపుగా వాడటమే మంచిది.
- స్నేహం లేకుండా నేరుగా ప్రేమపై గురిపెడితే లక్ష్యం తప్పే అవకాశాలే ఎక్కువ. ముందు చేయి కలపండి. తర్వాత మనసు అదే కలుస్తుంది. నిజానికి స్నేహంతో అమ్మాయి మానసిక స్థితి దాదాపు అర్థమైపోవచ్చు.
- అలాగే అమ్మాయిలకూ కొన్ని జాగ్రత్తలు అవసరం. మీ ప్రియుడు మిమ్మల్ని మనసారా ప్రేమిస్తున్నాడనడానికి ప్రామాణికం.. అతడు పదే పదే మీకు 'ఐ లవ్ యూ' చెప్పడం కాదు. మీ పట్ల అతడు ఏ మేరకు శ్రద్ధ కనబరుస్తున్నాడో తెలుసుకోవడం ముఖ్యం.
- తన ముఖ్యమైన పనులను కూడా పక్కన పెట్టి మీపై శ్రద్ధ చూపిస్తున్నట్లయితే అతను మిమ్మల్ని నిజంగానే ప్రేమిస్తున్నట్టే.
- మీకు సంతోషం కలిగించే విషయాలు, వస్తువులను అతడు అకస్మాత్తుగా మీ ముందు ఉంచితే తను మిమ్మల్ని ప్రేమిస్తున్నాడని అర్థం.
- బహుమతులు అందచేయడం, ప్రత్యేక కారణం ఏదీ లేకపోయినప్పటికీ మీకు నచ్చిన కొన్ని విషయాల్లో శ్రద్ధ చూపడం లాంటివి చేస్తే అతనికి మీరంటే ఇష్టమని తెలుసుకోండి. మీ ఇద్దరి మధ్య జరిగే సంభాషణ సందర్భంగా అతడు మీ అభిప్రాయాలను గౌరవిస్తే అతడి మిమ్మల్ని ప్రేమిస్తున్నట్టే.

ఇట్లుంటేనే నిజమైన దోస్తానా

- ✓ **ప**ది కాలాలపాటు స్నేహం పదిలంగా ఉండాలంటే నమ్మకమే కీలకం. స్నేహంలో అవతలివారి భావాలను ఎంతమేరకు పట్టించుకుంటున్నా మన్నదే ముఖ్యం. అప్పుడే చెలిమి శాశ్వతంగా ఉంటుంది.
- ✓ స్నేహమంటే సరదాలూ షికార్లే కాదు.. అభిప్రాయాలు, అభిరుచులూ కలవడం కూడా. అంతకు మించి ఒకరికొకరు కష్టంలోనూ సాయపడటం... ఒకరి మీద ఒకరు నమ్మకం కలిగి ఉండటం. ఒకవేళ మీ స్నేహంలో అవి లోపిస్తే కారణమేమిటో ఒక్కసారి పరిశీలించు కోండి. మీలోనే ఏదైనా లోపం ఉందనుకుంటే దాన్ని సరిచేసుకోండి.
- ✓ అవతలివారిలో మార్చు కోవాల్సిన అంశాలు ఏవైనా ఉన్నప్పుడు ఫ్రెండ్‌గా మీ వంతు ప్రయత్నించండి.
- ✓ స్నేహంలో రహస్యాలు పంచుకోవడం, . మనసు విప్పి మాట్లాడుకోవడం సహజం. ఎవరి మధ్య ఈ చర్చలు సాగాయో అవి అక్కడే ఉండిపోతే బాగుంటుంది. అలాకాకుండా సరదాగైనా కోపంతోనైనా వాటిని ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు చేయడం మంచిదికాదు. వాటిని ఏ పరిస్థి తుల్లోనూ మూడో వ్యక్తితో పంచుకోకపో వడమే మంచిది.
- ✓ మీ ఆలోచనలు, అభిప్రాయాలను ఎదుటి వారి మీద రుద్దే ప్రయత్నం చేయొద్దు.
- ✓ అవతలివారి ఇష్టా యిష్టాలనూ గమనించండి... గౌరవించండి.



- ✓ వ్యక్తిగత విషయాల్లో చొరబడి చేసే వ్యాఖ్యలూ, హాస్యం అవతలివారిని ఇబ్బంది పెడతాయి. ఒకవేళ అలాంటి తప్పు చేస్తే క్షమించమని అడగడానికి వెనకాడకండి. అప్పుడే మీ స్నేహం కలకాలం నిలుస్తుంది.

నిరుత్సాహం.. నిరుపయోగం



- ➤ **జీ**వితం సరదాగా గడవాలంటే తోటి విద్యార్థుల తోనూ, కుటుంబసభ్యుల తోనూ, బంధువుల తోనూ, ఇరుగు పొరుగువారితోనూ, ఆఫీసులోని కొలీగ్స్‌తోనూ అనుబంధాలు పెంచుకోవాలి. వారి అభిమానాన్ని, ఆదరణనూ పొందాలి. అందుకు తగిన విధంగా ప్రవర్తించాలి.
- ➤ అసూయను, అహంభావాన్ని ఆధిక్యతనూ తోటి వారి ముందు ప్రదర్శించకూడదు. బడాయి కబుర్లు చెబుతూ ఫాల్స్ ప్రిస్టేజిని పెంచుకోవద్దు. తామిచ్చిన మాటను నిలబెట్టుకోలేక అవతలవారి ముందు తేలికయిపోయి తలదించుకోకూడదు.
- ➤ ఎవరైనా మన సహాయాన్ని ఆశించినప్పుడు దాన్ని మనం చేయలేకపోతే నిజాయితీగానూ, సున్నితంగానూ ఆ విషయాన్ని అవతల వారికి తెలియ జేయాలి.
- ➤ ప్రతివారికీ సమస్యలుంటాయి. ఆఫీసులో, ఇంట్లో, చుట్టు పక్కల వారితో. అయితే ఆ సమస్యలను ఎవరికి వారే పరిష్కరించు కోవాలి. తమ సమస్యల చికాకులు, విసుగును ఇతరుల మీద ప్రదర్శించకూడదు. మన సమస్యలను, బాధలను ఎదుటివారికి పంచడం, నిరుత్సాహంగా మాట్లాడటంకంటే నవ్వుతూ, సరదాగా మాట్లాడే వారితో ఎవరైనా చక్కగా కలిసిపోతారు.

మీరూ రాయొచ్చు

హాయ్ ఫ్రెండ్స్. ఈ పేజీకి మీరేదైనా రాయాలనుకుంటున్నారా.. అయితే ఆలస్యం దేనికి? కలం పట్టండి. ముఖ్యమైన ఈవెంట్స్, సక్సెస్ స్టోరీలు, సమాజ శ్రేయస్సు కోసం చేపడుతున్న కార్యక్రమాలు.. ఇలా యూత్‌కు సంబంధించి సమాచారం ఏదైనా మాకు పంపండి.

మా అడ్రస్ : జోష్ పేజీ, నవ తెలంగాణ తెలుగు దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి కళ్యాణ మండపం వీధి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500020.
e-mail : josh@navatelangana.com

విదేశీ పరిస్థితులు, ఇక్కడ మెరుగైన రికార్డు కాకుండా తాజా ఫామ్ ఆధారంగానే రోహిత్ శర్మను తుది జట్టులోకి తీసుకున్నాం - రహానెను పక్కనపెట్టడంపై కోహ్లి వ్యాఖ్యలు

తాజా ఫామ్‌తో సంబంధం లేకుండా పిచ్ స్వభావం, పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఇషాంత్ శర్మను ఆడిస్తున్నాం - భువనేశ్వర్‌ను బెంచ్‌కు పరిమితం చేస్తూ కోహ్లి మాటలు

మాజీ నాయకుడు మహేంద్రసింగ్ ధోని మైదానంలో వినూత్న మార్పులతో అందరినీ ఆశ్చర్యానికి గురిచేసేవాడు. కానీ ప్రస్తుత సేనాని విరాట్ కోహ్లి ఏకంగా తుది జట్టు కూర్పుతోనే విస్మయానికి గురిచేస్తున్నాడు. తర్కానికి అందని తుది జట్టు ఎంపికతో తికమక పెడుతున్న విరాట్ కోహ్లి వ్యూహ చతురత ఏమిటో అంతుపట్టడం లేదు. అసలు కోహ్లి ఏం చేయాలనుకుంటున్నాడు?


కోహ్లి ఇదేం వ్యూహం?

తర్కం లేని తుది జట్టు కూర్పు

విమర్శలకు తావిస్తోన్న నిర్ణయాలు

శ్రీనివాస్ దాస్ మంతటి

సెంచూరియన్‌లో రెండో టెస్టు టాస్ సమయం. అందరి దృష్టి టీమ్ ఇండియా తుది జట్టు కూర్పుపైనే నెలకొన్నది. ఎందుకంటే కేప్‌టౌన్‌లో కోహ్లి చేసిన సెలక్షన్ తప్పిదాలు భారత్‌కు విజయాన్ని దూరం చేశాయి. దీంతో రెండో సారైనా మెరుగైన బృందాన్ని బరిలోకి దింపుతాడా? లేదా? అని ఆసక్తి నెలకొన్నది. టాస్ ఓడిన కోహ్లి.. జట్టులో మూడు మార్పులు చేసినట్టు ప్రకటించాడు. దీంతో ఆ మూడు మార్పుల్లో అజింక్య రహానె ఎంపిక ఒకటి కాబోలు అనే ఆశ, ఆసక్తి అందరిలోనూ కనిపించింది. కానీ విరాట్ విచిత్రంగా రహానె లేని మార్పులను ప్రకటించాడు. వాటిలో తొలి రెండు ఓపెనర్‌గా శిఖర్ ధావన్ స్థానంలో కెఎల్ రాహుల్, వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా స్థానంలో పార్థీవ్ పటేల్‌లను తీసుకోవటం. ఇక మూడోవది స్వింగ్‌స్టార్ భువనేశ్వర్ కుమార్‌ను పక్కనపెట్టి ఇషాంత్ శర్మను ఎంపిక చేయటం. అసలు అజింక్య రహానె లేకుండా రెండో టెస్టుకు సిద్ధం కావటమే జీర్ణించుకోలేని విషయమైతే.. కేప్‌టౌన్‌లో టీమ్ ఇండియా గెలిచేందుకు అవకాశాలు సృష్టించిన పేసర్‌ను పక్కనపెట్టడం ఒక్కసారిగా కోహ్లి కెప్టెన్సీపై విమర్శలు వెల్లువెత్తేందుకు కారణమైంది. రెండో టెస్టు ఆరంభంతో అసలు ఆట కంటే తుది జట్టు ఎంపికలో కోహ్లి చేసిన తప్పిదాలపై చర్చ సాగింది. దిగ్గజ క్రికెటర్లు, ప్రముఖ వ్యాఖ్యాతలు, క్రికెట్ విశ్లేషకులతో పాటు అభిమానులూ విరాట్ వ్యూహ చతురతపై విమర్శ బాణాలు సంధించారు.



ఎందుకింత మొండివైఖరి

కెప్టెన్‌గా విరాట్ కోహ్లి ఇప్పటివరకూ తిరుగులేని విజయాలు అందుకున్నాడు. ఉపఖండంలో టన్నుల కొద్దీ పరుగులు కొట్టిన కోహ్లి.. బ్యాట్స్‌మన్, కెప్టెన్‌గా సూపర్‌హిట్ కొట్టాడు. స్వదేశీ పరిస్థితుల్లో జట్టు సహచర సభ్యులు సైతం భీకర ఫామ్‌లో ఉండటంతో టీమ్ ఇండియాకు ఎదురులేకుండా పోయింది. వరుస సిరీస్ విజయాలు కోహ్లిసేనను వరల్డ్ నెం.1గా నిలిపాయి. అయితే, ఈ విజయాల తాలూకు గర్వం కోహ్లి తలకెక్కించుకున్నట్టే అనిపిస్తోంది!. క్రికెట్ జెంటిల్‌మెన్, దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే చీఫ్ కోచ్‌గా ఉన్న సమయంలో విరాట్ కోహ్లి వ్యవహార శైలిని ఇందుకు ఉదహరించవచ్చు. మైదానంలో ఆడేది మేము, గెలిచేది మేమే కనుక మా మాటే చెల్లుబాటు కావాలనే ధోరణి విరాట్‌లో వ్యక్తమైందని బీసీసీఐ పెద్దలు అప్పట్లో బాహాటంగానే అన్నారు. ఇక ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ సంఘటలను కొందరు ఇప్పుడు ఉటంకిస్తున్నారు. కోహ్లికి గాయమైన వేళ అతడి స్థానంలో రహానె నాయకత్వ పగ్గాలు అందుకున్నాడు. పేస్, బౌన్స్‌కు అనుకూలించే ధర్మశాలలో భారత్‌ను గెలుపు బాట పట్టించాడు. ధర్మశాలలో నాయకుడిగా రహానె మంచి మార్కులే కొట్టేశాడు. ఇక ఆ టెస్టులో కోహ్లి స్థానంలో బ్యాట్స్‌మన్‌నే తీసుకోవాలని అతడు

> టీమ్ ఇండియా తుది జట్టు ఎంపిక తీరు నాకు అంతుబట్టడం లేదు. ధావన్ ఎప్పుడూ బలిపీఠంపైనే ఉంటాడు. ఒక్క చెత్త ఇన్నింగ్స్ చాలు అతడిని జట్టులోకి తీసేయడానికి. ఇదేం వైఖరి. భువనేశ్వర్ స్థానంలో ఇషాంత్ శర్మను ఆడించటమా?. ఇషాంత్ కావాలంటే షమి, బుమ్రాలను పక్కపెట్టొచ్చు కదా. భువనేశ్వర్‌ను బెంచ్‌కు ఎలా పరిమితం చేస్తారు?'
>
> - సునీల్ గవాస్కర్

సూచించగా.. తాత్కాలిక కెప్టెన్ రహానెను ఒప్పించి కుల్దీప్ యాదవ్‌ను కుంబ్లే అరంగేట్రం గావించాడు. కెప్టెన్‌గా రహానె, స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ గొప్ప ప్రదర్శన చేశారు. కుంబ్లేతో విభేదాలకు బీజం పడింది ధర్మశాలలోనే టీమ్ ఇండియా డ్రెస్సింగ్‌రూమ్ వర్గాలు అప్పట్లో స్పష్టంగానే వెల్లడించాయి. ఇప్పుడు ఆ విషయాలు అన్నీ ఎందుకంటే... విరాట్ కోహ్లి వ్యక్తిగత స్వార్థం కోసం రహానెను ఉద్దేశపూర్వకంగానే తుది జట్టులోకి తీసుకోకపోవడానికి ఆ ఉదంతాన్ని పేర్కొనవచ్చు. ప్రస్తుతానికి ఇది అనుమానమే అయినా.. దీనిలో వాస్తవం లేకపోలేదని కొందరు అంటున్నారు. ఎందుకంటే రహానె టెస్టు బ్యాట్స్‌మన్‌గా ఘనాపాటీ. ప్రత్యేకించి విదేశీ పరిస్థితుల్లో అతడిని తలదన్నే మరో భారత బ్యాట్స్‌మన్ లేనే లేడు. అయితే పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో రహానె ప్రభావం చాలా తక్కువ. టెస్టు ప్రదర్శనతోనే రహానె మంచి బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందాడు. ప్రత్యేకించి విదేశాల్లో అతడికి ఘనమైన రికార్డు సొంతం. ఈ నేపథ్యంలో రహానె భవిష్యత్‌లో నాయకుడిగా తనకు పోటీ రాకూడదనే దురుద్దేశం కోహ్లిలో ఉదయించిందా? అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. టీమ్ ఇండియా టెస్టు జట్టుకు అజింక్య రహానె వైస్ కెప్టెన్ కావటం విమర్శలకు మరింత బలం చేకూరుస్తోంది. ఇదే సమయంలో విదేశీ పిచ్‌లపై బ్యాట్స్‌మన్‌గా పేలవం. టెస్టులను మినహాయిస్తే.. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో రహానె అసలు జట్టులోకి తీసుకోకపోయినా పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం కావు. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లి నైతికత ప్రశ్నార్థకమవుతోంది.

రహానె-రోహిత్ విషయంలో ఒకలా, భువనేశ్వర్-ఇషాంత్ అంశంలో మరోలా విరాట్ స్పందించాడు. జట్టుగా ఒక విధానాన్ని అనుసరిస్తే విమర్శలకు విలువ ఉండదు. కానీ తుది జట్టు ఎంపికలో ఒక్కో ఆటగాడికో పద్ధతి అమలు చేస్తున్నందువల్లే ఇప్పుడు తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. బహిరంగంగా ఇవీ వినిపించకపోయినా.. సోషల్ మీడియాలో మాత్రం స్వేచ్ఛగా వినిపిస్తున్నాయి. కేప్‌టౌన్‌లో కండ్లుచెదిరే ప్రదర్శనతో భువనేశ్వర్ భారత్‌కు గెలిచే అవకాశం సృష్టించాడు. పేసర్‌గానే కాదు లోయరార్డర్‌లో బ్యాట్స్‌మన్‌గా భువనేశ్వర్ కీలకమైన ఆటగాడు. అయినా, తాజా టెస్టులో చోటు దక్కలేదు. ఇక రహానె విషయంలో బాధపడుతున్నామని అగార్కర్ వంటి ఆటగాడు అసహనం వెల్లగక్కాడు. అసలు రహానెను తుది జట్టులో ఉండాలని ఎవ్వరూ కోరుకోలేదని, ఇప్పుడంతా ఉన్నట్టుండి అతడు జట్టులో ఉండాలని అంటుండటం ఆశ్చర్యానికి గురిచేసిందని మీడియాతో విరాట్ అనటం సైతం విమర్శలకు తావిస్తోంది. బ్యాట్స్‌మన్‌గా ఫామ్, కెప్టెన్‌గా విజయాలు సాధించినంత కాలం ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే ధోరణి నుంచి విరాట్ కోహ్లి బయటపడాలి. మేటీ బ్యాట్స్‌మన్‌గా ఎదుగుతోన్న కోహ్లి.. రహానె వంటి ఆటగాడి విషయంలో ద్వంద ప్రమాణాలు పాటించి ఉండాల్సినది కాదు. ఈ విషయంలో కోహ్లి కెప్టెన్సీకి మరక అంటింది. ఈ అనుమానాలు మరింత బలపడకముందే విరాట్ కోహ్లి మేల్కొంటే భారత క్రికెట్‌కు మంచి జరుగుతుంది.

రాణించిన అశ్విన్

- మార్క్రం, ఆమ్లా అర్ధ శతకాలు
- తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 269/6
- ఆఖర్లో అదరగొట్టిన హార్దిక్ ఫీల్డింగ్
- సఫారీతో రెండోటెస్టు తొలిరోజు

బౌన్సీ సెంచూరియన్ పిచ్‌పై స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మెరిశాడు. ఓపెనర్లను అవుట్ చేశాడు. అయితే సొంతగడ్డపై ఆడుతోన్న దక్షిణాఫ్రికా మ్యాచ్‌పై పట్టు కోల్పోలేదు. సెంచరీ ముంగిట క్రీజును వీడిన మార్క్రం, హషీమ్ ఆమ్లాలు రాణించడంతో సఫారీలు చెప్పుకోదగ్గ స్కోరు నమోదు చేశారు. అశ్విన్ అద్వితీయ బౌలింగ్‌కు హార్దిక్ పాండ్య మెరుపు ఫీల్డింగ్ తోడవటంతో ఆఖరు నిమిషాల్లో డుప్లెసిస్ సేన మూడు వికెట్లు కోల్పోయింది. తొలి రోజు ఆటముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 269/6తో ఉన్నది.

నవతెలంగాణ-సెంచూరియన్

సెంచూరియన్ టెస్టులో తొలిరోజు భారత్ ఆధిపత్యం చలాయించకపోయినా..ప్రత్యర్థి కీలక వికెట్లను పడగొట్టటంలో సఫలమైంది. ఆఖరు సెషన్‌లో రెండు ఓవర్ల వ్యవధిలో మూడు వికెట్లు కూల్చిన కోహ్లి సేన కీలక బ్యాట్స్‌మెన్‌ను పెవిలియన్ పంపించింది. అనుకున్నట్టుగానే భారత తుది జట్టులో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఓపెనర్‌గా శిఖర్ ధావన్ స్థానంలో కేఎల్ రాహుల్‌కు తుది జట్టులో చోటు దక్కింది. బౌలర్లలో భువనేశ్వర్ స్థానంలో ఇషాంత్ శర్మను తీసుకున్నాడు కోహ్లి. ఇషాంత్ ఒక వికెట్ తీయగా ఆశ్చర్యకరంగా సెంచూరియన్ బౌన్సీ పిచ్‌పై స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (3/90) మెరిశాడు. ఓవరాల్‌గా భారత బౌలింగ్ బృందం కట్టుదిట్టమైన బౌలింగ్ చేయనప్పటికీ ఫరవాలేదనిపించారు. దక్షిణాఫ్రికా నిలకడైన ఆటతీరు కనబర్చింది. ఓపెనర్ ఏడెన్ మార్క్రం (94), ఆమ్లా (82) రాణించారు. దీంతో తొలి రోజు ఆటముగిసే సమయానికి ఆరు వికెట్ల నష్టానికి తొలి ఇన్నింగ్స్‌లో 269 పరుగులతో కొనసాగుతోంది దక్షిణాఫ్రికా.

అశ్విన్ మాయ : టాస్ నెగ్గిన దక్షిణాఫ్రికా తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నది. తొలి వికెట్ కోసం నిరీక్షించిన భారత్‌కు ఎల్గార్ (31) రూపంలో తొలి వికెట్ అందించాడు అశ్విన్. భుజానికి తాకి దోబూచులాడిన బంతిని విజయ్ ఎట్టకేలకు ఒడిసి పట్టటంతో దక్షిణాఫ్రికా తొలి వికెట్ కోల్పోయింది. సెంచరీ దిశగా దూసుకెళ్లిన మరో ఓపెనర్ మార్క్రం (94) సైతం అశ్విన్ బౌలింగ్ కీపర్ పార్థివ్ పటేల్ చేతికి క్యాచ్ ఇచ్చాడు. ఇషాంత్ శర్మ చేతిలో ఫామ్‌లో ఉన్న డివిలియర్స్ బౌల్డయ్యాడు. 65 ఓవర్లు ముగిసే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసింది దక్షిణాఫ్రికా. పాండ్య అద్భుతమైన ఫీల్డింగ్ తళుకులతో ఆమ్లా (82)ను రనౌట్ చేశాడు. రెండు బంతుల వ్యవధిలోనే డికాక్ డకౌట్‌గా వెనుదిరిగాడు. అశ్విన్ బౌలింగ్‌లో స్లిప్స్‌లో కోహ్లికి చిక్కాడు. ఫిలాండర్ (0) పాండ్య, పార్థివ్‌ల సమన్వయంతో రనౌట్ అయ్యాడు. డుప్లెసిస్ (24 బ్యాటింగ్), కేశవ్ మహరాజ్ (10 బ్యాటింగ్) క్రీజులో కొనసాగుతున్నారు.



అశ్విన్ 31-8-90-3

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : డీన్ ఎల్గార్ (సి) మురళీ విజయ్ (బి) రవిచంద్రన్ అశ్విన్ 31, ఏడెన్ మార్క్రం (సి) పార్థివ్ పటేల్ (బి) రవిచంద్రన్ అశ్విన్ 94, హషీమ్ ఆమ్లా రనౌట్ (హార్దిక్ పాండ్య) 82, ఏబీ డివిలియర్స్ (బి) ఇషాంత్ శర్మ 20, డుప్లెసిస్ బ్యాటింగ్ 24, క్వింటన్ డికాక్ (సి) విరాట్ కోహ్లి (బి) అశ్విన్ 0, వెర్నన్ ఫిలాండర్ రనౌట్ (పార్థివ్ పటేల్/హార్దిక్ పాండ్య) 0, కేశవ్ మహరాజ్ బ్యాటింగ్ 10, ఎక్స్‌ట్రాలు 8, **మొత్తం : (90 ఓవర్లలో 6 వికెట్లకు) 269.**

వికెట్ల పతనం : 1-85, 2-148, 3-199, 4-246, 5-250, 6-251.

బౌలింగ్ : బుమ్రా 18-4-57-0, మహమ్మద్ షమి 11-2-46-0, ఇషాంత్ శర్మ 16-3-32-1, హార్దిక్ పాండ్య 14-4-37-0, అశ్విన్ 31-8-90-3.

ఎవరు ఎవరికో!

- 1122 మంది క్రికెటర్ల రిజిస్ట్రేషన్

ఐపీఎల్ వేలం

న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వేలానికి ఏర్పాట్లు మొదలయ్యాయి. వేలంలో పాల్గొటానికి యువరాజ్ సింగ్, గౌతం గంభీర్ సహా షేన్ వాట్సన్, జో రూట్ వంటి పలువురు స్వదేశీ, విదేశీ క్రికెటర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొత్తం 1122 మంది వేలానికి పేర్లు నమోదు చేసుకున్నట్టు బీసీసీఐ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. వీరిలో 281 మంది క్యాప్‌డ్, 838 మంది అన్‌క్యాప్‌డ్ ఆటగాళ్లున్నారు. ఈ వేలంలో భారత క్రికెటర్లు స్పిన్నర్ అశ్విన్ రవిచంద్రన్, గౌతం గంభీర్, యువరాజ్ సింగ్ సహా మణికట్టు మాంత్రికుడు కుల్దీప్ యాదవ్ అందుబాటులో ఉన్నారు. వీరిని ఎవరు కొనుగోలు చేస్తారనే విషయమై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. కోల్‌కతా జట్టు గంభీర్‌ను, హైదరాబాద్ జట్టు యువీను అట్టిపెట్టుకోకుండా వదిలేసిన సంగతి తెలిసిందే. ఆటగాళ్ల జాబితాలను బీసీసీఐ ఆయా ఫ్రాంచైజీలకు పంపించింది. ఐపీఎల్ పదో సీజన్‌లో పంజాబ్ తరఫున ఆడిన హషీం ఆమ్లా సహా డుప్లెసిస్, మోర్నీ మోర్కెల్, రబాడాలకు వేలంలో అత్యధిక ధర పలికే అవకాశమున్నది.

హెచ్‌సీఏ అవినీతిపై బీసీసీఐకు అజారుద్దీన్ లేఖ

- హెచ్‌సీఏ అధ్యక్ష పదవికి వివేక్ అనర్హుడు
- టీపీఎల్ టోర్నీ చట్టవిరుద్ధం: అజారుద్దీన్



నవతెలంగాణ- సిటీబ్యూరో

"సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, లోథా కమిటీ సిఫార్సుల ప్రకారం ఓ రాజకీయ నాయకుడు హెచ్‌సీఏ ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేదు. వివేక్ తన పలుకుబడితో లోథా కమిటీని ప్రభావితం చేశాడు. హెచ్‌సీఏ అధ్యక్ష పదవికి వివేక్ అనర్హుడు. తెలంగాణ ప్రీమియర్ లీగ్(టీపీఎల్)కు బీసీసీఐ అనుమతి లేదు. ఇది కచ్చితంగా చట్టవిరుద్ధం. హెచ్‌సీఏ అవినీతిమయంగా మారింది. ఈ విషయాలపై బీసీసీఐకు, పాలకుల కమిటీకి లేఖ రాశా" అని టీమిండియా మాజీ కెప్టెన్ అజారుద్దీన్ చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లా డుతూ...టీపీఎల్‌ను ఒకప్పుడు వ్యతిరేకించి, ఇప్పుడెందుకు సమర్థిస్తున్నారని రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)ను టీఆర్‌ఎస్ పార్టీ నాయకులు నిర్వహించడం చట్ట వ్యతిరేకమన్నారు. ప్రభుత్వంలో క్యాబినెట్ ర్యాంక్ కలిగిన వివేక్, తన తండ్రి పేరుతో టోర్నమెంట్ నిర్వహిస్తూ, హెచ్‌సీఏ లోగోను ప్రచారానికి ఎలా వినియోగించుకుంటారని నిలదీశారు. ఐపీఎల్, తమిళనాడు, కర్నాటక ప్రీమి యర్ లీగ్‌లకు బీసీసీఐ అనుమతి ఉందని, టీపీఎల్‌కు బీసీసీఐ అనుమతి లేదని గుర్తు చేశారు. లీగ్‌లో ఆడిన క్రీడాకారులకు ఏ ప్రయోజనమూ ఉండకపోగా, పనికిరాని సర్టిఫికెట్లతో క్రికెటర్ల భవిష్యత్ అంధకారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

సత్తా చాటాలి

- నేడే ఆస్ట్రేలియాతో భారత్ తొలి పోరు
- అండర్ 19 ప్రపంచ కప్

మౌంట్ మాంగనుయి : భారత భావి తారల తొలి పోరు అండర్ 19 ప్రపంచ కప్ తొలి పోరు నేడే. పృథ్వీ షా నేతృత్వంలోని భారత్ గ్రూప్ బి తొలి మ్యాచ్‌లో కుర్ర కంగారూలను ఢీకొట్టనున్నది. క్రమశిక్షణకు మారుపేరైన రాహుల్ ద్రవిడ్ శిక్షణలో అత్యుత్తమ ఫామ్‌తో ఉన్నది యువ భారత్. దేశవాళీ టోర్నీలలో పరుగుల సునామీ, వికెట్ల వరద పారించిన ఆటగాళ్లు.. ఆరంభ మ్యాచ్‌లో అదరగొట్టాలని ఉవ్విళ్లూరు తున్నారు. జట్టు సిద్ధపాటుపై కెప్టెన్ పృథ్వీ షా మాట్లాడుతూ.. ' గతవారంగా ఇక్కడే ఉంటున్నాం. కొన్ని ప్రాక్టీసు మ్యాచులు సైతం ఆడాం. సిద్ధపాటు బాగుంది. వాతావరణం కూడా అలవాటైంది. ప్రపంచ కప్ గెలవటమే మా లక్ష్యం. అయితే ప్రతి గేమ్ లోనూ మా ఉత్తమ ఆటతీరు కనబరచటానికి ప్రయత్నిస్తాం.' అని తెలిపాడు.

ఫైనల్లో బెంగళూర్

నేడు హైదరాబాద్‌తో టైటిల్ పోరుకు సై

- సెమీస్‌లో అహ్మదాబాద్‌పై 4-3తో గెలుపు
- ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్-3

నవతెలంగాణ క్రీడాప్రతినిధి-గచ్చిబౌలి

నువ్వా నేనా అంటూ ఆద్యంతం ఉత్కంఠ రేపిన పీబీఎల్ రెండో సెమీఫైనల్లో బెంగళూర్ బ్లాస్టర్స్ (సచిన్ టెండూల్కర్ సహ యజమాని) మెరిసింది. అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌పై 4-3తో గెలుపొంది టైటిల్ పోరుకు చేరుకున్నది. ఆఖరి మ్యాచ్ వరకూ సాగిన సెమీస్‌లో సిక్కి రెడ్డి, కిమ్ స రంగ్‌లు మిక్స్‌డ్ డబుల్స్‌లో మెరుపు విజయంతో బెంగళూర్‌ను ఫైనల్స్‌కు చేర్చారు. బెంగళూర్ తరఫున అగ్రశ్రేణి షట్లర్ విక్టర్ అక్సెల్సన్ కీలక ప్రదర్శన చేశాడు. నేడు హైదరాబాద్ హంటర్స్‌తో బెంగళూర్ బ్లాస్టర్స్ అమీతుమీ తేల్చుకోనున్నది.

పీబీఎల్ ఫైనల్స్
హైదరాబాద్ x బెంగళూర్
రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

ఆద్యంతం ఉత్కంఠ : బెంగళూర్ బ్లాస్టర్స్, అహ్మదా బాద్ స్మాష్ మాస్టర్స్ మధ్య రెండో సెమీఫైనల్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. ఆఖరి మ్యాచ్ వరకూ ఏ జట్టుకూ స్పష్టమైన ఆధిక్యం దక్కలేదు. దీంతో ఫలితం కోసం మిక్స్‌డ్ డబుల్స్ వరకూ ఆగక తప్పలేదు. తొలుత మెన్స్ సింగిల్స్ తొలి మ్యాచ్‌లో అహ్మదాబాద్ బోణీ కొట్టింది. సీనియర్ షట్లర్ చాంగ్ వీ ఫెంగ్ (బెంగళూర్) వరుస సెట్లలో సౌరభ్ వర్మ చేతిలో ఓటమి పాలయ్యాడు. మూడు గేముల మ్యాచ్‌లో 15-2, 14-15, 15-10తో సౌరభ్ విజయం సాధించాడు. తర్వాతి మెన్స్ డబుల్స్‌ను బెంగళూర్ ట్రంప్‌గా ఎంచుకున్నది. బొయె మథియస్, కిమ్ స రంగ్ జోడీ బెంగళూర్ ఆశలను నిలిపారు. 15-13, 15-12తో కిదాంబి నందగోపాల్, లీ చెన్ హుయ్‌లపై వరుస సెట్లలో గెలుపొందారు. దీంతో బెంగళూర్ రెండు పాయింట్లు దక్కించుకున్నది. మహిళల సింగిల్స్‌ను అహ్మదాబాద్ ట్రంప్‌గా ఎంచుకోగా.. వరల్డ్ నెం.1 తైజు యింగ్ సూపర్ ప్రదర్శన చేసింది. స్కాట్లాండ్ అమ్మాయి క్రిస్టీ గిల్మర్ పోరాడినా.. తైవాన్ స్టార్‌ను నిలువరించలేదు. మూడు గేముల ఈ మ్యాచ్‌లో 8-15, 15-13, 15-8తో తైజు యింగ్ గెలుపొందింది. దీంతో అహ్మదాబాద్‌కు రెండు పాయింట్లు లభించాయి. తొలి మూడు మ్యాచులు ముగిసే సరికి అహ్మదాబాద్ 3-2తో ముందంజ వేసింది. కీలక మెన్స్ సింగిల్స్ రెండో మ్యాచ్‌లో అగ్రశ్రేణి షట్లర్ విక్టర్ అక్సెల్సన్ బెంగళూర్‌కు వరుస సెట్ల విజయాన్ని అందించాడు. అహ్మదాబాద్ ఆటగాడు హెచ్.ఎస్ ప్రణయ్ ఆకట్టుకున్నా.. విక్టర్‌ను అడ్డుకోలేదు. 15-11, 15-14తో నెగ్గిన విక్టర్ స్కోర్లు సమం చేశాడు. నాల్గు మ్యాచులు పూర్తయ్యేసరికి ఇరు జట్లూ 3-3తో సమవుజ్జగా నిలిచాయి. ఐదో మ్యాచ్, మిక్స్‌డ్ డబుల్స్ పోరు విజేతను నిర్ణయించింది. సిక్కి రెడ్డి-కిమ్ స రంగ్ (బెంగళూర్), కమిల, లా హిమ్ (అహ్మదాబాద్)లు నువ్వా నేనా అన్నట్టు తలపడటంతో ఈ మ్యాచ్ సైతం మూడో గేమ్‌కు దారితీసింది. తొలి గేమ్‌లో 15-12తో బెంగళూర్ నెగ్గగా, రెండో గేమ్‌లో 15-13 తో అహ్మదాబాద్ పైచేయి సాధించింది. ఫైనల్స్ బెర్త్‌ను నిర్ణయించే మూడో గేమ్‌లో విరామ సమ యానికి 8-6తో బెంగళూర్ ముందంజ వేసింది. ద్వితీయా ర్థంలోనూ సిక్కి రెడ్డి, కిమ్ స రంగ్‌లు మెరవ టంతో 15-9తో బెంగళూర్ గెలుపొందింది. పీబీఎల్ ఫైనల్స్ బెర్త్ దక్కించుకున్నది.



తైజు యింగ్

నేడు పీబీఎల్ ఫైనల్ పోరు : పీబీఎల్ లీగ్ దశలో ఎదుర్కొన్న ఆఖరి ప్రత్యర్థితో హైదరాబాద్ హంటర్స్ టైటిల్ పోరుకు సిద్ధమైంది. రెండు జట్లలోనూ అగ్రశ్రేణి షట్లరు ఉండటంతో నేడు తుది పోరుపై ఆసక్తి రెట్టింపు అవుతోంది. హైదరాబాద్ తరఫున కరొలినా మారిన్, సాయి ప్రణీత్ సహా డబుల్స్ స్పెషలిస్టులు ఉన్నారు. బెంగళూర్‌లో విక్టర్ అక్సెల్సన్, క్రిస్టీ గిల్మర్‌లు కీలకం కానున్నారు.

రామ్‌కుమార్ ముందంజ

ఆస్ట్రేలియా ఓపెన్ రెండో అర్హత పోరులో గెలుపు

మెల్‌బోర్న్ : భారత టెన్నిస్ ఆటగాడు రామ్‌కుమార్ రామనాథన్ ఆస్ట్రేలియా ఓపెన్ ప్రధాన టోర్నీకి విజయం దూరంలో నిలిచాడు. శనివారం జరిగిన రెండో అర్హత మ్యాచ్‌లో గ్లెబ్ సకరోవ్ (ఫ్రాన్స్)పై 6-4, 7(12)-6(10)తో గెలుపొందాడు. ప్రత్యర్థి గట్టిపోటీనివ్వగా దాదాపు రెండు గంటలు సాగిన పోరును.. రామ్‌కుమార్ రెండు గేముల్లోనే ముగించటం విశేషం. 28వ సీడ్ రామ్‌కుమార్ మ్యాచ్‌లో అన్‌సీడెడ్ గ్లెబ్‌పై 17 ఏస్‌లు సంధించాడు. ప్రధాన టోర్నీలో అడుగుపెట్టటానికి నేడు రామ్‌కుమార్.. ఐదో సీడ్ వాసెక్ పోస్పిసిల్ (కెనడా)తో తలపడనుండగా.. మరో భారత ఆటగాడు యుకీ బాంబ్రీ.. పీటర్ పొలాన్‌స్కీ (కెనడా)ను ఢీ కొట్టనున్నాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.